

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



visit us @ http://epaper.suryaa.com
గురువారం | 2 జనవరి 2020 | హైదరాబాద్
సంపుటి 14 | సంచిక 72
| పేజీలు 12+12 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత రుతువు, పుష్య మాసం, శుక్ల పక్ష తిథి : సప్తమి రా.9.00, ఉత్తరాభాద్ర ఉ.7.20, వర్జ్యం మ.3.10 నుంచి 4.58 వరకు,
రాహుకాలం: మ.1.30 నుంచి 3.00 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.35 నుంచి 11.19 వరకు, తిరిగి మ.3.01 నుంచి 3.45 వరకు, సూర్యోదయం: ఉ.6.34 గం సూర్యాస్తమయం: సా.5.38



సరిహద్దుపై దృష్టి

- సమస్యపై ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు
- చైనాతో సమస్యకు త్వరలో సానుకూల పరిష్కారం
- ఇప్పటి వరకు పశ్చిమం వైపే దృష్టి
- ఉత్తర ప్రాంతానికీ అంతే ప్రాధాన్యం
- ఆర్మీ చీఫ్ నరవణె ఆశాభావం

6లో

రాజకీయాలకు దూరం

- ఆర్మీ, వాయు, నౌకా దళ సేనలు ఒక జట్టుగా పని చేస్తాయి
- అన్ని విభాగాల మధ్య మరింత సమన్వయం అవసరం
- కేంద్రంలో అధికారంలో ఉన్న వారు చేసే సూచనల మేరకు పని చేస్తాం
- త్రిదళాధిపతి బిపిన్ రావత్



సిడిఎస్ చరిత్రాత్మకం

- వ్యవస్థ భారత మిలిటరీని ఆధునికం చేస్తుంది : మోడీ
- నూతన దశాబ్దం సందర్భంగా సీడీఎస్ రావడం సంతోషంగా ఉంది
- మన మిలిటరీ మరింత బలోపేతం కావడానికి ఇది తోడ్పడుతుంది
- 130 కోట్ల ప్రజల ఆకాంక్షలను ఈ వ్యవస్థ నెరవేరుస్తుంది

నూతన సంవత్సరం, నూతన దశాబ్దం ప్రారంభం సందర్భంగా మన దేశానికి తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) రావడం సంతోషంగా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సిడిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన బిపిన్ రావత్‌కు మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం కోసం ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. తొలి సిడిఎస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని చెప్పారు.



6లో

పదేళ్లు కేసీఆరే సీఎం

మీడియాతో చిట్‌చాట్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఈ దశాబ్దం టీఆర్ఎస్‌దే
- 2020 టీఆర్ఎస్ నామ సంవత్సరం
- రాజకీయంగా శాశ్వత శత్రువులు, మిత్రులు లేరు
- మాకు కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటే
- ఎంఐఎంతో కలిసి పోటీ చేయం
- గతంలో చేయలేదు... ఇప్పుడు చేయం
- మునిసిపల్ చట్టం అమలే నా ముందున్న ఛాలెంజ్
- పార్టీలకతీతంగా పురపోరులో గెలిచినవారికి శిక్షణ
- చట్టంలోని నిబంధనలు అభ్యర్థులు తెలుసుకుంటే మంచిది
- పల్లె, పట్టణ ప్రగతి సమాంతరంగా జరిగితే అద్భుత ఫలితాలు



2లో



రూ. లక్ష కోట్లు దాటిన డిసెంబర్
జిఎస్‌టి వసూళ్లు

- రూ. 1.03 లక్షల కోట్లు వసూలు
- నిరుటితో పోలిస్తే 6 శాతం వృద్ధి
- సెస్ రూపంలో రూ. 7,727 కోట్ల వసూళ్లు

5లో



సీఎం ఆస్తుల్లో వృద్ధి
రెండు ఆవులు, దూడ

- 2018లో ఎనిమిది ఆవులు, ఆరు ఆవు దూడలు
- 2019లో ఆవుల సంఖ్య పది, దూడల సంఖ్య ఏడు

6లో



18 తరువాత
మాల్యా ఆస్తుల వేలం

- అనుమతినిచ్చిన ముంబై కోర్టు
- ముంబై కోర్టులో అప్పీల్‌కు అవకాశం
- ఆస్తుల విలువ రూ.13 వేల కోట్లు అని అంచనా

5లో

మంచినీళ్లలా తాగేశారు

- 380 కోట్ల మద్యం విక్రయాలు
- మామూలు రోజుల్లో 70 కోట్ల వరకూ అమ్మకాలు
- ఏడాది చివరి రెండు రోజులూ విచ్చలవిడిగా విక్రయాలు
- 4.85 లక్షల కేసుల మద్యం
- 5.10 లక్షల కేసుల బీరు
- ఒక్క డిసెంబర్ నెలలోనే 2050కోట్ల మద్యం ఉఫ్
- ఎక్సయిజ్ శాఖ గణాంకాలలో వెల్లడి

తెలంగాణ రాష్ట్రంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం ప్రియులు మద్యంలో మునిగి తేలారు. డిసెంబరు 30, 31 తేదీల్లో రూ.380 కోట్లు విలువైన మద్యాన్ని మంచినీళ్ల ప్రాయంలా మందుబాబులు తాగేశారు. సాధారణంగా రోజుకు రూ.60 నుంచి 70 కోట్లు మద్యం విక్రయాలు జరుగుతాయి. అయితే 30, 31 తేదీలల్లో ఏకంగా దాదాపు రూ.380 కోట్ల విలువైన మద్యం విక్రయం జరిగింది.



3లో

చంద్రయాన్-3కి ఓకే



6లో

- 2020లో ఇస్రో లక్ష్యాలు 25
- చంద్రయాన్-3 పనులు ప్రారంభమయ్యాయి
- గగన్ యాన్ కోసం ఐఏఎఫ్ నుంచి వ్యోమగాములను ఎంపిక చేశాం
- ఇస్రో ఛైర్మన్ శివన్
- చంద్రయాన్-3కి రూ. 250 కోట్లు ఖర్చవుతుంది
- తూత్తుకుడి కోసం రెండో స్పేస్ పోర్టును నెలకొల్పుతున్నాం

ప్రజా సమస్యల పరిష్కారానికి
ప్రత్యేక వ్యవస్థ



3లో

అంతా ఇంతే!



ఈ సారైనా రాకెట్ తిన్నగా వెళ్లేలా చూడమని చెబుదాం...

ముక్కోణ ఆకారంలో పార్లమెంటు

2022కు నిర్మాణం పూర్తి

- రాష్ట్రపతి భవన్‌కు చేరువలో ఉప రాష్ట్రపతి నివాసం
- పాత భవనంలో ప్రదర్శనశాలలు ఏర్పాటు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన పార్లమెంటు భవనం ముక్కోణ ఆకారంలో ఉంటుందని అంటున్నారు. ప్రస్తుత పార్లమెంటు భవనానికి దగ్గరలోని ఇది నిర్మితం కానుంది. 2022 నాటికి కొత్త భవనం పూర్తవుతుంది. రాజ్యసభ కూడా ఇందులోనే కొలువుతీరుతుంది. వెయ్యిమంది కూర్చునేందుకు వీలుగా లోక్‌సభను నిర్మిస్తారు. ప్రస్తుత సెంట్రల్ హాల్ తరహాలో నూతన భవనంలో కామన్ లాంజ్‌ను రూపొందిస్తారు. కొత్త పార్లమెంటు భవనాన్ని నిర్మించినప్పటికీ పాతదాన్ని కూల్చబోరు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న పార్లమెంటు భవనాన్ని ఇతర అవసరాలకు వినియోగించే వీలుంది.

ఇండియా గేట్ సమీపంలో సెంట్రల్ విస్టాను అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రకారం.. ప్రస్తుతం 7- లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాన మంత్రి నివాసాన్ని రాష్ట్రపతి భవన్ సమీపానికి తరలిస్తారు. మౌలానా ఆజాద్ మార్గ్‌లోని ఉప రాష్ట్రపతి నివాసాన్ని రాష్ట్రపతి భవన్ పక్కకు తరలిస్తారు. రాష్ట్రపతి భవన్ వెనక వైపున 75 ఎకరాల్లో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ జాతీయ జీవ వైవిధ్య పార్కును ఏర్పాటుచేస్తుంది. మనదేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన మొక్కలను

మిగతా 6లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

నమ్మకద్రోహం చేసే వారు బాగుపడరు : మంత్రి ఈటల ఆసక్తికర వ్యాఖ్యలు



హుజూర్‌నగర్, మేజర్‌న్యూస్: టీఆర్ఎస్ సీనియర్ నేత, మంత్రి ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నమ్మకద్రోహం చేసే వారు బాగుపడరు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో మరీ ముఖ్యంగా టీఆర్ఎస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా మారాయి. బుధవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ లో టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఈటెల మాట్లాడారు. నాకు కొట్లాడటం తెలుసు.. కానీ.. దొంగ దెబ్బతీయడం తెలియదు అన్నారు. కోట్లు ఖర్చు చేశాను.. కానీ సంపాదించుకోలేదు అన్నారు. ఎవరి దగ్గర చేయి చాచలేదు అన్నారు. నమ్మినవారే మోసం చేస్తే బాధ కలుగుతుందన్నారు. ప్రజలు ధర్మం తప్పరు, అలా తప్పి ఉంటే నేను గెలిచేవాడిని కాదని ఈటెల చెప్పారు. క్యాంప్ రాజకీయాలు నా వల్ల కాదన్న ఈటెల.. గెలిచిన వాళ్లు విశ్వాసంగా ఉండాలన్నారు. కాగా..ఈటల చేసిన వ్యాఖ్యలు చర్చనీ యాంశంగా మారాయి. ఆయన ఎవరిని ఉద్దేశించి ఈ కామెంట్స్ చేశారు అనే చర్చ అటు విపక్షాలు ఇటు టీఆర్ఎస్ నాయకుల్లో జరుగుతోంది. ఇంతకీ ఈట ల చెప్పిన ఆ నమ్మకద్రోహులు ఎవరు? అని ఆరా తీస్తున్నారు. గతంలోనూ ఈటల రాజేందర్ ఈ తరహా కామెంట్స్ చేసి పార్టీ శ్రేణుల్లో కలకలం రేపారు. మంత్రి పదవి ఎవరి భిక్ష కాదు అంటూ గతంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ కోటాలో ఎప్పుడూ మంత్రి పదవి ఆశించలేదని చెప్పారు. తాను టీఆర్ఎస్‌లోకి మధ్యలో రాలేదని అన్నారు. తాను కూడా గులాబీ జెండా నిర్మాణంలో భాగస్వామినని ఉద్వేగంగా మాట్లాడారు. మరి దీనిపై టీఆర్ఎస్ నాయకులు, అధిష్టానం ఏ విధంగా రియాక్ట్ అవుతుందో చూడాలి.

సీఎం కేసీఆర్‌కు ప్రముఖుల శుభాకాంక్షలు







హైదరాబాద్, మేజర్‌న్యూస్: నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రగతి భవన్ లో బుధవారం పలువురు ప్రముఖులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు, టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవరావు, లోకసభ పక్ష నేత నామా నాగేశ్వర్ రావు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డిజిపి మహేందర్ రెడ్డి, పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, జెన్ కో ట్రాన్స్ కో సిఎండి దేవులపల్లి ప్రభాకర్ రావు తదితరులున్నారు. హైస్కూల్ విద్యార్థులకు అందించే మోడల్ డిక్షనరీని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జనార్ధన్ రెడ్డి ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా ఐనవోలు దేవాలయం, యాదాద్రి దేవాలయ క్యాలండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అలాగే టిఎస్పిఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, వివిధ కమిషన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

పదేళ్లు కేసీఆరే సీఎం

మీడియాతో చిట్‌చాట్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



• ఈ దశాబ్దం టీఆర్ఎస్‌దే • 2020 టీఆర్ఎస్ నామ సంవత్సరం • రాజకీయంగా శాశ్వత శత్రువులు, మిత్రులు లేరు • తమకు కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటే • ఎంఐఎంతో కలిసి పోటీ చేయం • గతంలో చేయలేదు... ఇప్పుడు చేయం • మునిసిపల్ చట్టం అమలే నా ముందున్న ఛాలెంజ్ • పార్టీలకతీతంగా పురపోరులో గెలిచినవారికి శిక్షణ • చట్టంలోని నిబంధనలు అభ్యర్థులు తెలుసుకుంటే మంచిది • పల్లె, పట్టణ ప్రగతి సమాంతరంగా జరిగితే అద్భుత ఫలితాలు • రాజకీయాల్లో ఎత్తు పల్లాలు సహజం • అవకాశాన్ని అనుకూలంగా మలచుకోవడంలో కేసీఆర్ దిట్ట • నీటి సమస్యల పరిష్కారం కోసమే • పొరుగు రాష్ట్రాలతో సత్‌సంబంధాలు • జగన్, చంద్రబాబుతోను కొనసాగించాం • టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీ రామారావు

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః 2020 టీఆర్ఎస్ నామ సంవత్సరం. ఈ దశాబ్దం టీఆర్ఎస్‌దే ఇంకో పదేళ్లు సీఎం గా తానే ఉంటానని అసెంబ్లీ వేదిగా కెసిఆర్ ప్రకటించారు ..ఇంకా ఊహాగానాలు దేనికి ?. మాకు శాశ్వత శత్రువులు ,మిత్రులు లేరు. మాకు కాంగ్రెస్ ,బీజేపీ లు రెండు సమానమే. ఎంఐఎం తో గతంలో కలసి పోటీ చేయలేదు. ఇప్పుడు పోటీ చేయం..మిత్ర పక్షం అయినంత మాత్రాన కలిసి పోటీ చేయాలని లేదని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ .మున్సిపల్ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయడం తన ముందున్న అతి పెద్ద చాలెంజ్ అని చెప్పుకొచ్చారు. అక్రమ నిర్మాణాలను ఎటువంటి నోటీసులు లేకుండా కూల్చేసే అధికారం ఈ చట్టం ద్వారా ప్రభుత్వానికి ఉందని పునార్ఘటించారు. ప్రజలకు కూడా ఈ చట్టం చాలా ఉపయోగ కరం గా ఉంటుందన్న ఆయన, పార్టీ లకు అతీతంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన వారందరికీ శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. మున్సిపల్ చట్టం లోని ప్రతీ నిబంధన పోటీ చేసే అభ్యర్థులు తెలుసుకుంటే మంచిదన్నారు. ఓ వైపు పల్లె ప్రగతి ,మరోవైపు పట్టణ ప్రగతి రెండు సమాంతరంగా జరిగితే అద్భుత ఫలితాలు వస్తాయని సీఎం భావిస్తున్నారని తెలిపారు. చాలా విషయాల్లో దేశంలో మన రాష్ట్రం ముందుందని, అక్షరాస్యత విషయం లో మనం వెనక బడటం పై సీఎం దృష్టి సారించారన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో సింహ భాగం గెలుస్తాం

రానున్నా మున్సిపల్ ఎన్నికల్లో సింహభాగం స్థానాలు టీఆర్ఎస్‌వేనని చెప్పారు. రాజకీయాల్లో ఎత్తు పల్లాలు ఉంటాయన్న కేటీఆర్, లోక్‌సభ ఎన్నికల్లో అనుకున్న ఫలితాలు రాలేదన్నారు. కానీ ఆతర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము విజయం సాదించామని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులు కేసీఆర్ కు జేజేలు కొడుతున్నారని, అవకాశాన్ని అనుకూలంగా మలుచుకోవడంలో కేసీఆర్ కంటే మించిన వారు లేరన్నారు. తెలంగాణ వస్తే నాయకత్వ లోపం ఏర్పడుతుందని వాదించిన వారే ఇప్పుడు దేశంలో కూడా ఈ తరహా నాయకత్వం అవసరమని కోరుతున్నారన్నారు. పురపాలన లో పౌరుల ను భాగస్వామ్యం చేసే దిశగా మేము అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఎన్ పి ఆర్ ,ఎన్ ఆర్సీ విషయంలో పార్టీ నిర్ణయం కంటే ప్రభుత్వ నిర్ణయమే ముఖ్యమన్న ఆయన, అందరి తో మాట్లాడి సీఎం ఓ నిర్ణయం తీసుకుంటారన్నారు. నీటి సమస్యల పరిష్కారం కోసమే పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నామని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి జగన్ తోనే కాదని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు సత్సంబంధాలు కొనసాగించామని పేర్కొన్నారు. తాము యాగం చేసినప్పుడు చంద్రబాబును పిలిచామని, రాజధాని శంకుస్థాపన కు ఆయన, సీఎం కేసీఆర్‌ను పిలిచారని గుర్తు చేశారు. గోదావరి నీటి ని కృష్ణా బేసిన్ కి ఏపీ ,తెలంగాణ కలిసి తరలించాలనే ఆలోచన ఉన్నప్పటికీ ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. టీ–పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కొనసాగుతారా? లేదా అనేది ఆయన వ్యక్తి గత నిర్ణయమన్న కేటీఆర్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను అంత ఈజీగా తీసుకోమని, తమకు ప్రధాన పోటీ కాంగ్రెస్ తోనే చెప్పారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న పార్టీ కాంగ్రెస్‌అని, ఇక బీజేపీ తన చిన్నప్పటి నుంచి అలానే ఉందన్నారు. ఆ పార్టీ అప్పుడు ఎలా ఉందో ఇప్పుడు అంతే ఉందన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఒక ఐపీఎస్ ఆఫీసర్ ను దూషించడం సరైంది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టే ఆలోచన చేస్తుందని, పూర్తి వివరాలు వచ్చాక..ఆర్థిక పరిస్థితి ని అంచనా వేయొచ్చునని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల కోసం చెప్పారా?..లేక విజన్ తో చెప్పారా?? అనేది కొద్ది రోజుల్లో తెలుస్తోందన్న కేటీఆర్, రాష్ట్రాలు భాగుంటేనే దేశం భాగుంటుందన్నారు. బెంగుళూరు ,హైదరాబాద్ మధ్య డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరితే..కేంద్రం బుందేల్ ఖండ్ లో ఏర్పాటు చేసిందని విమర్శించారు. తమకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాల్లో ,వాల్ల ఎంపీలు ఉన్న చోటే ఇండస్ట్రీలు ఏర్పాటు చేస్తే ఎంలాభమన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో ఫార్మా సీటీ ప్రారంభం అవుతుందని చెప్పారు. ఎల్లుండి ముంబైలో ఓరిగే ఫార్మా మీటింగ్ కు అటెండ్ కాబోతున్నానని తెలిపారు.

అదునుచూసి విమర్శనాస్త్రాలకు పదును

• దూకుడు పెంచుతున్న చంద్రబాబు • తన అవసరం తెలియజేసేలా రాజధాని ఆందోళనల్లో ప్రసంగాలు • వైసీపీవి తప్పుడు విధానాలని సంకేతాలు పంపే యత్నం • రాజధాని ఆందోళనల్లో టార్గెట్ జగన్? • వ్యూహాత్మకంగా అడుగులేస్తున్న టీడీపీ అధినేత • జగన్‌కు ఒక ఛాన్స్ ఇచ్చి మోసపోయారు అన్న చంద్రబాబు • ఇపుడు మీ తరఫున నేను పోరాడాల్సివస్తోందని వ్యాఖ్య • ప్రజల్లో టీడీపీయే మేలన్న భావన కలిగించే యత్నం? • వైసీపీకి ఇదే చివరి ఛాన్స్ అన్న భావన ప్రజల్లో కలిగించే దిశగా అడుగులు



(ఏపీ–పొలిటికల్ బ్యూరో) : వైసీపీ ప్రభుత్వం పంపిన ఏపీ రాజధాని తరలింపు సంకేతాల నేపథ్యంలో భగ్గుమంటున్న ఏపీ రాజకీయాలను తనకు అనుకూలంగా మల్చుకొనే దిశగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యూహాత్మక అడుగులులేస్తున్నారా? రాజధాని తరలింపు ప్రకటనతో అమరావతి పరిసర ప్రాంతాలలో సాగుతున్న ఆందోళనల్లో ప్రజలను ఉద్దేశించి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు ఆసక్తిరేవుతున్నాయి. రాజధాని తరలింపునకు వ్యతిరేకంగా మందడంలో జగిరిన నిరసన సభలో ప్రజలనుద్దేశించి ప్రతిపక్ష నేత చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. నన్ను మీరే ఓడించారు కదా అంటూ నవ్వుతూనే ప్రజలకు చురకలంటించారు. ప్రజల్లోనూ తప్పు ఉంది. తొలుత ప్రజావేదికను కూల్చివేస్తే మీరు మనకెందుకులే అనుకున్నారు. నా ఇల్లు ముంచే ప్రయత్నం చేస్తే అది చంద్రబాబు సొంత గొడవ అనుకున్నారు. ఇప్పుడు రాజధాని విషయం వచ్చేసరికి మీకు ఆందోళన మొదలైంది. వద్దు వద్దు అంటే ఒక్కసారి అని మీరే అవకాశం ఇచ్చారు. ఓట్లు వేసి గెలిపించారు.. కుంపటి పెట్టుకున్నారు. మీరు తప్పు చేసి.. ఇప్పుడు నన్ను పోరాటం చేయమంటున్నారు. కరెంట్ తీగను పట్టుకోవద్దు అంటే వినలేదు. ఇప్పుడు చూడండి ఎలా ఉందో.అంటూ ప్రజలకు చంద్రబాబు చురకలంటించారు. చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యల వెనక మర్మంలేకపోలేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకపుడు కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలలో టీడీపీకి తిరుగులేని బలముండేది. అలాంటి చోట ఎన్నడూలేని విధంగా గండి గత టీడీపీకి పడింది. ఒక్కఛాన్స్ అంటూ వచ్చిన వై.ఎస్.జగన్ కు ప్రజలు పట్టంకట్టారు. కానీ ఆయన అధికారంలోకి వచ్చాక రాజధానిని అమరావతి నుంచి విశాఖకు తరలించే ప్రయత్నం మొదలెట్టారు. దీంతో అమరావతి పరిసర సగ్రపాంతాలో ప్రకాశం, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వస్తున్న విషయం తెలిసిందే. ఇలా రాజధాని తరలింపుపై ఆగ్రహంగా ఉన్న ఈ జిల్లాల ప్రజల్లో మరింత కసిపెరిగేలా చంద్రబాబు వ్యాఖ్యలు ఉన్నాయని, తద్వారా వైసీపీపై ఎనలేని వ్యతిరేకత పెరిగేలా టీడీపీ అధినేత వ్యాఖ్యలు ఉన్నాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

రాజధాని తరలింపు అంశం టీడీపీకి బ్రహ్మాస్త్రంగా మారనున్నదా? : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేని విధంగా అనేక సమస్యలు తెరపైకి వచ్చాయి. వీటిపై టీడీపీ సైతం అంతే దూకుడుతో ఆందోళనలు చేపట్టింది. కానీ ఆ పార్టీకి వచ్చిన పోరాట ఫలితం మాత్రం నామమాత్రం. ఈ పోరాటాలు టీడీపీని సంక్షోభం నుంచి గట్టెక్కించలేకపోయాయి. ఇదే సందర్భంలో టీడీపీ నుంచి పార్టీ నేతలు వైసీపీ, బీజేపీ వైపునకు వెళ్లడం మాత్రం ఆగలేదు. కానీ వైసీపీ ప్రభుత్వం ఇటీవల చేసిన మూడు రాజధానుల ప్రకటన మాత్రం టీడీపీకి కాస్త కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అమరావతి పరిసర ప్రాంతాల రైతులకు మద్దతుగా టీడీపీ పోరాటాలు ఉధృతం చేసింది. ఈ నేపథ్యంలో ఇక తమకు అండగా ఉండేది టీడీపీయేనని ప్రజల్లో భావన కలిగించేలా చంద్రబాబు వ్యూహాత్మక అడుగులేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా రాజధాని తరలింపును అస్త్రంగా మల్చుకొని వైసీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడం ద్వారా వలసవెళ్లే ఆలోచనవున్న టీడీపీ నేతలు సైతం వెనకడుగువేసే పరిస్థితిని చంద్రబాబు నాయుడు సృష్టిస్తున్నారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

టార్గెట్ జగన్?: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశమున్నందున వీటిలో సత్తాచాటడం తనముందున్న లక్ష్యంగా టీడీపీ నాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో బలంగానున్న వైసీపీని ఎదుర్కొనేం దుకు రాజధాని తరలింపు అంశాన్నే అస్త్రంగా మల్చుకోవాలని చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాజధాని తరలింపు అంశాన్ని సెంటిమెంటుగా రగిల్చాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వైసీపీ తీసుకొంటున్న విధాన పరమైన నిర్ణయాలను, వైసీపీ చేపడుతున్న చర్యల నష్టాల తీవ్రతను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని టీడీపీ అధినేత భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బుధవారంనాడు రాజధాని రైతుల ఆందోళనలో చంద్రబాబు వారిని ఉద్దేశించి నన్ను మీరు ఓడించి ఇపుడు పోరాడమంటారా అని నవ్వుతూ కీలక వ్యాఖ్యలు చేశారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే సందర్భంలో జగన్ ను ఉద్దేశించి చంద్రబాబు మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. అనాడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రతి ఊరు తిగిరి ముద్దులు పెట్టారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పిడిగుద్దులు గుద్దుతున్నారని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు విమర్శించారు. వెకిలినవ్వులు నవ్వుతున్నారని, పక్కన ఇంకొక వ్యక్తి ఎగి రెగిరిపడుతున్నాడని మండిపడ్డారు. ఇవన్నీ చూస్తుంటే అసహ్యమేస్తోందని, కానీ ఇవన్నీ తాను ఎందుకు భరిస్తున్నానంటే తనకోసం కాదని, ప్రజలు, రాష్ట్రం కోసమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇలా తాను నిత్యం ప్రజల కోసమే ఉన్నాన్న భావనతోపాటు రాష్ట్రం తనతోనే బాగుపడుతుందన్న భావన ప్రజల్లో కలిగించే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

రాష్ట్ర కమిటీతో కేటీఆర్ ప్రత్యేక భేటీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహం పైన రాష్ట్ర కమిటీ, సీనియర్ నాయకులతో తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కె. తారక రామారావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత వారం జరిగిన సమావేశంలో చర్చించిన పలు అంశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకొని వివరాలు సేకరించాలని గతంలో కేటీఆర్ ఆదేశించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కార్యాచరణ కు సంబంధించి పలు సలహాలను సూచనలను కేటీఆర్, పార్టీ నాయకులకు అందించారు. అతి త్వరలో ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు కె చంద్రశేఖరరావు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో ఒక ఉమ్మడి సమావేశాన్ని నిర్వహిస్తారని, ఆ సమావేశంలో పార్టీ అనుసరించే వ్యూహం పైన మార్గదర్శనం చేస్తారని ఈ సందర్భంగా కే టిఆర్ తెలియజేశారు. సమావేశం సందర్భంగా పార్టీ కమిటీ సభ్యులకు, నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ భవన్‌లో పలువురు పార్టీ నాయకులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు కార్యనిర్వాహక అధ్యక్షులు కె టి రామారావు ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది పార్టీ సాధించిన గొప్ప విజయాలను ఈ సంవత్సరంలో కేటీఆర్ నాయకత్వంలో కొనసాగుతాయని ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

టీఆర్ఎస్ పాలనలో విచ్చలవిడిగా అవినీతి: నవీన్ ముదిరాజ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సీఎం కేసీఆర్ పాలనలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని టీ కాంగ్రెస్ నేత చింతల నవీన్ ముదిరాజ్ విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో టీఆర్ఎస్ నేతలు కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కేటాయించకుండానే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదన్నారు. గతంలో ఆయా ప్రభుత్వాలు ముందుగా రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం కేసీఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడ్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని, మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి ఎదురు దెబ్బ తప్పదని నవీన్ ముదిరాజ్ హెచ్చరించారు.

వంద శాతం అక్షరాస్యత సాధనకు కృషి

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: టి ఎస్ టి యు రాష్ట్ర సంఘ అధ్యక్షుడు అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల బాధ్యులు బుధవారం ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు పిలుపు మేరకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు మరొకరికి విద్యాబోధన చేసి 100% అక్షరాస్యత లక్ష్యాన్ని చేరుకునే విధంగా కృషిచేయాలని కోరారు. టి ఎస్ టి యు రాష్ట్ర సంఘం కూడా ముఖ్యమంత్రి పిలుపు మేరకు పనిచేసి బంగారు తెలంగాణ సాధనకు పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా 2020 సంవత్సరం నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి అబ్దుల్లా, చందూరి రాజి రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మన నరసింహారెడ్డి, నరేందర్ రెడ్డి, సీతారాం రెడ్డి , రహమతుల్లా సురేందర్ , శ్రీనివాస్ రెడ్డి, కొమురయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ చాలెంజ్‌లో పాల్గొన్న ఎంపీ కవిత



హైదరాబాద్, మేజర్‌న్యూస్: మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత గ్రీన్ ఛాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మరో ముగ్గురికి గ్రీన్ ఛాలెంజ్‌ను విసిరారు. రెడ్యా నాయక్, కాంతరావు, పెద్ది సుదర్శన్ రెడ్డిలకు మొక్కలు నాటాల్సిందిగా ఎంపీ కవిత గ్రీన్ ఛాలెంజ్‌ను విసిరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎంపీ సంతోష్ కుమార్ ఎంతో పట్టుదలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం దిగ్విజయానికి మనమం దరం సహకారం అందించాలన్నారు. తన జన్మదిన దినోత్సవాన్ని పురస్కరిం చుకుని కవిత పేదలకు దుప్పట్లు, బడి పిల్లలకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదరహితంగా న్యూ ఇయర్ వేడుకలు

డీజీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో కొత్త సంవత్సర వేడుకల్లో ఎలాంటి ప్రమాదాలు గానీ, అపశృతులు గానీ జరగలేవని డీజీపీ మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రమాదరహిత కొత్త సంవత్సరపు వేడుకలు జరిగాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించిన రాష్ట్ర ప్రజానీకానికి డీజీపీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందుకు గానూ సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసులను డీజీపీ మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. నూతన సంవత్సరం సందర్భంగా డీజీపీ మహేందర్ రెడ్డి.. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు. అనంతరం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం హోం మంత్రి మహమూద్ అలీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈచ్ వన్ టీచ్‌వన్‌లో స్వచ్ఛందంగా పాల్గొంటాం : పెన్షనర్స్ సంఘం

ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్‌తో భేటీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఈచ్ వన్ టీచ్ వన్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు స్పందించి స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. కెసిఆర్ సంకల్పానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ పెన్షనర్ల సంఘం నాయకులు తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పిలుపును విజయవంతం చేసేందుకు స్వచ్ఛందంగా, అంకితభావంతో కృషి చేస్తామని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రకటించింది. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నరసయ్య నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి ఇనగంటి నవనీత రావు, ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఉద్దీన్, కోశాధికారి ఈ. శ్రవణ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హెచ్. రాములు, కార్యదర్శి జీ. లక్ష్మి నారాయణ తదితరులు వినోద్ కుమార్ తో సమావేశమయ్యారు. స్వచ్ఛందంగా ప్రభుత్వానికి వాలంటీర్లుగా పని చేస్తామని వారు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, వార్డులు, పట్టణాలు, బస్తీల్లో నివసిస్తున్న తాము వాలంటీర్ గా పని చేసి కేసీఆర్ కు అండగా ఉంటామని ఈచ్ వన్ టీచ్ వన్ అనే బృహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయం గా ముందుకు తీసుకెళ్తామని పెన్షనర్లు వినోద్ కుమార్ సమక్షంలో ప్రతిన బూనారు. రెవెన్యూ పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, హెల్త్ , రూరల్ డిపార్ట్మెంట్, అటవీ శాఖ వంటి అనేక శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో సుదీర్ఘ కాలంగా ఉద్యోగులుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన తర్వాత పెన్షన్ తీసుకుంటున్న వారు రాష్ట్ర వ్యాప్తంగా 3.64 లక్షల మంది ఉన్నారు. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పరిశుభ్రత వంటి రంగాలతో పాటు సామాజిక రుగ్మతలపై సైనికులుగా పనిచేస్తామని పెన్షనర్లు వినోద్ కుమార్ కు తెలిపారు.



గవర్నర్‌ను కలిసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీకే అరుణ సహా పలువురు నేతలు కూడా గవర్నర్‌కు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు నేతలు, అధికార్లు క్యూ కట్టారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు తదితర నేతలు కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజల దృష్టిని మరల్చేందుకే కేసీఆర్ మిడ్‌మానేరు సందర్శన:లక్ష్మణ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: పార్లమెంటులో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఓటు వేసి రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురైన సీఎం కేసీఆర్.. ప్రజల దృష్టి మరల్చేందుకే మిడ్‌మానేరు సందర్శన చేపట్టారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. బుధవారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మిత్రపక్షమైన ఎంఐఎంను సంతృప్తి పరిచేందుకే సీఏఏను వ్యతిరేకించినట్లు ఆరోపించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెటీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ ఖాయమని కేసీఆర్ ముందే గుర్తిం చారని ఈ విషయాన్ని ప్రజలు గుర్తించకుండా ఉండాలనే ఉద్దేశంతోనే కరీంనగర్ పర్యటన మొదలు పెట్టారన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో టీఆర్ఎస్‌ను చావుదెబ్బ కొట్టిన బీజేపీపై కేసీఆర్ అక్కసు వెళ్లగక్కుతున్నారని దుయ్యబట్టారు. అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వం.. రాజకీయ పబ్బం గడుపుకొనేందుకే ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోస్తోందని విమర్శించారు. కేసీఆర్ అబద్ధాలాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పి బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

మంచినీళ్లలా తాగేశారు

● 380 కోట్ల మద్యం విక్రయాలు ● మామూలు రోజుల్లో 70 కోట్ల వరకూ అమ్మకాలు ● ఏడాది చివరి రెండు రోజులూ విచ్చలవిడిగా విక్రయాలు ● 4.85లక్షల కేసుల మద్యం ● 5.10లక్షల కేసుల బీరు ● ఒక్క డిసెంబరు నెలలోనే 2050కోట్ల మద్యం ఉఫ్ ● ఎక్సయిజ్ శాఖ గణాంకాలలో వెల్లడి



హైదరాబాద్, సూర్య ప్రత్యేక ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం ప్రియులు మద్యంలో మునిగి తేలారు. డిసెంబరు 30, 31 తేదీల్లో రూ.380 కోట్లు విలువైన మద్యాన్ని మంచినీళ్ల ప్రాయంలా మందుబాబులు తాగేశారు. సాధారణంగా రోజుకు రూ.60 నుంచి 70 కోట్లు మద్యం విక్రయాలు జరుగుతాయి. అయితే 30, 31 తేదీలల్లో ఏకంగా దాదావు రూ.380 కోట్ల విలువైన మద్యం విక్రయం జరిగింది. ఈ రెండు రోజుల్లో ఏకంగా రూ. 380 కోట్లు విలువైన 4.85 లక్షల కేసుల లిక్కర్, 5.10 కేసుల బీరు మద్యం అమ్మకాలు జరిగాయని ఆబ్కారీ శాఖ లెక్కలు వెల్లడించాయి. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఈ మూడు జిల్లాల్లో సింహభాగం మద్యం అమ్మకాలు జరగ్గా.. మిగిలిన మద్యం తదితర జిల్లాల్లో విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. డిసెంబరు నెలలో రూ. 2050 కోట్లు విలువైన మద్యం అమ్ముడుపోయినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 30.80 లక్షల లిక్కర్, 35 లక్షల కేసులు బీరు అమ్మకాలు జరిగాయన్నారు. సగటున రోజుకు రూ. 66 కోట్లు మద్యాన్ని రాష్ట్రంలోని మద్యం ప్రియులు తాగేశారు. హైదరాబాద్ నగరంలో రూ.270 కోట్లు, రంగారెడ్డి జిల్లా పరిధిలో రూ.540 కోట్లు, మేడ్చల్ జిల్లాలో దాదావు 250 కోట్లు లెక్కన మద్యం విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ

● ప్రజలు నూతనోత్సాహంతో ముందుకు సాగాలి ● రాజ్ భవన్‌లో ప్రజలతో కలవడం సంతోషాన్నిచ్చింది ● గవర్నర్‌గా వచ్చి 100 రోజులు పూర్తయ్యాయి ● ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తాం ● ప్రజాదర్బార్ సందర్భంగా గవర్నర్ వ్యాఖ్యలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజ్‌భవన్ వేదికగా ప్రజా సమస్యలకు సబంధించిన వినతిపత్రాలు స్వీకరించి... పరిష్కారానికై ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తామని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. బుధవారం రాజ్‌భవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలుగులో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలు మంచి మనస్సు ఉన్నవాళ్లని... పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని కొనియాడారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలంతా అభివృద్ధి, సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా గవర్నర్‌గా వంద రోజులు పూర్తి చేసుకున్నందుకు సంతోషంగా ఉందని తమిళిసై హర్షం వ్యక్తం చేశారు. వంద రోజుల పాలనపై రాష్ట్రపతికి నివేదిక ఇచ్చానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇరిగేషన్, వ్యవసాయ విద్యారంగాల్లో అభివృద్ధి దిశగా పనిచేస్తోందని నివేదికలో తెలిపినట్లు పేర్కొన్నారు. 2019లో బతుకమ్మ ఆటలు, గిరిజనులతో మమేకం కావడం సంతృప్తినిచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల సందర్శించిన గిరిజనులను రాజ్ భవన్‌కు ఆహ్వానించానని తెలిపారు. ఇటీవల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాజ్‌భవన్‌లో బ్లడ్ డొనేషన్ యాప్ విడుదల చేశారని, రాజ్‌భవన్ ఆధ్వర్యంలో దానిపై పర్యవేక్షణ జరుగుతుందన్నారు. రెడ్‌క్రస్‌తో కలిసి దీనిని సంయుక్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 15 లక్షల మంది ఇందులో సభ్యులుగా ఉండడం సంతోషమని గవర్నర్ తమిళిసై వ్యాఖ్యానించారు.



ఉత్తమ్ కుమార్‌పై అసదుద్దీన్ ఫైర్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ మండిపడ్డారు. నగర పోలీస్ కమిషనర్‌పై ఉత్తమ్ వ్యాఖ్యలు సరికాదన్నారు. కాగా.. 'తెలంగాణ సీఎం కేసీఆర్ కు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ తొత్తు' అంటూ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అంజనీకుమార్ అవినీతిపరుడని, రాష్ట్రంలో ఉన్నది కల్వకుంట్ల పోలీస్ సర్వీస్ అని ఆయన ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ ర్యాలీని పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో ఆర్ఎస్ఎస్ ర్యాలీ, దారుస్సలాంలో ఎంఐఎం సభకు అనుమతిచ్చారని, తమకెందుకు అనుమతి ఇవ్వబోరని ఉత్తమ్ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ.. ఉత్తమ్ కుమార్ పై విమర్శలు గుప్పించారు. 'హైదరాబాద్ సీపీపై ఉత్తమ్ కుమార్ రెడ్డి వాడిన భాష సరికాదు.. ఆయన ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సింది. దారుస్సలాం ఏఐఎంఐఎంకు ఓ ముఖ్యమైన వేదిక. ఈ భారీ మైదానంలో గతంలో ఇందిరా గాంధీ కూడా బహిరంగ సభ నిర్వహించారు. సీఏఏపై ఆందోళనలు నిర్వహించడానికి ఉత్తమ్ కుమార్ చాలా ఉత్సాహంగా ఉన్నారు.. మేము నిజామాబాద్ లో ఇదే విషయంపై నిర్వహించిన సభలో మాత్రం ఆయన పార్టీ పాల్గొనలేదు.. మా ఆహ్వానాన్ని తిరస్కరించింది' అని అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్ చేశారు.

గవర్నర్ తమిళిసైతో సోమేశ్‌కుమార్ భేటీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సోమేశ్‌కుమార్ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశాకు. ఈసందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలుతెలిపారు. సీఎస్‌గా పనిచేసన ఎస్‌కే జోషి నీటిపారుదల సలహాదారుగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో సోమేశ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులపై ముఖ్యమంత్రి కేసీఆర్‌సంతకం చేశారు. కాగా.. సోమేశ్‌కుమార్ 2023 వరకూ సీఎస్‌గా కొనసాగుతారు.

మునిసిపోల్స్‌లో బీసీల రిజర్వేషన్లు తగ్గిస్తే ఖబడ్దార్

● ఏపీతో పాటు, ఇతర రాష్ట్రాలలో 34% అమలు ● మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయరని బీసీల ప్రశ్న ● రిజర్వేషన్లు తగ్గిస్తే సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని 14 బీసీ సంఘాల హెచ్చరిక

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః మున్సిపల్ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గిస్తే సహించేది లేదని బీసీ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఒకవైపు పక్క రాష్ట్రాలైన ఏపీలో 34 శాతం, కర్ణాటకలో 36%, తమిళనాడులో 50%, మహారాష్ట్రలో 48% పంచాయితీరాజ్ - మున్సిపల్ ఎన్నిక ల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తుంటే, మన రాష్ట్రంలో తగ్గించాల్సిన అవసరం ఏముందని 14 బీసీ సంఘాలు ముఖ్యమంత్రి కే.సీ.ఆర్ ను ప్రశ్నించాయి. ఈ మేరకు బుధవారం బీసీ భవన్ లో 14 బీసీ సంఘాల అత్యవసర సమావేశం జరిగింది ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు తగ్గించాలని ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టి వ్యూహాన్ని చర్చించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రిజర్వేషన్ స్థానాలు ప్రకటించకుండా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం వెనుక బీసీలకు అన్యాయం చేయాలని ఆలోచన ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు



ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ స్థానాలు ప్రకటించకుండా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం అన్యాయం అన్నిరు. గతంలో ప్రతిసారి మొదట రిజర్వేషన్ స్థానాలు ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించి వాటిని సరిచేసిన తరువాత ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేవారు. ఈసారి అలా కాకుండా మొదట ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఇంతవరకు రిజర్వేషన్ స్థానాలు ప్రకటించలేదు. దీని మూలంగా బీసీ/ఎస్సీ/ఎస్టీ లు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. అందుకోసం వెంటనే రిజర్వేషన్ స్థానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ 34 శాతం గత 30 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. ఇప్పుడు తగ్గిస్తారని ప్రచారం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టిన తర్వాత రిజర్వేషన్ల గరిష్ట పరిమితి 60 శాతం కు చేరుకుంది. గతంలో ఉన్న 50 శాతం గరిష్ట పరిమితి దీనితో తొలగిపోయింది. ఇంకా 50 శాతం గరిష్ట పరిమితి నిబంధనను పట్టుకొని బీసీలకు అన్యాయం చేయడం తగదని హితవు పలికారు. 2010లో సుప్రీంకోర్టు ఎస్సీ/ఎస్టీ/బిసి రిజర్వేషన్లపై 50% గరిష్ట పరిమితి విధిస్తూనే, బీసీ జనాభా లెక్కలు శాస్త్రీయంగా ఉంటే జనాభా ప్రకారం రిజర్వేషన్లు తెలుసుకోవచ్చునని తీర్పు చెప్పింది. మన రాష్ట్రంలో 2014లో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సమగ్ర సర్వేలో బీసీ జనాభా 54% అని తేల్చారు. ఇది శాస్త్రీయమైన ప్రభుత్వ పక్క లెక్కలు. దీని ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 52 శాతానికి పెంచాలి. కానీ తగ్గించడం సరికాదు. బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లో రాజ్యాంగబద్ధమైన హక్కు, ప్రజాస్వామ్యమైన వాటా అని తెలిపారు. రిజర్వేషన్ల తగ్గింపుపై ఊరువాడ ప్రచారం చేసి ప్రభుత్వం, బీసీ వ్యతిరేక చర్యలను ఎండ కడతామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించాలని ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ, బిజెపి పార్టీ వ్యతిరేకిస్తూ స్పందించాలని కోరారు. బీసీ సంఘాలు చేసే ఉద్యమాలకు ప్రతిపక్షాలు మద్దతుగా కలిసిరావాలని కృష్ణయ్య కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ నేతలు అల్లంపల్లి రామకోటి, రాములు, గుండేటి శంకర్, మల్లేష్ యాదవ్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, నరసింహ గౌడ్, బర్కకృష్ణ, మధుసూదన్, ఉపేందర్ గౌడ్, కృష్ణ యాదవ్ పాల్గొని ప్రసంగించారు.

తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదు: సోయం బాపూరావు హెచ్చరింక

ఆదిలాబాద్, మేజర్‌న్యూస్: తనపై తప్పుడు విమర్శలు చేస్తే ఊరుకోమని, తాను తలచుకుంటే ఎమ్మెల్యే జోగురామన్నకు టికెట్ రాకుండా చేస్తానని ఎంపీ సోయం బాపూరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భూనిర్వాసితులతో పాటు ప్రధాని మోదీని కలుస్తామని చెప్పారు. సీసీఐ భూమి నిర్వాహితుల రిలేదీక్షను బాపూరావు సందర్శించారు. ఈ సందర్భంగా బాపూరావు మాట్లాడుతూ రెండు సార్లు టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా సీసీఐ పరిశ్రమను పునఃప్రారంభించడంలో జోగురామన్న విఫలమయ్యారని బాపూరావు ఆరోపించారు.

రాజకీయాను భ్రష్టుపట్టిస్తున్న కేసీఆర్: ఉత్తమ్

సూర్యాపేట, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో టీఆర్ఎస్ కుటుంబ పాలన, దోపిడీ పాలన రాజకీయాల్ని భ్రష్టు పట్టించిందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నది టీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు. ఈ మేరకు బుధవారం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కేసీఆర్‌ను సూటిగా అడుగుతున్నా. నిరుద్యోగ భృతి ఎక్కడ? రుణమాఫీ ఎక్కడ? రైతు బంధు ఎక్కడ? మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి టీఆర్ఎస్ పార్టీని ఎండగడతాం. నేను మున్సిపల్ ఎన్నికల గురించి మాట్లాడితే నాపైన టీఆర్ఎస్ నేతలు పిచ్చి పిచ్చి విమర్శలు చేస్తున్నారు. రిజర్వేషన్లు ముగిశాక నామినేషన్‌లకు వారం రోజుల గడువు ఇవ్వాలి. కేసీఆర్,మోదీ ఇద్దరూ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారు. కేంద్రంలో మోదీ మతపరైన రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ వాళ్లను ఉపయోగించి కాంగ్రెస్ కార్యకర్తలను అణిచివేస్తున్నారు. అందుకు నిరసనగా త్వరలోనే జైల్ బరో నిర్వహిస్తాం. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి వేరే పార్టీలోకి వెళ్లిన నేతలు మళ్లీ కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానిస్తున్నాను. బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ. టీఆర్ఎస్ పార్టీ కుటుంబ పార్టీఅని ఉత్తమ్ విమర్శించారు.

8న దేశవ్యాప్త సమ్మె: నారాయణ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: పార్లమెంట్‌లో ఎన్నార్సీకి వ్యతిరేకంగా టీఆర్ఎస్ పార్టీ ఓటేయడం సంతోషకరం అని సీపీఐ నేత నారాయణ అన్నారు. కేంద్రం వైఖరికి నిరసనగా ఈనెల 8వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమ్మెకు కేసీఆర్ మద్దతు ఇచ్చి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. తెలంగాణలో ఇంకా ఆత్మబలి దానాలు జరగడం బాధాకరం అని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, యాగాల ముసుగులో కేసీఆర్ చేసిన పాపాల విముక్తి కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

మానసిక రుగ్మతలకు చెక్ పెట్టేలా సర్కార్ యోచన

● గ్రామీణులను సైతం పీడిస్తున్న డిప్రెషన్ ● వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పరిష్కారానికి చర్యలు ● 9 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చికిత్స ప్రారంభం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: డిప్రెషన్ దేశవ్యాప్తంగా అన్ని వయస్సులవారు దీనివల్ల ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. వయస్సుతో సంబంధంలేకుండా మనుషులను మానసికంగా కుంగదీసి ఆత్మహత్యలకు ప్రేరేపించే డిప్రెషన్ బారిన పడేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ప్రతి మనిషి ఏదో ఒక సమయంలో దీని బారిన పడుతున్నారు. రాష్ట్రంలో మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి భరోసాగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. రెండేళ్ల కిందట వెలువడిన జాతీయ మానసిక వైద్య అధ్యయనం ప్రకారం.. మన దేశంలో మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు దాదాపు 10.6 శాతం మంది ఉన్నట్లు అంచనా. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యబృందాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించగా.. 5 లక్షల జనాభాలో ప్రాథమికంగా దాదాపు మూడు శాతం మందిలో వేర్వేరు మానసిక సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. వీరిలో పురుషులు 65 శాతం మంది, మహిళలు 35 శాతం మంది ఉన్నట్లు తేల్చారు. ఓటములు, ఒంటరితనం, పేదరికం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం, నిరుద్యోగం.. ఇలా ఎన్నో కారణాలు మనుషుల్ని డిప్రెషన్‌లోకి నెట్టి ప్రాణాలను హరిస్తున్నాయి. మారిన జీవనశైలితోపాటు ఒత్తిడి పెరుగుతుండటంతో నగరవాసులనే కాక గ్రామీణప్రాంతాల వారిని సైతం మానసిక రుగ్మతలు వేధిస్తున్నాయి. మానసిక చికిత్సలను గ్రామాలకు కూడా విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేసి అమలు చేస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారు చికిత్స కోసం ఏటా రూ.540 కోట్లు వెచ్చిస్తున్నట్టు వివిధ సంస్థల అంచనా. దీన్ని దృష్టిలో ఉంచుకొని డిప్రెషన్ బాధితులకు అండగా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా, ప్రాంతీయస్థాయి ఆస్పత్రుల్లోనే కాకుండా ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మానసిక రుగ్మతల పరీక్షలు, చికిత్స, మందులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. మానసిక వ్యాధులకు చికిత్స తీసుకోవడం మధ్యతరగతి వర్గాలకు మోయలేని భారమవుతోంది. ఇప్పటివరకు నగరాలకే పరిమితమైన మానసిక వైద్య చికిత్సను ఇప్పుడు గ్రామాలకు విస్తరింపచేయాలనితెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. మొదటగా రాష్ట్రంలోని 9 జిల్లాల్లో కార్యాచరణ మొదలుపెట్టి విడతలవారీగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని యోచిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు వికారాబాద్, కరీంనగర్, సిద్దిపేట, వనపర్తి, జగిత్యాల, సంగారెడ్డి, నిర్మల్, ఖమ్మం జిల్లాల్లోని 48 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 353 ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రయోగాత్మకంగా మానసిక వైద్యపరీక్షలు, చికిత్స, మందుల పంపిణీ చేపట్టనున్నది. ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లోని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులు, వైద్యులకు అవసరమైన శిక్షణను ఇప్పటికే అందించారు. మానసిక సమస్యలపై తెలుగులో పుస్తకాలను ముద్రించి ప్రజలకు పంచిపెడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం వారానికోరోజు ఓపీ నిర్వహించనున్నారు. రుగ్మత ఉన్నవారికి అవసరమైన మందులు ఇవ్వడంతోపాటు బాధితుడు, కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ కూడా నిర్వహించనున్నారు.



సంపాదకీయం
editpage@suryaa.com

పులికి హీటర్ సదుపాయం

అంతరించిపోతున్న జంతు జాలంలో పులి, సింహాల జాతులు కూడా ఉన్నాయి. ఒకప్పుడు భారతదేశం అటవీ ప్రాంతంలో వేలాది పులులు, సింహాలు తిరుగాడితే ఇప్పుడు వాటి సంఖ్య రెండంకెలకు పడిపోయింది. దీంతో పులులు, సింహాలను కాపాడుకోవడం తప్ప నిసరిగా మారింది. అందుకే అసోం జూ అధికారులు చలి నుంచి పులులు, సింహాల సంరక్షణకు హీటర్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే... ప్రస్తుతం ఉత్తరాదిని చలి తీవ్రంగా వణికిస్తోంది. చాలా చోట్ల పది డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక ఈశాన్య భారతం సంగతి చెప్పక్కర్లేదు. చలి కారణంగా జూలోని మూగజీవాలు గజగజలాడుతున్నాయి. దీన్ని గురించి అసోం రాజధాని గువాహటి జూ అధికారులు ఆయా జంతువుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని పలు రకాల చర్యలు తీసుకోగా, పులులు, సింహాల సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్ల బయట హీటర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుత చలిని తట్టుకోలేని పులులు, సింహాలు ఎక్కువ సేపు హీటర్ల ముందు గడుపుతుండడం అధికారులనే ఆశ్చర్యపరుస్తోంది.

2019 ముగిసిపోయింది. ఇక మహా అయితే నాలుగు రోజులు. ఈ నాలుగు రోజుల్లో 362 రోజుల ముచ్చట్లను జ్ఞాపకం తెచ్చేసుకోవాలనుకోవడం అత్యాశేమీ కాదు. విజయ దుందుభితో మొదలైన బీజేపీ ప్రస్థానం ఏడాది చివరకు వచ్చేసరికి పరాజయాల పరంపరలో కూరుకుపోయింది. ఈ ఒక్క ఏడాదే ఏకంగా 5 రాష్ట్రాలు ఆ పార్టీ చేతి నుంచి జారిపోయాయి. ఇదేదో కాంగ్రెస్ అద్వితీయ ప్రతిభ అనుకుంటే పొరపాటే అవుతుంది. ప్రాంతీయ పార్టీలు ఒకప్పుడు కాంగ్రెస్‌కు తోకపార్టీలుగా వ్యవహరించేవి. ఇప్పుడు కాంగ్రెస్ వాటికి తోకపార్టీ పాత్ర పోషిస్తోంది. ఇదొకరకంగా మంచి పరిణామమే. అనువుగాని చోట అధికులమనరాదు అన్న సూక్తిని కాంగ్రెస్ ఒంటబట్టించుకున్న కారణంగానే ఈ ఐదు రాష్ట్రాలూ బీజేపీ ఏలుబడి నుంచి తప్పుకున్నాయి.

రాజకీయాలలో అవకాశాలను దొరకపుచ్చుకోవాలి. లేకపోతే వచ్చిన అవకాశం తిరిగి రాదు. మహారాష్ట్ర విషయంలో కాంగ్రెస్ ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించింది. ఆగర్భశత్రువైన శివసేనతో చెట్టాపట్టాలేసుకుంది. దీని వెనుక ముఖ్యమైన కారణం. బీజేపీని అధికారానికి దూరంగా ఉంచడమనే ఏకైక సూత్రం. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇదే ట్రెండ్ నడుస్తోంది. జార్ఖండ్ ఎన్నికలలో కాంగ్రెస్-జేఎంఎం కూటమికి విజయం సునాయాసంగా దక్కింది అనడం కంటే బీజేపీ లోపాలే కారణమని చెప్పక తప్పదు. మొదటిది ఆర్టికల్ 370 రద్దు సందర్భంగా జమ్మూ-కాశ్మీరులో చేపట్టిన ముందస్తు భద్రతా చర్యలను జాతీయ పౌర పట్టిక రూపకల్పన అంశంలో విస్మరించారు. రెండోది కోర్టు తీర్పులు అనుకూలంగా ఉన్నాయనే అతి విశ్వాసానికి పోవడం. అయోధ్య అంశం దీనికి ప్రత్యక్ష తార్కాణం. రాఫెల్ డీల్ అంశంతోనే ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబరిచేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకుంది. ప్రధాన్ మంత్రి చోర్ హై అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో ఎంతో సంచలనానికి కారణమయ్యాయి. తదుపరి ఆయన కోర్టు ధిక్కార కేసును ఎదుర్కొనాల్సి వచ్చింది. క్షమాపణలు చెప్పుకుని దాన్నుంచి బయటపడ్డారు. పార్టీ అధ్యక్ష పదవిని వీడటాన్ని బీజేపీ గేలి చేసింది. ఎగతాళి చేసింది. రాజకీయాలంటే టూర్లు, విందులూ కావంటూ ఎద్దేవా చేసింది. అయినా రాహుల్ చలించలేదు.

2014 ఎన్నికల అనంతరం బీజేపీలో పరిణామాలు అనూహ్యంగా మారాయి. అంతకు ముందు వాజపేయి, అద్వానీ నాయకత్వంలో పార్టీని నడిపినా నాడు బీజేపీలో సీనియర్ నేతలకు ప్రాధాన్యత ఉండేది. 2014 ఎన్నికల అనంతరం

కమలం చుట్టూ కరవాలాలు!

పార్టీలో సీనియర్ నేతలంతా తెరమరుగయ్యారు. కేవలం నరేంద్రమోడీ, అమీత్ షా మాటే చెల్లుబాటవుతూ వస్తోంది. సీనియర్ నేత ఎల్.కే. అద్వానీని సైతం నరేంద్రమోడీ పక్కన పెట్టి అవమానించారని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. ఈ ఏడాదిలోనే ఐదు రాష్ట్రాలలో ఓటమితో బీజేపీలో మోడీ, అమీత్ షా రాజకీయ సీన్ రివర్స్ అవుతోందని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. దేశ రాజకీయాల్లో తిరుగు లేని నేతలుగా పేరొందిన నరేంద్ర మోడీ, అమిత్ షా ద్వయం ఇప్పుడు సమస్యలు ఎదుర్కొంటుంది. సొంత పార్టీ లోనే అసంతృప్తి పెల్లుబుకుతున్నట్లు సమాచారం. బీజేపీ లో కాకలు తీరిన నేతలు, సంఘ్ పరివార్ ఈ పరిస్థితులపై పోస్ట్ మార్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా మోడీ, అమీత్ షా ఇమేజ్ తో బయటకు వెళ్తే డ్యామేజ్ తప్పదని మల్లగుల్లాలు పడుతున్నారు. అందుకే భవిష్యత్ రాజకీయాల్లో వాళ్ళ ప్రమేయం ఉంటే దెబ్బ తింటామని ఆలోచనలో ఉన్నారు. ఈ పరిణామాలతో తాజాగా బీజేపీకి అన్నీ తామైనట్లుగా వ్యవహరిస్తున్న మోడీ-షా ద్వయానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. మొన్నటి వరకు తమకు తిరుగులేదన్నట్లుగా ఉన్న వారి పరిస్థితి ఇప్పుడు ఏమీ బాగోలేదంటున్నారు. నిన్నటివరకూ పార్టీకి బలమన్న వారే.. ఇప్పుడు బలహీనంగా మారటమే కాదు రేపొద్దున అధికారం చేజారితే అది కేవలం మోడీ-షాలే కారణమని నిందించే పరిస్తితి వస్తుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. తాజా ఓటమికి కారణం వారిద్దరేనని నిందించే వారి సంఖ్య పార్టీలో అంతకంతకూ పెరుగుతోంది. పైకి అంతా బాగున్నట్లుగా కనిపించినా ఈ ఇరువురిపై పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలుస్తోంది. మొన్నటి వరకు సర్దుకుపోతున్న సంఘ్ పరివార్ సైతం మోడీ-షా తీరును తప్పు పట్టటమే కాదు వారిద్దరి తీరుపై సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఐదు రాష్ట్రాల్లో పరాజయం తర్వాత మోడీ-షా తీరుపైనా, వారిద్దరి ఛరిష్మాపైనా పార్టీ పెద్దలు కొత్త తరహాలో మదింపు చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇవన్నీ దేనికి సంకేతాలు? ఫలితాలపై పార్టీ సీనియర్లు అద్వానీ మురళీ మనోహర్ జోషి అంతర్గంగా సమీక్షించుకుంటున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. వారిద్దరూ మోడీ-షా బాధితులేనన్న విషయాన్ని మర్చిపోకూడదు.

పరాజయానికి కారణాలు తేల్చటంతో పాటు, తప్పులపై సమీక్ష జరగని తీరుపై పార్టీలో పలువురు అసంతృప్తిలో ఉన్నట్లు చెబుతున్నారు. రాజకీయాలు వారికి మాత్రమే తెలిసినట్లుగా మోడీషాలు వ్యవహరించటంపై పార్టీ నేతలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఈ అసంతృప్తి జ్వాల వారిద్దరిని ఇబ్బంది పెట్టకున్నా రానున్న రోజుల్లో మాత్రం ఇది కొత్త తిప్పలు తీసుకురావటం ఖాయమన్నట్లుగా చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ భారతీయ జనతా పార్టీ సరికొత్త సవాలును ఎదుర్కొంటోందని చెప్పక తప్పదు. 2020లో వారు తమ సవాళ్ళను ఎలా అధిగమిస్తారో చూడాల్సిందే!

ప్రజలు కోరుకొంటోంది విద్వేష రహిత భారత్



సయ్యద్ నిసార్ అహ్మద్
780 101 9343

- కావాల్సింది అభివృద్ధి, ప్రగతి భారత్ అని
- తమ తీర్పుతో స్పష్టం చేసిన ఓటర్లు
- బీజేపీ వరుస ఓటములు... ప్రజా తీర్పు ఉద్దేశం ఇదే ?

కాంగ్రెస్ రహిత భారత్ అని బీజేపీ చెబుతుంటే దేశ ప్రజలు మాత్రం విద్వేషరహిత భారత్ అని తమ తీర్పు ద్వారా స్పష్టంచేస్తున్నారు. గుళ్లు, విగ్రహాలు తమకు ప్రధానం కాదని, అభివృద్ధి, దేశ ప్రగతే తమకు ముఖ్యమని తమ వైఖరి ద్వారా స్పష్టంచేస్తున్నారు. దేశ ప్రజలు ప్రస్తుతం ఇస్తున్న తీర్పునుంచి అన్ని పార్టీలు గుణంపాఠం నేర్చుకోవాల్సింది ఇదే. మరీ ముఖ్యంగా బీజేపీ నాయకత్వం ఈ గుణపాఠం నేర్చుకోవాలి. దేశాన్ని ఏలుతున్న బీజేపీ భిన్నత్వంలో ఏకత్వం నిలిపే ప్రయత్నం చేయకున్నా దేశ పౌరులుగా ఈ దేశ ప్రజలు మాత్రం ఆ పాత్రను సమర్థంగా నిర్వహిస్తున్నారు అని ఇటీవల చోటుచేసుకొన్న ఉదంతాలు స్పష్టంచేస్తున్నాయి. ఇటీవల జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీకి షాకిచ్చాయి. ఏడాది కాలంలో ఐదో రాష్ట్రాన్ని కోల్పోవడంతో బీజేపీ అధిష్టానంలో కలవరం మొదలైంది. ఐదేళ్లుగా కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటూ నినదిస్తూనే ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ కూటములకు ఐదు రాష్ట్రాలను అర్పించుకున్నారు కమలనాథులు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఇప్పటికే అధికారం కోల్పోయిన బీజేపీ తాజాగా జార్ఖండ్లోనూ అధికారానికి దూరమైంది. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చినా కీలకమైన రాష్ట్రాలను బీజేపీ వదులుకోవాల్సి వచ్చింది. ఏడాదిలో ఐదు కీలక రాష్ట్రాలు చేజారి పోవడంతో కమలనాథుల్లో కలవరం మొదలైందని తెలుస్తోంది. అతి త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు బీజేపీకి సవాలుగా మారనున్నాయి. ఒక రాష్ట్రంలో గానీ ఒక సీటులో గాని గెలిస్తే చాలు ప్రజలు మోడీ పాలనను కోరుకొంటున్నారని, హిందూ అజెండాను ఆదరిస్తున్నారని బీజేపీ నాయకత్వం ఢంకాకొట్టి మరీ చెప్పడం ఆనవాయితీగా మారింది. ప్రజలు ఇటీవల ఐదు రాష్ట్రాల్లో ఇచ్చిన తీర్పుపై మాత్రం బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోని మాట్లాడటంలేదు. ప్రజలు ఇచ్చిన షాక్‌తో మాత్రం ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు తేరుకొని వాస్తవాలు మాట్లాడుతున్నారు.

ఇదిలావంటే జార్ఖండ్ ఎన్నికల్లో తమ పార్టీ ఓటమి గురించి బీజేపీకి చెందిన ఓ ఎంపీ చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రధాని నరేంద్ర మోడీ పూర్తిగా విస్మరించి విగ్రహాల ఏర్పాటు, ఆలయాల నిర్మాణంపైనే దృష్టిసారించారనీ అందుకే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడినట్టు బీజేపీ ఎంపీ సంజయ్ కేకడే అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, గత 2014 ఎన్నికల్లో దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ప్రధాని నరేంద్ర మోడీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారనీ, కానీ, అధికారంలోకి వచ్చాక ఆ మాట మరచిపోయారనీ ఆయన సొంత పార్టీపైనే విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా రామ మందిర నిర్మాణం, విగ్రహాల నిర్మాణం, నగరాల పేర్ల మార్పుపైనే పార్టీ దృష్టి సారించిందని, ఈ ఎన్నికల్లో అదే కొంప ముంచిందన్నారు.

ప్రజలు కోరుకొన్నది అభివృద్ధి...హిందుత్వ అజెండా కాదు ?

పరమత సహనం ఈ దేశ ప్రజల గొప్పతనం. ఈ గొప్ప స్ఫూర్తిని రగిల్చే గొప్పతనం మన భారతదేశం మట్టిలోనే ఉంది. అందుకే 2014 ఎన్నికలకు అభివృద్ధి అజెండా పేరుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ఆ తరువాత వరుస మత విద్వేష ప్రకటనలతో మెజార్టీగా ఉన్న హిందూ సోదరుల మనస్సు మార్చి తనకు బలమైన మెజార్టీ ఓటర్లను అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం చేస్తూ వస్తోంది. దేశంలో హిందూత్వ పార్టీ అనగానే మనకు గుర్తుకు వచ్చేది బీజేపీనే, శివసేన లాంటి పార్టీలు అక్కడా ఇక్కడా ఉన్నా ప్రధానమైన హిందూత్వ ఎజెండాతో నడిచే కాషాయ పార్టీ కమలదళమే. ఆరెస్సెస్ అండతో ముందుకు పోయే బీజేపీ రెండు రకాల మాటలతో రాజకీయం చేస్తూ ఉంటుంది. ఒకవైపు అభివృద్ధి, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అంటూనే మరోవైపు అవసరమైనప్పుడల్లా రామ మందిరం, హిందూత్వ



అంటుంది, ఎప్పుడు ఏది వర్కవుట్ అవుతుందో బీజేపీ పెద్దలకు బాగా తెలుసు. అలాగే ఎప్పుడు ఎవరు మాట్లాడాలో కూడా వారికి బాగా తెలుసు, అభివృద్ధి , అవినీతి నిర్మూలన, నల్లధనం, నిరుద్యోగం లాంటి మాటలు మాట్లాడే వారు గోవధ నిషేధం, ముస్లిమ్ లలో జనాభాపెరుగుదల, అయోధ్య రామ మందిరం ఇలాంటి అంశాల జోలికి వెళ్లరు. తాజాగా కాషాయ నేతల వరుస కామెంట్లు చూస్తే మనకు రానున్న ఎన్నికల ఎజెండా ఏంటో తెలిసిపోతుంది. 2014లో కాంగ్రెస్ పదేళ్ల పాలనలోని అవినీతి, స్కామ్ లు మోదీకి బాగా కలిసొచ్చాయి. అందుకే ఎక్కువగా హిందూత్వ ఎజెండా నెత్తికెత్తుకోలేదు. కాంగ్రెస్ హఠావ్ నినాదంతో అబ్ కీ బార్ మోదీ సర్కార్ అంటూ హోరెత్తించారు. నాలుగేళ్ల తరువాత సీన్ మొత్తం రివర్సైంది. మోదీ వచ్చాక చేపట్టిన నోట్ల రద్దు, జీఎస్టీ వంటి ప్రయోగాలు పేద, మధ్యతరగతి వారికి అసంతృప్తి కలిగించాయి. ప్రజా వ్యతిరేకత తీవ్రంగా పెరిగింది. తాజాగా ఈ హామీలను అమలు చేయాల్సిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇపుడు రామమందిరం, విగ్రహాలు, ఎన్నార్సీ, సీఏఏ వంటి చట్టాలతో ప్రజలకు దగ్గరవ్వాలని చూసినా ఈ సమయంలో జరిగిన జార్ఖండ్ రాష్ట్ర ఎన్నికలు మాత్రం బీజేపీకి తగిన గుణ పాఠం నేర్పాయి.

బీజేపీయేతర పక్షాలు తమ ఒంటెద్దు పోకడలు మానుకోవాలి ?

గత 2019 ఎన్నికల్లో మోడీ సర్కార్ ఓటమి ఖాయం అన్నంతా ప్రచారం సాగింది. ఎన్నికలకు ముందు వివిధ మీడియా సంస్థలు చేసిన సర్వేలు అవే స్పష్టంచేశాయి. నాడు బీజేపీని ఎదుర్కొనేందుకు పెద్దన్న పాత్రలో కాంగ్రెస్ ఇతర బీజేపీయేతర పక్షాలను కలుపుకోవడంలో విఫలమైంది. ప్రాంతీయ పార్టీలు సైతం తమ ప్రభావాన్ని అధికంగా అంచనావేసుకొని హస్తం పార్టీని విస్మరించాయి. ఈ పరిణామాలే నాడు బీజేపీకి బాగా కలిసొచ్చి 2019 ఎన్నికల్లో మోడీ సర్కార్ రెండోసారి అధికార పగ్గాలు చేపట్టేందుకు దోహదపడ్డాయి. ప్రస్తుతం దేశంలో ప్రజలు బీజేపీని తిరస్కరించే వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది. లౌకికత్వ పరిరక్షణ అనే పార్టీలు ఇపుడైనా తమ పంథాను మార్చుకొని మత అజెండా బీజాలు వేస్తున్న బీజేపీని నిలువరించే ప్రయత్నం చేయాలి. బీజేపీ తన మత రాజకీయాలు పదునుపెట్టడంతో ఇతర బీజేపీయేతర పార్టీలు సైతం మౌనం స్థితికి వచ్చాయి. కారణం బీజేపీ మత రాజకీయాలను నిలువరించే ప్రయత్నం చేస్తే బలంగా ఉన్న హిందూ సమాజం ఎక్కడ దూరమైపోతుందోనన్న ఆందోళన లౌకిక పార్టీల్లో సైతం ఎక్కువైంది. ఇక్కడ లౌకికత్వం పేరు చెప్పుకొనే పార్టీలు ఓ వాస్తవాన్ని గ్రహించాలి. బీజేపీ మత అజెండాను ఈ దేశంలోని మెజార్టీ ఓటర్ల అయిన హిందూ సోదరులే అంగీకరించడంలేదు. తమకు కావాల్సింది దేశ ప్రగతి, అభివృద్ధి అని గుళ్లు, గోపురాలు, విగ్రహాలు తమ కడుపు నింపవని వారు ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో స్పష్టమైన తీర్పును ఇచ్చాయి. ఈ నేపథ్యంలో బీజేపీయేతర పార్టీలన్నీ మేలుకొని బీజేపీ మత రాజకీయాలు హిందూ సోదరులకు ఏ మాత్రం ఉపయోగం కాదని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. తద్వారా ప్రజల మద్దతుతో బీజేపీ మత అజెండాను నిలువరించడం, ఆ పార్టీని అధికారానికి దూరంగా ఉంచడం లౌకిక పార్టీలకు పెద్దపనేం కాదు. బీజేపీకి వ్యతిరేక తీర్పు ఇచ్చి ఈ దేశ ప్రజలే లౌకిక అజెండా, ఈ దేశంలోని భిన్నత్వంలో ఏకత్వం కాపాడేందుకు సిద్ధంగా ఉంటే ప్రజా క్షేత్రంలో ఉండాల్సిన లౌకికపార్టీలు ఇంకా మౌనం దాల్చితే మాత్రం అది క్షమించరానిది అవుతుంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలంటే బీజేపీయేతర పార్టీలన్నీ ఇప్పటినుంచే ఏకమై తమ ఒంటెద్దు పోకడలను పక్కన పెట్టాలి.

మూడు రాజధానులు... ముప్పేట ప్రశ్నలు



పచ్చల రాజేష్
8331823086.

- అభివృద్ధి వికేంద్రీకరణ ప్రయాణ వికేంద్రీకరణ అవుతుంది
- విభజనతో నష్టం... ముందు చూపే మేలు
- కేంద్ర సంస్థలు ఉత్తరాంధ్రలోనే ఎక్కువ
- రాయలసీమలో పారిశ్రామిక వసతులు మెరుగు
- కోస్తాలో అంతంత మాత్రమే

ఏపీ. ఏ మాత్రం సాఫీగా లేని ఓ భౌగోళిక బంధనం. రాష్ట్ర విభజన జరిగిన నాటి నుండి నేటి వరకు పచ్చి గాయాల పరిమళాన్ని పీల్చుకుంటున్న ప్రజానీకం, బహుశా ఈ ప్రదేశంలోనే ఉండి ఉంటారు. తమ రాజధాని ఎక్కడ అనే ప్రశ్న జీవితాంతం వేసుకునే ఒక నిస్సహాయ స్థితిలోకి నెట్టబడుతున్నారు. సాధారణంగా రోజువారీ జీవితం, కుటుంబాల పోషణ తప్ప మరేదీ పట్టని, ప్రజానీకానికి ఈ రాజధాని రభస పెద్దగా ఆసక్తి కలిగించక పోవచ్చు.

ఈ నేపథ్యంలో వెలువడిన మూడు రాజధానుల ఆలోచన, ప్రకటన ప్రభుత్వాన్ని సమర్థించే వారికి ఇంపుగా, వ్యతిరేకించే వారికి పాలనాకేంద్రాల జంపుగా కనిపించాయి. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం, ప్రతిపక్షం మినహా మరెవరికీ వ్యక్తులుగా కూడా అభిప్రాయాలు ఉండవు అనుకోవడం నేటి భావ దారిద్ర్యానికి నిదర్శనం. ఎందుకంటే రాజధానులు, రాజకీయాలు, డబ్బులు తదితర హంగులన్నీ ఓ రెండు సామాజిక వర్గాల కుటుంబాల కథగా మారిన ఈ రాష్ట్రంలో సామాన్యుడు కూటి కోసం వెతుక్కోవడమే కానీ, పాలన, రాజకీయం, అధికారం అనే ప్రాథమిక హక్కుల నుండి తననెప్పుడో దూరంగా నెట్టేసుకున్నాడు.

కానీ చరిత్ర మిగుల్చుతున్న చేదు జ్ఞాపకాలు నెమరేసుకోవడం కాకుండా, నేటి పరిస్థితులను ప్రతి ఒక్కరూ విశ్లేషణ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. విభజనతో నష్టపోయిన ఏపీ ప్రజానీకం ఈ విషయంలో మరింత ముందు చూపుతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

1. విశాఖ, 2. అమరావతి, 3. కర్నూలు... ఈ మూడు ప్రదేశాలను వివిధ రాజధానులుగా ఎంచుకోవాలి అనే ఆలోచన బయటికి వచ్చాక కొన్ని విషయాలు మెదడుకు తట్టాయి. సచివాలయ, అసెంబ్లీ ఉద్యోగులు, మాట తప్పను మడమ తిప్పను అనే ముఖ్యమంత్రి గారి మాటలు కొద్దిసేపు అలా ఉంచితే, విభజన జరిగాక ఆంధ్రాలోని మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబడ్డ కేంద్ర విద్యా సంస్థలు,ఇప్పటికే ఉన్న ప్రతిష్టాత్మక రాష్ట్ర విద్యా సంస్థలు,ప్రైవేటు పరిశ్రమలు గురించి కాస్త తెలుసుకున్నాక ఈ మూడు రాజధానుల విషయం మంచిదో, కాదోఈ వ్యాసం చదివిన ప్రతి ఒక్కరు నిర్ధారణకు రాగలరు అని భావిస్తున్నాను.

విశాఖ ఉత్తరాంధ్ర (కేంద్ర సంస్థలు)

1. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్, 2. ఇండియన్ మారిటైం వర్సిటీ, 3. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఒషనోగ్రఫీ, 4. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, 5. సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ (విజయ నగరం), 6. నేషనల్ లా వర్సిటీ, 7. సౌత్ కోస్ట్ రైల్వే జోన్

8. ప్రతిష్టాత్మక ఆంధ్రా వర్సిటీ. వీటితో పాటు అక్కడ విశాఖ పోర్ట్ , అత్యంత ముఖ్యమైన విశాఖ ఉక్కు కర్మాగారం, ఉన్నాయి.

రాయలసీమ

1. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (తిరుపతి)
2. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ (తిరుపతి)
3. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (శ్రీ సిటీ)
4. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నలజీ (కర్నూల్)
5. ఇండియన్ కలినరీ ఇన్స్టిట్యూట్ (తిరుపతి)
6. సెంట్రల్ వర్సిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (అనంతపురం)
7. కడప ఉక్కు కర్మాగారానికి ఈ నెలలోనే శంఖుస్థాపన జరిగింది.
8. కీయా మోటార్స్ (అనంతపురం)
9.రాష్ట్రీయసంస్కృత విశ్వ విద్యాలయాన్ని ఇటీవలే కేంద్ర మానవ వనరుల శాఖ, కేంద్ర వర్సిటీ గామార్చే బిల్లుని లోక్ సభలో ప్రవేశ పెట్టింది. (తిరుపతి)
10. హీరో మోటార్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ (చిత్తూర్)



ఇలా తదితర విషయాలు చెప్పుకుంటూ పోతే సీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అనేక ప్రతిష్టాత్మక సంస్థలు వచ్చాయి.

ఉమ్మడి ఏపీలో ఇవన్నీ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఉండేవి. ఇప్పుడు ఏపీలో మూడు ప్రాంతాలకు విస్తరించాయి. ఈ రెండు ప్రాంతాల్లో ప్రభుత్వం కొత్తగాకర్నూల్లో క్లస్టర్ వర్సిటీ, తిరుపతి, విశాఖలో స్కిల్ వర్సిటీలకు సీఎం సన్నద్ధమయ్యారు.

కడప ఉక్కు కర్మాగారం ద్వారా25 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు రానున్నాయనేది ప్రభుత్వ ప్రకటన. హీరో మోటార్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ద్వారా వేల సంఖ్యలో యువతకు ఉపాధి దొరకనున్నది అని నాటి ప్రభుత్వం ప్రకటన. కియా మోటార్స్ కంపెనీ ద్వారా కూడా వేల మందికి ఉపాధి దొరకనుంది అనేది ప్రభుత్వాల వాదన. అది ఎవరి ప్రభుత్వమైనా కావచ్చు. కానీ అందరి వాదన ఇదే. పైగా రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న 75 శాతం స్థానిక రిజర్వేషన్స్‌తో ఆ ప్రాంతాలలోని వారికే ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉంటుంది. ఉద్యోగాల కల్పన, విద్యా సంస్థల అభివృద్ధికి కొన్నాళ్ళు పట్టొచ్చు కానీ, ఆ సంస్థలు ఇప్పటికే సీమ, ఉత్తరాంధ్ర ప్రదేశాల్లో ఉన్నాయి. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు బాగా అభివృద్ధి చెందడానికి సమయం పడుతుంది. ఇది ఏ సంస్థకైనా సహజమే.

రాష్ట్ర స్థాయి వర్సిటీలె చూసుకుంటే కర్నూలులో నేడు రాయలసీమ వర్సిటీ, అబ్దుల్ ఉల్ హక్ వర్సిటీ, త్వరలో రానున్న క్లస్టర్ వర్సిటీ, తిరుపతిలో ఎస్వీ వర్సిటీ, పద్మావతి మహిళా వర్సిటీ, ద్రావిడ వర్సిటీ ఉన్నాయి. నాలుగు జిల్లాలలో ఉన్న రాయలసీమ మొత్తం మీద ఉన్న ప్రభుత్వ వర్సిటీలు, 6 జిల్లాల్లో విస్తరించి ఉన్న కోస్తా ప్రాంతం మొత్తం మీద కూడా లేవు. పైన చెప్పిన ఉత్తరాంధ్రలో, రాయలసీమలో కేంద్ర విద్యా సంస్థలు, ప్రైవేటు పరిశ్రమలు, వీటి బడ్జెట్ మరియు రానున్న కాలంలో వీటి ద్వారా స్థానికంగా కలిగే ఉపాధి ఆ ప్రాంతాల అభివృద్ధికి తప్పక తోడ్పడతాయి అని ఆశిద్దాం.

రాజధానిని తరలించాక, పైన చెప్పబడ్డ ప్రాంతాల్లోసంస్థలు వవృద్ధిలోకి వచ్చాక కోస్తా ప్రాంతం వీటిని చూసి తెల్ల మొహం వేస్తుందేమో. ఒకనాడు భాగ్య నగరానికే పరిమితమైన ఈ సంస్థలు పరిశ్రమలు విభజన తరువాత వివిధ ప్రాంతాల్లో నెలకొల్పబడ్డాయి. వాటి అత్యధిక శాతం సంస్థలు, పరిశ్రమలు రాయల సీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకే చెందాయి. భౌగోళికంగా కరువు ప్రాంతంగా పేరొంది, నీరు అవసరమైన సీమ ప్రదేశంలో ఆ వనరు కోసం ఇప్పటికీ ప్రాజెక్టులు అంటూ ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారు.ఆ ప్రాజెక్టులు పూర్తయ్యి నీటి వనరులు ఆ ప్రాంతాలకు అందుబాటులోకి రావడం మంచిదే. లక్ష కోట్లు రాజధానికి అవుతుంది అంత డబ్బు లేదు కాబట్టే తరలించాల్సిన అవసరం ఉంది అని వాదించే ప్రభుత్వ పెద్దలు, వాళ్ళు చెబుతున్న ప్రాజెక్టులకు వేల కోట్లు ఎక్కడి నుండి తెస్తారో చూడాలి.

ఇప్పుడు విభజన తరువాత కోస్తా అంశానికొద్దాం. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, తూర్పుకోస్తా, సీమ ఇలా నాలుగు అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి అనేది రాజధానిపై వేసిన కమిటీ ప్రతిపాదనగా చర్చ జరుగుతుంది. కోస్తాలో ఆరు జిల్లాలున్న, ప్రస్తుత అమరావతి రాజధాని వ్యాపించి ఉన్న కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఏర్పాటయిన కేంద్ర సంస్థలను ఒకసారి చూద్దాం.

1. ఎయిమ్స్ (వైద్యా విద్యా సంస్థ)
2. ఎన్ఐడీ (నేషనల్ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్)

. సెంట్రల్ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్. ఈకేంద్ర సంస్థలు మినహాయిస్తే చెప్పుకోదగ్గ సంస్థలు ఏవీ రాలేదు. నాగార్జున వర్సిటీ మాత్రమే ఇప్పుడు ఇక్కడున్న అతి పెద్ద ప్రభుత్వ వర్సిటీ.

నేషనల్ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పశ్చిమ గోదావరిలో ఉంది. పైన చెప్పిన ఉత్తరాంధ్ర సీమల్లో ఉన్న విద్యా సంస్థలు, పరిశ్రమలు చూశాక, ఇప్పుడు కోస్తాలో ఉన్న కేంద్ర విద్యా సంస్థలు చూశాక, స్పీకర్లు స్థాయి వ్యక్తులే రాజధానిని ఎడారి అని పోల్చాక, మంత్రులు దీనిని భ్రమరావతిగా భావించాక, ఒక్క నిమిషం ఆలోచించాల్సిన విషయం

భవిష్యత్తులో కోస్తా పరిస్థితి ఏమిటని? ఇప్పటికే కొన్ని నిర్మాణాలు జరిగిన రాజధానిలో, భూములిచ్చిన రైతులకు కలగబోతున్న నష్టం ఏమిటని? భూములు కోల్పోయాక అవి కాంక్రీట్ నిర్మాణాలు అయిపోతున్నాక వారికి తిరిగిచ్చే భూమి ఏమిటని? ఈ ప్రశ్నలకు ఎప్పటికీ ఒక్క జవాబు లేకపోవడం ఆశ్చర్యం.

(తరువాయి భాగం రేపటి సంచికలో)

స్త్రీ బాల వృద్ధులదే హవా!

రేడియో రోజులు




57 భండారు శ్రీనివాసరావు,
9849130595



అక్కడ అన్ని విషయాల్లో పెద్దపీట స్త్రీ బాల వృద్ధులదే! రెండో ప్రపంచ యుద్ధకాలంలో తుపాకీ పట్టగలిగిన ప్రతి మగవాడినీ యుద్ధ రంగానికి పంపిన కారణంగా, దేశాన్ని నడిపేందుకు మహిళల తోడ్పాటు అవసరమయిందని చెప్పుకుంటారు. ఆ రోజుల్లో రైళ్ళూ, బస్సులూ, ట్రాములూ నడపడంతో పాటు కర్మాగారాల్లో కూడా మహిళలే పనిచేశారు. అందుకు కృతజ్ఞతగా, నాటి కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఆడవారికి కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించింది. అనేక రాయితీలు, సదుపాయాలు వారికి సమకూర్చింది. చలిదేశం కాబట్టి ప్రతి ఒక్కరికి చిన్నదో, పెద్దదో ఒక గూడు అవసరం. కొంపాగోడు లేనివాళ్ళు మన దగ్గర మాదిరిగా రైల్వే ప్లాటుఫారాల మీదా, ఫుట్ పాత్‌ల మీద రోజులు వెళ్ళమార్చడం అక్కడ కుదరదు. ఇళ్ళ కేటాయింపు ఆడవారి పేరుపై జరిపే పద్ధతి ప్రవేశపెట్టడంతో కాలక్రమేణా ఇంటి వ్యవహారాల్లో పడతుల పట్టు పెరుగుతూ వచ్చింది. అంతేకాకుండా చదువులు, ఉద్యోగాలలో మగవారితో పోటీపడి సంపాదించుకున్న ఆర్థిక స్వావలంబన వారి స్వేచ్ఛాజీవితానికి ఆలంబనగా మారింది. ఇంటిపై హక్కులు, ఆర్థికపరమైన వెసులుబాటు లభించడంతో ఇళ్ళల్లో వాళ్ళదే పై చేయి అయింది. నిండా ఇరవై ఏళ్ళు నిండకుండానే ఇద్దరు ముగ్గురు మొగుళ్ళకు విడాకులు ఇచ్చి నాలుగో పెళ్ళికి సిద్ధం కాగల సత్తా వారి సొంతం అయింది. మాస్కో రేడియోలో పనిచేసే నతాషా చెప్పినట్టు పండగనాడు కూడా పాత మొగుడేనా అనేవారి సంఖ్య పెరిగింది.

సోవియట్ రష్యాలో ఏటేటా పెరిగిపోతున్న విడాకుల విషయంలో అక్కడ ఓ జోకు ప్రచారంలో ఉంది. భార్యాభర్తల్లో విడాకులు ఎవరు ఇచ్చినా, కొత్త ఇల్లు కేటాయించేవరకు పాత పెళ్ళాంతోనూ, పాత పెళ్ళాం కొత్త మొగుడితోనూ పాత పెళ్ళాం పాత ఫ్లాటులోనే కొన్నాళ్ళ పాటు కలిసి నివసించాల్సిన పరిస్థితి మగవాళ్ళది. పగవాళ్ళకు కూడా ఈ దుస్థితి రాకూడదురా బాబూ అని సరదాగా చెప్పుకునేవారు. అక్కడ ఏకపతీవ్రతం చేస్తున్న ఆడవాళ్ళు కూడా లేకపోలేదు. పిలిపెంకో అనే ఎనభయ్ ఏళ్ళ యువకుడితో మా కుటుంబానికి పరిచయం ఏర్పడింది. ఆయనగారి ఏకైక భార్య గత కొన్ని దశాబ్దాలుగా ఆయనతోనే కాపురం చేస్తోంది. ఒకే మొగుడితో కాపురం అన్న



సూత్రమే ఆవిడను, మా ఆవిడను జత కలిపిందని పిలిపెంకో మహాశయులవారి అభిప్రాయం. ఆయన కుటుంబం, మా కుటుంబం కలిసి ఒకసారి రైల్లో లెనిన్ గ్రాడ్ వెళ్లి వచ్చాము. చివరికి ఈ అనుబంధం ఎంతగా పెనవేసుకుపోయిందంటే మేము ఇండియా తిరిగి వచ్చిన తర్వాత కూడా పిలిపెంకో దంపతులు హైదరాబాదు వచ్చి మా ఇంట్లో వారం రోజులు ఉండి వెళ్ళారు. వారికి వసతిగా ఉండదని హోటల్లో గది బుక్ చేశాము కానీ వాళ్ళు ఒప్పుకోలేదు. ఇంత దూరం వచ్చింది హోటల్లో ఉండడానికి కాదని అన్నారు. గమ్మత్తేమిటంటే నాకూ, మా ఆవిడకు రష్యన్ తెలియదు. వాళ్ళిద్దరికీ రష్యన్ తప్ప మరో భాష తెలియదు. అయినా మా మధ్య అనుబంధానికి ఇది అడ్డంకే కాలేదు. కాకపోతే స్కూల్లో రష్యన్ నేర్చుకున్న మా పిల్లలే మాకు దుబాసీలు.

ఇక చిన్న పిల్లల విషయానికి వస్తే...

ఆ దేశం వారిపాలిట భూతల స్వర్గం. వారు ఆడింది ఆట పాడింది పాట. చదువైనా సంధ్యయినా వారి అభిరుచి ప్రకారమే. మా అబ్బాయిని ఇంజినీరును చేద్దామనుకుంటున్నాము, మా అమ్మాయిని డాక్టరీ చదివిద్దామనుకుంటున్నాము అంటే అక్కడ కుదరదు. చిన్నతరగతుల స్థాయిలోనే వారి అభిరుచులను పసిగట్టే పరీక్ష (యాప్టిట్యూడ్ టెస్ట్) పెట్టి ఆ విద్యార్థి డాక్టర్ అవాలనుకుంటున్నాడో లేక ట్రాక్టర్ డ్రైవర్ కావాలనుకుంటున్నాడో తెలుసుకుని ఆ కోర్సులో చేర్పిస్తారు. ఇందులో తలితండ్రుల ప్రమేయం ఏమాత్రం ఉండదు. చదివించే బాధ్యత సర్కారుదే కావడం వల్లా, డాక్టరుకు, ట్రాక్టరు డ్రైవరుకు జీత భత్యాలలో కానీ, సంఘంలో లభించే గౌరవం విషయంలో కానీ పెద్ద తేడాలు లేని కారణంగా వారికీ అభ్యంతరాలు ఉండవు. మరో విచిత్రం ఏమిటంటే జననాలను ప్రోత్సహించడం. ఎంత ఎక్కువ సంఖ్యలో పిల్లల్ని కంటే ప్రోత్సాహకాలు అంత ఎక్కువగా ఉంటాయి. పదిమందికి మించి పిల్లల్ని కనే సంతాన లక్ష్ములను జాతీయ అవార్డులతో సత్కరిస్తుంటారు. గర్భవతులైన ఉద్యోగినులకు గర్భం ధరించిన సమాచారం ఆఫీసుకు తెలియచేసినప్పటి నుంచి, సుఖ ప్రసవం జరిగి, పుట్టిన బిడ్డ బుడిబుడి నడకలు నడిచే వయసు వచ్చేవరకు, ఆ బిడ్డ ఆలనాపాలనా చూసుకునేందుకు గాను, ఆ తల్లులకు జీతంతో కూడిన సెలవు మంజూరు చేస్తారు. ఆ పుట్టిన పిల్లలు పెరిగి పెద్దయ్యే వరకు ప్రభుత్వం వారికి కల్పించే రాయితీలు, సదుపాయాలు కనీవినీ ఎరుగనివి.

(ఇంకా ఉంది)

నకిలీ చెక్‌లతో బీఎస్ఎన్ఎల్‌కు టోకరా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికామ్ సంస్థ బీఎస్ఎన్ఎల్ అధికారిక ఖాతా నుంచి నకిలీ చెక్ ల ద్వారా రూ. రూ. 24 లక్షలు డ్రా చేసుకున్నట్టు తేలింది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని కేజీ మార్గ్ సమీపంలోని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకులో బీఎస్ఎన్ఎల్ చెక్కుల పేరిట అక్రమంగా నగదును విత్ డ్రా చేసినట్టు అధికారుల విచారణలో తేలింది. నకిలీ చెక్కులను బ్యాంకుకు అందించిన అక్రమార్కులు, బీఎస్ఎన్ఎల్ కు కుచ్చు టోపీ పెట్టారు. ఈ తంతును లేట్ గా గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అఫీషియల్ గా సంస్థ నుంచి ఎటువంటి చెక్కులనూ జారీ చేయలేదని, అయినప్పటికీ, సంస్థ ఖాతా నుంచి డబ్బు మాయమైందని బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ మేనేజర్ లీలా రామ్ మీనా ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై బ్యాంకు అధికారులను సంప్రదించామని, తమ డబ్బును తిరిగి తమ ఖాతాలో వేయాలని కోరగా, బ్యాంకు అధికారులు నిరాకరించారని చెప్పారు. గడచిన నవంబర్ నెల 21న రూ. 66,505 చెక్ ను తామిచ్చామని, అది మాత్రం లబ్ధిదారులకు చేరిందని ఆయన అన్నారు. తాము జారీ చేయని మూడు చెక్కులను తమకు చెప్పకుండానే బ్యాంకు క్లియర్ చేసిందని ఆయన ఆరోపించారు. దీంతో సంస్థకు రూ. 24,25,635 నష్టం చేకూరిందని చెప్పారు. ఇప్పటికే దీనిపై కేసును నమోదు చేశామని అన్నారు. కాగా, ప్రాథమిక విచారణ తరువాత, ఒకే నంబర్ తో బ్యాంకు నుంచి రెండేసి చెక్కుల చొప్పున బ్యాంకుకు అందాయని, ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.



మౌలికాభివృద్ధికి పెద్దపీట



5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

- పెట్టుబడిగా రూ.102 లక్షల కోట్లు
- 39 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా
- ప్రైవేటు కంపెనీలకు 22 శాతం వాటా
- కొత్తగా నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ పథకం
- వెల్లడించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజాన్ని తరిమికొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ ప్యాకేజీనే ఆవిష్కరించింది. 2024 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను ఐదు లక్షల కోట్ల డాలర్ల (దాదావు రూ.356 లక్షల కోట్లు)కు చేర్చాలన్న లక్ష్య సాధన కోసం ఏకంగా రూ.102 లక్షల కోట్ల మౌలిక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. రాబోయే ఐదేళ్లకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వీటిని ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లుగా మౌలిక రంగంలో రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులను పెడుతున్నామని తెలిపారు.

మోడీ ప్రభుత్వం గత ఆరేళ్లలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులపై 50 లక్షల కోట్లు ఖర్చు చేసిందని ఆమె అన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన మంత్రి నిర్మలా సీతారామన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ప్రభుత్వం 50 లక్షల కోట్లు వరకు పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. విద్యుత్, రైల్వే, ఇరిగేషన్, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, డిజిటల్, అర్బన్ మొబిలిటీ, నీటి రంగాల్లో ఈ ఇన్వెస్ట్‌మెంట్లు జరిగాయని ఆమె వివరించారు.

మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను నియమిస్తామని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ చెప్పారని గుర్తు చేసిన ఆమె, అదే టాస్క్ ఫోర్స్ 102 లక్షల కోట్లు విలువ చేసే ప్రాజెక్టులను గుర్తించిందని చెప్పారు. కేవలం నాలుగు నెలల్లోనే 70 మంది వాటాదారులతో సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టులను గుర్తించిందని చెప్పారు. 21 మంత్రిత్వ శాఖల పరిధిలోకి ఈ ప్రాజెక్టులు వస్తాయని 18 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో పెట్టుబడులు పెడతామని చెప్పారు.

భవిష్యత్తులో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంపై మాట్లాడిన నిర్మలా సీతారామన్, 2020లో ద్వితీయార్థంలో ప్రపంచ వార్షిక పెట్టుబడిదారుల సమావేశం భారత్‌లో నిర్వహిస్తామని చెప్పారు. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ కోఆర్డినేషన్ మెకానిజంను త్వరలో ప్రారంభిస్తామని చెప్పిన సీతారామన్... ఇందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ప్రైవేట్ రంగాలకు చెందిన కంపెనీలు భాగస్వాములుగా ఉంటాయన్నారు. లక్ష్యాలను అందుకునేందుకు డీటెయిల్డ్ ప్లాన్, సమాచారం, మరియు పర్యవేక్షణ అమలు చేయడంపై ఈ భాగస్వామ్యం దృష్టిసారిస్తుందని చెప్పారు నిర్మలా సీతారామన్. ఇక ఇది అమలైతే 2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లను అందుకుంటుందని జోస్యం చెప్పారు.

మరికొద్ది వారాల్లో మరో రూ.3 లక్షల కోట్ల ప్రాజెక్టులనూ ప్రకటిస్తామని, జేవర్ ఎయిర్‌పోర్ట్, జల్ జీవన్ మిషన్ ఉండనున్నాయి. కాగా, ఈ రూ.102 లక్షల కోట్ల జాతీయ మౌలిక ప్రాజెక్టుల్లో కేంద్రం 39 శాతం, రాష్ట్రాలు 39 శాతం, ప్రైవేట్ రంగ సంస్థలు 22 శాతం చొప్పున భాగస్వాములుగా ఉంటాయని మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు.

ఇక కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగ సంస్థల సమన్వయంతో నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ (ఎన్ఐపీ)ను ఏర్పాటు చేయాలని కూడా మోదీ సర్కారు నిర్ణయించింది. ఈ మొత్తం ప్రాజెక్టులను ఎన్ఐపీ పర్యవేక్షిస్తుంది. ఈ ప్రాజెక్టుల నిధుల కోసం రుణ మార్కెట్లు, ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు వైపు ప్రభుత్వం చూస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన భారీ మౌలిక పెట్టుబడుల్లో పలు రంగాల ప్రాజెక్టులు ఉన్నాయి. విద్యుత్, రైల్వేలు, రహదారులు, పట్టణాభివృద్ధి, పునరుత్పాదక శక్తి, నీటి పారుదల, విద్య, ఆరోగ్యం, డిజిటల్, మొబిలిటీ, పట్టణాల్లో తాగునీటి అవసరాలు, జల సంరక్షణ, వ్యవసాయం, ఆహార శుద్ధి, ఓడరేవులు, విమానాశ్రయాలు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలున్నాయి. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు కూడా ఇందులో ఉన్నది. 130 కోట్ల దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగా, ఇంటింటికి విద్యుత్ వెలుగుల లక్ష్య సాధనకు తగ్గట్లుగా ఎనర్జీ ప్రాజెక్టులకు మోదీ సర్కార్ అగ్ర తాంబూలం ఇచ్చింది. ప్రస్తుతం దేశంలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తే ఎక్కువగా జరుగుతుండటంతో సౌర, పవన విద్యుదుత్పత్తికి ప్రాధాన్యతనిచ్చేలా కేంద్రం చర్యలు చేపడుతున్నది.

థర్మల్ పవర్, వాతావరణ కాలుష్యానికి దారితీస్తున్న నేపథ్యంలో జల వనరులు తాగు, సాగు అవసరాలకే చాలకుండటంతో ప్రకృతి వనరులపై దృష్టి సారించింది. 2024-25 వరకు ఏయే సంవత్సరానికి ఎంత విలువైన ప్రాజెక్టులను చేపడుతామో ఆ వివరాలను ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అటాను చక్రవర్తి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2019-20)కి రూ.13.6 లక్షల కోట్ల ప్రాజెక్టులను అమలు చేస్తామన్న ఆయన వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21)లో రూ.19.5 లక్షల కోట్ల ప్రాజెక్టులు లైన్‌లోకి వస్తాయని తెలిపారు. 2021-22లో రూ.19 లక్షల కోట్లు, 2022-23లో రూ.13.8 లక్షల కోట్లు, 2023-24లో రూ.12.8 లక్షల కోట్లు, 2024-25లో రూ.11.1 లక్షల కోట్ల ప్రాజెక్టుల అమలు ప్రణాళిక రూపొందించామని అటాను చక్రవర్తి వివరించారు.


1-1-2020 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	41,349.36
గరిష్ఠం	41,443.52
కనిష్ఠం	41,251.18
ముగింపు	**41,306.02**
మార్పు (పా)	52.28
మార్పు (శా)	0.13

&

నిఫ్టీ	
ఆరంభం	12,202.15
గరిష్ఠం	12,222.20
కనిష్ఠం	12,165.30
ముగింపు	**12,182.50**
మార్పు (పా)	14.05
మార్పు (శా)	0.17

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	12,752.13	+15.82	+0.12
S&P BSE SENSEX Next 50	31,557.59	+42.85	+0.14
S&P BSE 100	12,251.58	+15.39	+0.13
S&P BSE Bharat 22 Index	3,289.35	+12.83	+0.39

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
JINDALSAW	85.35	+12.25	+16.76
ECLERX	635.15	+65.70	+11.54
IBREALEST	71.70	+6.50	+9.97
SREINFRA	8.67	+0.74	+9.33
ADANIGAS	176.95	+14.25	+8.76

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
DCAL	78.50	-6.05	-7.16
ESCORTS	606.20	-23.30	-3.70
APLLTD	550.85	-20.45	-3.58
TEJASNET	91.95	-3.15	-3.31
TITAN	1,154.85	-32.75	-2.76

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
RELIANCE	1509.70	69.16	456824
CARERATING	682.20	37.26	535780
IBULHSGFIN	312.50	33.8	1073777
TATASTEEL	467.75	28.58	608785
TATAMOTORS	184.40	27.04	1461450

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	71.2740	యూరో	79.8830
యన్	65.59	పౌండ్	93.4835

18 తరువాత మాల్యా ఆస్తుల వేలం


- అనుమతినిచ్చిన ముంబై కోర్టు
- ఈలోగా కావాలంటే ముంబై కోర్టులో అప్పీల్‌కు అవకాశం
- బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన మాల్యా
- ఆయన ఆస్తుల విలువ రూ.13 వేల కోట్లు అని అంచనా



ముంబయి: లిక్కర్ కింగ్ విజయమాల్యాకు కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. అతని ఆస్తులు వేలం వేయాలని ఆదేశించింది. బ్యాంకులకు దాదావు ఆరువేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ఈ బిజినెస్ మ్యాన్ ఆస్తుల విలువ దాదావు 13 వేల కోట్ల రూపాయలు ఉంటాయని అంచనా. మనీల్యాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ మాల్యా 2016 మార్చిలో లండన్ కు పారిపోయాడు.

2017లో అరెస్టయి ప్రస్తుతం బెయిల్ పై ఉన్నాడు. అయితే మాల్యా ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసింది. దీంతో తమకు భారీమొత్తంలో బకాయి ఉన్నాడంటూ ఎస్ బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం కోర్టును ఆశ్రయించి, అతని ఆస్తులు వేలంవేసి తమ అప్పులకు జమ చేయాలని కోరారు. దీంతో కోర్టు ఆస్తులు జప్తు చేసిన ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారుల అభిప్రాయాన్ని కోరింది. ఆస్తుల లిక్విడేషన్ కు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ఈడీ అధికారులు కోర్టుకు తెలియజేయడంతో వేలానికి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే జనవరి 18 తర్వాత మాత్రమే వేలం వేయాలని ఆదేశిస్తూ, ఈలోగా ముంబై కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం మాల్యాకు ఇచ్చింది.

కొత్త సంవత్సరం తొలి రోజు పాజిటివ్



ముంబయి: నూతన సంవత్సరాన్ని దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ప్రారంభించాయి. ఇన్‌ఫ్రా, ఐటీ, ఎనర్జీ, కన్జ్యూమర్ గూడ్స్ షేర్లు మార్కెట్లను ముందుకు నడిపించినప్పటికీ... ఆటోమొబైల్స్, కొన్ని బ్యాంకింగ్ షేర్లు లాభాలను హరించివేశాయి. ఈ నేపథ్యంలో, ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 52 పాయింట్ల లాభంతో 41,306కి చేరుకుంది. నిఫ్టీ 14 పాయింట్లు పెరిగి 12,182 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్‌గా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (2.76%), ఎన్టీపీసీ (2.06%), మహీంద్రా అండ్ మహీంద్రా (0.97%), ఎల్ అండ్ టీ (0.86%), హెచ్డీఎఫ్సీ లిమిటెడ్ (0.84%) తదితర కంపెనీలుండగా, టైటాన్ కంపెనీ (-2.76%), ఇండస్ ఇండ్ బ్యాంక్ (-1.72%), బజాజ్ ఆటో (-1.21%), ఓఎన్జీసీ (-1.05%), టాటా స్టీల్ (-0.90%) తదితర కంపెనీలు నష్టపోయాయి.

6.91 లక్షల యూనిట్లకు హ్యుందాయ్ విక్రయాలు



న్యూఢిల్లీ: ఇండియా నుంచి అత్యధికంగా కార్లను ఎగుమతి చేస్తున్న హ్యుందాయ్, గడచిన 2019 సంవత్సరంలో 6,91,460 యూనిట్లను విక్రయించింది. ఇందులో 5,10,260 యూనిట్లను దేశంలో విక్రయించామని, 1,81,200 యూనిట్లను ఎగుమతి చేశామని సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సంవత్సరం తాము విడుదల చేసిన వెన్యూ బుకింగ్స్ లక్ష యూనిట్లను దాటినట్లు సంస్థ సేల్స్ డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలియజేశారు. ఈ సంవత్సరం ఆటోమొబైల్ ఇండస్ట్రీకి ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయని అభిప్రాయపడ్డ ఆయన, వెన్యూతో పాటు లాంగ్ రేంజ్ ఫుల్లీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కోనా అమ్మకాలు సంతృప్తికరంగా సాగుతున్నాయని తెలిపారు. కొత్త సంవత్సరంలో తాము విడుదల చేసే అన్ని మోడళ్లూ బీఎస్6 నాణ్యతా ప్రమాణాలను పాటిస్తాయని పేర్కొన్నారు.

సబ్సిడీ రహిత గ్యాస్ ధర పెంపు

- రూ. 20 వరకూ పెంచిన చమురు కంపెనీలు
- ఐదు నెలల వ్యవధిలో రూ. 140 పెరిగిన ధర



న్యూఢిల్లీ: సబ్సిడీ రహిత వంట గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతున్నట్టు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రకటించాయి. 14.2 కిలోల సిలిండర్ పై న్యూఢిల్లీలో రూ. 19, ముంబైలో రూ. 19.50, ఇతర ప్రాంతాల్లో రూ. 20 వరకూ పెంచుతున్నట్టు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకటించింది. దీంతో వరుసగా ఐదో నెలలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర పెరిగినట్లయింది. ఈ ఐదు నెలల వ్యవధిలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 140 పెరిగినట్లయింది. ధరల పెంపు తరువాత ప్రస్తుతం న్యూఢిల్లీలో రూ. 684గా ఉన్న సిలిండర్ ధర రూ. 714కు చేరింది. ముంబైలో సిలిండర్ ధర రూ. 895కు పెరిగింది. ఇక కోల్ కతాలో రూ. 747, చెన్నైలో రూ. 734కు సిలిండర్ ధర చేరింది. పెంచిన ధరలు తక్షణం అమలులోకి వస్తాయని ఐఓసీఎల్ వెల్లడించింది. ఇదే సమయంలో 19 కిలోల బరువుండే కమర్షియల్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 1,241, ముంబైలో రూ. 1,190గా ఉందని ఇండియన్ ఆయిల్ పేర్కొంది.

రూ. లక్ష కోట్లు దాటిన డిసెంబర్ జీఎస్‌టీ వసూళ్లు



న్యూఢిల్లీ: గడచిన డిసెంబర్ నెలలో వస్తుసేవల పన్ను వసూళ్లు రూ.లక్ష కోట్లను దాటాయి. వరుసగా ఈ మైలురాయిని దాటడం ఇది రెండోసారి. ఈ నెలలో రూ.1.03లక్షల కోట్ల మేరకు వసూళ్లను సాధించింది. అంతకుముందు నెలతో పోలిస్తే నవంబర్‌లో రూ.1.03 లక్షల కోట్లు సాధించింది. దాదావు 6శాతం వృద్ధిరేటును సాధించినట్లైంది. ఆదే మొత్తాన్ని గత నెలలో కూడా కొనసాగించాయి. సీజీఎస్‌టీ వసూళ్లు రూ.19,962 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.26,792 కోట్లకు, ఐజీఎస్‌టీ వసూళ్లు రూ.48,099 కోట్లు వసూలు చేశారు. ఇక గత నెలలో రూ.8,331 కోట్ల మేరకు సుంకం వసూలైంది. సెప్టెంబర్ నెలలో జీఎస్‌టీ వసూళ్లు కుంగాయి. దాదావు 2.7శాతం తగ్గగా.. ఇక అక్టోబర్‌లో అవి 5.3శాతం పడిపోయాయి. నవంబర్‌లో సీజీఎస్‌టీ రూ.19,592 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ.27,144 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.49,028 కోట్లు వసూలయ్యాయి. ఆ నెలలో సెస్ రూపంలో రూ.7,727 కోట్లు వసూలయ్యాయి.


విక్రయాలు పెంచుకున్న మారుతి సుజుకి

న్యూఢిల్లీ: 2019 సంవత్సరం ఆటోమొబైల్ సంస్థలకు చేదు అనుభవాల్ని మిగిల్చినప్పటికీ చివరి నెల మాత్రం కొంత ఊరటనిచ్చింది. దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీసుజుకీ విక్రయాలు చివర్లో స్వల్పంగా పుంజుకొన్నాయి. ఈ నెలలో 1,33,296 ప్యాసింజర్ కార్లను విక్రయించింది. గత డిసెంబర్‌తో పోల్చుకొంటే 2.4శాతం పెరిగినట్లు తేలింది. ముఖ్యంగా వేగనార్ వంటి కాంపాక్ట్ కార్లకు డిమాండ్ పుంజుకొంది. గత ఏడాది ఇదే నెలలో 1,21,479 వాహనాలను దేశీయంగా విక్రయించినట్లు మారుతీ పేర్కొంది. ఈ సారి 1,24,375 వాహనాలను అమ్మినట్లు వెల్లడించింది. వీటికి ఎగుమతి చేసిన వాహనాల సంఖ్యను కలపలేదు. కాకపోతే మారుతీ తురుపు ముక్క ఆల్టో ఉన్న చిన్న కార్ల విభాగంలో మాత్రం విక్రయాలు 13.6శాతం తగ్గాయి. మధ్యశ్రేణి వాహనమైన సియాజ్ విక్రయాల్లో మాత్రం 62శాతం తగ్గుదల నమోదైంది. కానీ, కాంపాక్ట్ కేటగిరిలోని స్విఫ్ట్, వేగనార్, సెలిరియో, డిజైర్ల విక్రయాలు మాత్రం పెరిగాయి. ఇక ఏప్రిల్–డిసెంబర్ మధ్యలో విక్రయాలు మాత్రం 17శాతం తగ్గాయి.

స్వల్పంగా పెరిగిన రైల్వే చార్జీలు

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో రైల్వే ప్రయాణికులకు రైల్వే శాఖ షాక్ ఇవ్వనుంది. రైల్వే ఛార్జీలను స్వల్పంగా పెంచింది. పెంచిన ఛార్జీలు తక్షణం అమల్లోకి రానున్నట్టు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పెరిగిన ఛార్జీలు సబర్బన్ ప్రాంతానికి, సీజన్ టికెట్లకు వర్తించవని తెలిపింది. ఆర్డినరీ నాన్–ఏసీ (నాన్– సబర్బన్)లో ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ ల కు కిలోమీటర్ కు ఒక పైసా చొప్పున, మెయిల్ లేదా ఎక్స్ ప్రెస్ (నాన్–ఏసీ)లో సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ లకు కిలోమీటర్ కు రెండు పైసల చొప్పున పెంచింది. ఏసీ క్లాసెస్ కు సంబంధించి.. ఏసీ చైర్ కార్, ఏసీ–3 టైర్/ 3–టైర్ ఎకానమీ, ఏసీ–2 టైర్, ఏసీ ఫస్ట్ క్లాస్, ఎగ్జిక్యూటివ్ చైర్ లకు నాలుగు పైసల చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టు రైల్వే శాఖ పేర్కొంది.

కరెన్సీని గుర్తించేందుకు ఆర్బీఐ కొత్త యాప్



న్యూఢిల్లీ: కంటి చూవు సరిగా లేని వారి కోసం కరెన్సీ నోట్లను గుర్తించేందుకు వీలుగా ఆర్బీఐ సరికొత్త సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎంఏఎన్ఐ(మని) పేరుతో మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించింది. దీన్ని బుధవారం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రారంభించారు. ఈ అప్లికేషన్ సాయంతో కంటి చూపు సరిగా లేని వారు సులువుగా నోట్లను గుర్తించేలా దీన్ని తయారు చేశామని ఆర్బీఐ అధికారులు వెల్లడించారు. ఈ యాప్‌ను ఒకసారి ఇన్‌స్టాల్ చేసుకుంటే ఆఫ్‌లైన్‌లో కూడా పనిచేస్తుందని తెలిపారు. ఆండ్రాయిడ్, ఐ ఫోన్ యూజర్లు ఉచితంగానే దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ యాప్ కెమెరా సాయంతో కరెన్సీ నోట్లను స్కాన్ చేసి హిందీ లేదా ఇంగ్లీష్ ద్వారా సమాధానం ఇస్తుందని తెలిపారు. ఆర్బీఐ మహాత్మాగాంధీ సిరీస్ పేరుతో సైజులు, డిజైన్లలో మార్పులు చేసి 2016 నవంబర్‌లో కొత్త నోట్లను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా రూ.2000, రూ.500, రూ.100, రూ.200, రూ.50, రూ.20, రూ.10 నోట్లను విడుదల చేసింది.

2020లో ఒకటి, రెండు రోజులు సెలవు పెడితే
ఐదారు రోజులు కలిసొచ్చే సమయాలివి

పలుమార్లు వరుస సెలవులకు అవకాశం - ముందే ప్లాన్ చేసుకుంటే మంచి చాన్స్

హైదరాబాద్: వచ్చే సంవత్సరం సెలవుల జాబితాను విడుదలైంది. ఈ సంవత్సరం శనివారం లేదా సోమవారం నాడు వచ్చిన పర్వదినాల సంఖ్య ఎక్కువగానే ఉంది. అంటే రెండు రోజులు సెలవులు వచ్చే కాలమన్నమాట. ఇక ఇదే సమయంలో మరో ఒకటి లేదా రెండు రోజులు సెలవు పెట్టుకుంటే, నాలుగైదు రోజులు సెలవులు ఎంజాయ్ చేసే సందర్భాలు కూడా ఉన్నాయి.

జనవరిలో 14న మంగళవారం భోగి, 15న బుధవారం సంక్రాంతి పర్వదినాలున్నాయి. జనవరి 11వ తేదీ 2వ శనివారం, 12న ఆదివారం కావడంతో, 13వ తేదీ సోమవారం నాడు సెలవు పెట్టుకుంటే ఐదు రోజుల సెలవులను ఎంజాయ్ చేయవచ్చు.

ఇక మహా శివరాత్రి ఫిబ్రవరి 21 శుక్రవారం నాడు వచ్చింది. 22వ తేదీ నాలుగో శనివారం, 23 ఆదివారం. ఆపై ఒకటి లేదా రెండు రోజులు సెలవు పెట్టుకోగలిగితే, మరోసారి ఐదు రోజులు ఎక్కడికైనా వెళ్లి రావచ్చు.



మార్చిలో 23న సోమవారం నాడు షబ్ ఏ మెరాజ్ పర్వదినం ఐచ్ఛిక సెలవు కాగా, ఆపై 25న ఉగాది సెలవుంది. వీటికి ముందు 22న ఆదివారం ఎలాగూ ఉంటుంది. 24న సెలవు పెట్టుకుంటే నాలుగు రోజుల సెలవు లభిస్తుంది.

జూలై 31న శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం, ఆగస్టు 3న రాఖీ పౌర్ణమి (ఐచ్ఛిక సెలవులు) ఉన్నాయి. వీటి మధ్య ఆగస్టు 1 శనివారం నాడు బక్రీద్ రానుంది. ఆదివారం సెలవు, రెండు ఐచ్ఛిక సెలవు దినాలతో కలిపి మరోసారి ఐదు రోజుల సెలవులను ఆనందించే వీలుంటుంది.

గాంధీజయంతి అక్టోబర్ 2 శుక్రవారం వచ్చింది. ఒక రోజు సెలవు పెట్టుకుంటే, ఆదివారం కలిపి, మూడు రోజుల వరుస సెలవులు వస్తాయి. మిలాడినబి కూడా శుక్రవారం (అక్టోబర్ 30) నాడు రానుంది. ఒక రోజు సెలవుతో మూడు రోజుల సెలవులు వస్తాయి.

నవంబర్ 30న సోమవారం నాడు కార్తీక పూర్ణమి సెలవు. దానికి ముందు నాలుగో శనివారం, ఆదివారం ఎలానూ సెలవులే. 27న ఐచ్ఛిక సెలవుగా యాజ్ దుహమ్ షరీఫ్ రానుంది. అటూ ఇటూ ఒకటి రెండు రోజులు సెలవుతో ఏకంగా దాదావు వారం రోజుల పాటు ఎటైనా వెళ్లి రావచ్చు.

ఇదే సమయంలో మొత్తం మీద ప్రభుత్వం ప్రకటించిన 23 సాధారణ సెలవుల్లో ఆరు సెలవులు శనివారం నాడు వస్తున్నాయి. దీంతో ఆదివారం కూడా సెలవు దొరకనుంది. ముందుగా ప్లాన్ చేసుకుంటే, ఈ సంవత్సరం సెలవులే సెలవులనడంలో సందేహం లేదు.

అప్పో నుంచి త్వరలో కొత్త స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ: పాత ఏడాదికి వీడ్కోలు చెప్తూ.. కొత్త ఏడాదిని సరికొత్తగా స్వాగతించేందుకు కొత్త స్మార్ట్‌ఫోన్ ఎఫ్ 15ను విడుదల చేస్తున్నట్టు అప్పో ప్రకటించింది. చూడగానే నచ్చే స్లీక్ డిజైన్ దీని ప్రత్యేకతని, ఇప్పటివరకూ వచ్చిన స్మార్ట్‌ఫోన్లను మరిపిస్తుందని పేర్కొంది. సరికొత్త ఆవిష్కరణలతో రాబోతున్న ఎఫ్ సీరీస్ కొత్త ఫోన్ త్వరలో మార్కెట్లోకి రానుందని, ఈ ఫోన్ స్పెసిఫికేషన్స్, ధరల వివరాలను అతి త్వరలో తెలియజేస్తామని సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది.

ప్రైవేటు కార్లను నిషేధిస్తున్న తొలి నగరంగా యార్క్: డీజిల్, పెట్రోల్‌తో సంబంధం లేకుండా ప్రపంచంలో ప్రైవేటు కార్లను పూర్తిగా నిషేధిస్తున్న తొలి నగరం బ్రిటన్‌లోని యార్క్ సిటీ. పబ్లిక్ రవాణా బస్సులు, దివ్యాంగులను తీసుకెళ్లే వాహనాలు మినహా మిగతా ప్రయాణికులను తీసుకెళ్లే ప్రైవేటు వాహనాలన్నింటిని నిషేధించాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ నిషేధం సిటీవాల్స్ వరకు, నగరం చుట్టూ నిర్మించిన గోడల పరిధి వరకు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. నగరం చుట్టూ రోమన్ కాలంలో నిర్మించిన గోడలు ఇప్పటికీ అక్కడ బలంగానే ఉన్నాయి. పబ్లిక్ రవాణాను ప్రోత్సహించడంలో భాగంగా పెట్రోలు, డీజిల్ కార్లే కాకుండా ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లను కూడా నిషేధించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సిడిఎస్ చరిత్రాత్మకం

- వ్యవస్థ భారత మిలిటరీని ఆధునికీకరిస్తుంది : మోడీ
- నూతన దశాబ్దం సందర్భంగా సీడీఎస్ రావడం సంతోషంగా ఉంది
- మన మిలిటరీ మరింత బలోపేతం కావడానికి ఇది తోడ్పడుతుంది
- 130 కోట్ల ప్రజల ఆకాంక్షలను ఈ వ్యవస్థ నెరవేరుస్తుంది

న్యూఢిల్లీ : నూతన సంవత్సరం, నూతన దశాబ్దం ప్రారంభం సందర్భంగా మన దేశానికి తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) రావడం సంతోషంగా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సిడిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన బిపిన్ రావత్‌కు మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం కోసం ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. తొలి సిడిఎస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని చెప్పారు. 2019 ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ, దేశానికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ రాబోతున్నారని తాను ప్రకటించానని మోడీ గుర్తు చేశారు. మన మిలిటరీ బలగాలు మరింత బలోపేతం కావడానికి ఈ వ్యవస్థ తోడ్పడుతుందని చెప్పారు. త్రివిధ బలగాలు మరింత ఆధునికీకరించబడతాయని అన్నారు. 130 కోట్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఈ వ్యవస్థ పని చేస్తుందని చెప్పారు. అత్యున్నతమైన నిపుణులతో మిలిటరీ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం ఒక గొప్ప సంస్కరణ అని చెప్పారు. ఆధునిక యుద్ధాలకు సంబంధించి మిలిటరీ రూపురేఖలను ఈ వ్యవస్థ సమూలంగా మార్చి వేస్తుందని తెలిపారు.



అమరావతి భవితవ్యం ఏమిటి ?

- 2020లో రాజధాని మార్పు తప్పదా ?
- కారుణ్య మరణాలకు రాష్ట్రపతికి రైతుల లేఖ
- అసెంబ్లీలో చర్చ తరువాత నిర్ణయంపై ప్రజల్లో ఉత్కంఠ
- రోజుకో రకంగా మంత్రుల వ్యాఖ్యలు
- రాజధానిపై ఆగని విపక్షాల పోరు
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు రివర్స్
- కోస్తా జిల్లాల్లోని అధికార పార్టీ ఎమ్మెల్యేలలో ఆందోళన
- రాష్ట్రం నలుమూలలకు అమరావతి ప్రాంత రైతుల ఉద్యమం
- రాజధానిని విశాఖకు తరలించే కుట్ర ? పాలక పెద్దల్లో అంతర్మథనం
- తొలుత కేంద్రాన్ని ఒప్పించే పనికి శ్రీకారం
- ఏపీలో రాజధాని తరలింపుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



(అమరావతి నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి): వేడి పెరుగుతోంది.. ఉద్యమం విస్తరిస్తోంది.. భావోద్వేగాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.. తొలి రెండ జులు ఏమీ లేదులే అనుకున్న. సాక్షాత్తు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అనుచరులు, పార్టీకి ఓటేసిన వారు, మద్దతిస్తున్న కార్యకర్తలు సైతం ఇదేమిటన్నా? అని ప్రశ్నిస్తున్నారు. అక్కడ ఎమ్మెల్యేలు వారి ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి వద్ద మాత్రం బింకాలు ప్రదర్శిస్తున్నారు. ఇది తమకు రాజకీయంగా నష్టం తెచ్చిపెడుతుందేమోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. రాజధాని తరలింపు అంశం కోస్తా జిల్లాల్లోని అధికారపార్టీ ఎమ్మెల్యేలలో ఆందోళన రేపుతోంది. లోలోపల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాజధానిని విశాఖకు తరలిస్తుండటంపై అమరావతి ప్రాంత రైతులు ప్రారంభించిన ఉద్యమం రాష్ట్రం నలుమూలలకు విస్తరిస్తోంది. కోస్తాలో కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాలకు కూడా పాకింది. రైతుల ఆందోళనను తొలుత లైట్‌గా తీసుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు ఆ తర్వాత సెగ తగులుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నరసారావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి బహిరంగంగానే పరిపాలన ఒకేచోట ఉండాలనీ, శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ ఒకచోట ఉంటేనే నిర్ణయాలు వెంటనే తీసుకోవచ్చునీ వ్యాఖ్యానించారు. ఆ మరుసటిరోజే అగ్రనేతల ఒత్తిడితో ఆ ప్రకటనను ఉపసంహరించుకున్నప్పటికీ... వైసీపీ ఎమ్మెల్యేల్లో అంతర్లీనంగా ఉన్న భావన ఏమిటో తెలిసిపోయింది. అమరావతి ప్రాంత గ్రామాల్లో విస్తరించి ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేల. తమకు భవిష్యత్తులో రాజకీయంగా ఇబ్బందేనని భావిస్తున్నారట. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ రాజకీయ సెగ ఎక్కువైంది. తమ నియోజకవర్గ ఎమ్మెల్యేల వద్దకు సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన కార్యకర్తలే వెళ్లి ప్రభుత్వ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది సదరు ఎమ్మెల్యేలకు పెద్ద తలనొప్పిగా మారిందని చర్చ జరుగుతోంది. మరోవైపు మంత్రివర్గ సమావేశానికి ముందు రోజు సీఎం జగన్ నివాసంలో ఆయన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి వద్ద గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఇందులో ఎమ్మెల్యేలందరూ నియోజకవర్గాల్లో నిరసనలు, ఆందోళనలు పెరిగాయనీ, తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనీ మొహం మీదే చెప్పేశారు. రాజధాని రైతుల ఆందోళనలు, అక్కడి మహిళల కన్నీరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమై ప్రజల్లోకి బలంగా వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో సామాన్య ప్రజానీకం కూడా రాజధాని అమరావతిని తరలించటం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారని వివరించారు. శాసన రాజధాని ఇక్కడే ఉంటుంది కదా అని వ్యాఖ్యానించగా, ఆ అసెంబ్లీ సమావేశాలు కూడా కేవలం శీతాకాలానికే పరిమితం చేయటంపట్ల ఎమ్మెల్యేలు ప్రస్తావించినట్టు తెలిసింది. దీనివల్ల భవిష్యత్ లో రాజకీయంగా నష్టమేననీ, రాజధానిని తరలించుకుపోతున్నారనే ఆవేదన ప్రజల్లో నాటుకుపోయిందనీ, కోస్తాంధ్ర ప్రజలు రోడ్డుకు మీదకు రారనీ, సమయం చూసి వాత పెడతారనీ ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఇక ఇదే సమావేశంలో పాల్గొన్న ఓ ప్రముఖుడు మాత్రం చంద్రబాబు రాజధానిని గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేస్తే ఆ రాజధాని ఏర్పాటైన తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో తెలుగుదేశం అభ్యర్థులను ఎందుకు ఓడించారు? అని ప్రశ్నించారట. రెండు జిల్లాల్లో తెలుగుదేశం పార్టీకి నాలుగు సీట్లు మాత్రమే వచ్చాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆ ప్రముఖుడు ఎమ్మెల్యేలకు హితవు చెప్పారట. అయితే రాజధానిపై ఈ వాదన తెస్తున్న ఆ ప్రముఖుడి అభిప్రాయాలను బయటకొచ్చాక ఎమ్మెల్యేలు తీవ్రంగా వ్యతిరేకించారని సమాచారం. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తే విశాఖపట్నంలో పాలనా రాజధానిని ఏర్పాటు చేస్తే రేపు వైసీపీకి ఓట్లు పడతాయనే నమ్మకం ఉందా? అని నిలదీశారు. మొత్తంమీద ఇలాంటి వాద, ప్రతివాదనలు అధికార పార్టీ ఎమ్మెల్యేలను లోలోపల కలవరపరుస్తున్నాయని తెలుస్తోంది. రాజధాని రైతులకు న్యాయం చేయాలని, వారి సమస్యలను పరిష్కరించిన తర్వాతనే రాజధాని తరలింపుపై ఓ నిర్ణయానికొస్తే బాగుంటుందని కూడా వారు సూచించినట్లు సమాచారం. ఈ అంశాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని సదరు ప్రముఖుడు కూడా హామీ ఇచ్చారట. కానీ బయటికొచ్చి మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యేల ఫేస్ రీడింగ్ చూస్తే మాత్రం అంత సంతృప్తికరంగా ఉన్నట్టు కనిపించలేదు. బయటికేమో తామంతా జగన్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పి వెళ్లిపోయారు. పైగా రాజధాని నిర్మాణం కోసం లక్షా 10 వేల కోట్ల రూపాయల వ్యయమవుతుందని చంద్రబాబు చెప్పారనీ, అంత బడ్జెట్ ప్రభుత్వం వద్ద లేదనీ వారు వివరించారు. చివరకు ఆ నెపం చంద్రబాబుపై నెట్టే ప్రయత్నాలు చేశారు. కానీ లోపల జరిగిన తంతు నిదానంగా బయటకు పొక్కడంతో తమ నియోజకవర్గాల ప్రజలకు సదరు ఎమ్మెల్యేలు సమాధానం చెప్పుకోలేకపోతున్నారట. మరి ఈ పరిస్థితి ముమ్ముందు ఏ పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

మూడు రాజధానులపై వైసీపీకి మూడు షాక్‌లు? : కర్నూలుకి భారీ పరిశ్రమలు రాబోతున్నాయి. ఈ పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం, పరిశ్రమల యజమానుల మధ్య ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ ఎంవోయూలో భాగంగా కర్నూలులో ఐదు జిరాక్స్ షాపులు, ఆరు టీ దుకాణాలు రాబోతున్నాయి. మరో రెండు మూడు జిరాక్స్ షాపులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది..” ఇదీ సోషల్ మీడియాలో మూడు రాజధానులపై పేలుతున్న సెటైర్లు. మూడు రాజధానుల ప్రకటనపై ఎక్కడో తేడా కొట్టిందని ప్రభుత్వం గమనించింది. పాలక పెద్దల్లో అంతర్మథనం మొదలైంది. అందుకే వాయిదా వ్యూహానికి తెరతీసింది. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుగానే సాగుతోంది ఏపీలో జగన్ పాలన. మూడు రాజధానుల ప్రకటనపై రాష్ట్రంలో ఆశించిన మైలేజ్ రాలేదని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు. తాము కోరకపోయినా రాష్ట్రం మధ్యలో ఉందని రాజధానిని ఏర్పాటుచేసి ఇప్పుడు దాన్ని తరలించడం ఏమిటనే ఆవేదన కోస్తా ప్రజల్లో అంతకంతకూ తీవ్రమౌతోంది. చివరికి అది ఉద్యమ రూపం కూడా దాల్చింది. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుచేస్తామన్న ప్రభుత్వ ప్రకటన, అందుకు తగ్గట్టే జీఎన్ రావు కమిటీ ఇచ్చిన రిపోర్టు కర్నూలు పట్టణంలో తొలుత ఉత్సాహాన్ని రేకెత్తించాయి. కానీ ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో ఆ జోష్ ఆవిరైపోయింది. హైకోర్టు ఏర్పాటుచేసినందు వల్ల పెద్దగా ప్రయోజనం లేదని స్థానిక రాజకీయ నేతలు పెదవి విరిచారు. ఈ అంశం ప్రజల్లోకి కూడా బలంగా వెళ్లింది. తాము హైకోర్టుకు రావాలంటే ఎలా అని నెల్లూరు, చిత్తూరు జిల్లాల ప్రజలు సైతం తర్జనభర్జనలు పడటం మొదలైంది. దీంతో జ్యుడీషియల్ క్యాపిటల్ అంశం రాయలసీమలో ఆశించిన మైలేజీని చేకూర్చలేదని వైసీపీలో అంతర్గత చర్చ సాగుతోంది.

విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ ఏర్పాటు ప్రకటనపై కూడా ఉత్తరాంధ్రలో మిశ్రమ స్పందన రావటం వైసీపీ నేతలకి జీర్ణంకావడం లేదు. తమకొచ్చిన అనుకూల ప్రచారం కాస్తా అమరావతి ప్రాంతంలో రైతు కుటుంబాల మహిళలు చేస్తున్న ఆక్రందనల ఫలితంగా కరిగిపోయిందని వైసీపీ కీలక నేత ఒకరు విశ్లేషించారు. రాజధాని తరలింపునకు జీఎన్ రావు కమిటీ నివేదిక సరిపోతుందని తొలుత ప్రభుత్వ పెద్దలు భావించారు. ఆ కమిటీ సిఫారసులపై క్యాబినెట్ సమావేశంలో తీర్మానంచేసి తరలింపు ప్రక్రియను ప్రారంభించాలని తలపోశారు. అయితే ఇలా చేస్తే వచ్చే రోజుల్లో న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయనీ, రాజకీయంగా కూడా ఆశించిన మైలేజ్ రాకపోవచ్చుననీ వైసీపీ వ్యూహకర్తలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే వైసీపీ తన ఎత్తుగడను మార్చింది. కోస్తాంధ్రలో భావోద్వేగాలు పెల్లుబుకుతున్న ప్రస్తుత తరుణంలో రాజధానిపై తొందరపడి నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు ఎదురవుతాయని క్యాబినెట్‌లో సీనియర్ మంత్రులు సీఎం జగన్‌కు వివరించారట. చట్టపరంగా, న్యాయపరంగా, రాజకీయంగా ఇబ్బందుల్లేకుండా ముందుకెళితే బాగుంటుందని కూడా వారు సూచించారట. రాజధాని తరలింపును బీజేపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో తొలుత కేంద్రాన్ని ఒప్పించే పనికి శ్రీకారం చుట్టాలని ఏపీ ప్రభుత్వ పెద్దలు నిర్ణయించుకున్నారు. ఒకవేళ కేంద్రం అనుమతించని పక్షంలో భవిష్యత్‌లో సమస్యలు తలెత్తుతాయనీ, కేంద్ర- రాష్ట్రాల మధ్య సంబంధాలు కూడా దెబ్బతింటాయనీ వైసీపీ ముఖ్యనేతలు భావించారట. అందువల్లే వాయిదా వ్యూహాన్ని తెరపైకి తీసుకొచ్చారట. ఇదిలా ఉంటే పాలకులు మారినప్పుడల్లా నిర్ణయాలు మార్చుకుంటూ పోవడంపై కొందరు నిపుణులు అభ్యంతరాలు వ్యక్తంచేయడం గమనార్హం. రాజధాని అంశంపై ఒక వైపు కోస్తాలో భావోద్వేగాలు రగలడం, రాయలసీమలో మైలేజ్ దక్కకపోవడం, ఉత్తరాంధ్రలో మిశ్రమ స్పందన రావడం వంటి అంశాలపై సీఎం జగన్‌కు గూఢచారి వర్గాలు నివేదిక అందించాయట. ఏపీలో రాజధాని తరలింపుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కేంద్రానికి కూడా నిఘావర్గాలు సమాచారం చేరవేశాయట. ఈ పరిస్థితుల్లో బీజేపీ తన వైఖరిని మరింతగా స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది. దీంతో వైసీపీ వ్యూహకర్తలు పూర్తిగా డిఫెన్స్‌లో పడ్డారట. ఇప్పటికిప్పుడు రాజధానిని తరలిస్తే భవిష్యత్‌లో ప్రతిబంధకాలు ఎదురవుతాయన్న నిశ్చయానికి వచ్చారట. ఆ వెంటనే నష్టనివారణ చర్యలు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారట.

కారుణ్య మరణాలు కోరుతూ రాష్ట్రపతికి రాజధాని రైతుల లేఖ : రాష్ట్రపతి కోవింద్‌కు రాజధాని రైతులు లేఖలు రాశారు. కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని రైతులు లేఖలో పేర్కొన్నారు. రాజధాని విషయంలో మోసపోయినందున చనిపోయే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో తామంతా ఉన్నపళంగా రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారని తెలిపారు. కేవలం సీఎం, పలువురి స్వలాభం కోసం రాజధానిని విశాఖకు తరలించే కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. 15 రోజులుగా కుటుంబాలతో కలిసి ఆందోళనలు చేస్తున్నా తమ గోడు వినిపించుకున్నవారు లేరని లేఖలో రాజధాని రైతులు వాపోయారు. అధికార పార్టీ నేతలు మా త్యాగాన్ని హేళన చేస్తున్నారు. కులం, మతం, ప్రాంతం అంటగడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఆందోళన చేస్తున్న రైతుల్ని పెయిడ్ ఆర్టిస్టులని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ప్రశ్నిస్తే మాపై దాడులకు దిగుతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అర్ధరాత్రి మా ఇళ్ల పైకి పోలీసులను పంపి మమ్మల్ని జైళ్లలో పెడుతున్నారు. మా పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. అండగా నిలవాల్సిన ప్రభుత్వమే మాపై కక్ష కట్టింది. రాజధాని తరలిపోతే మేము జీవచ్ఛవాలుగా మిగిలిపోతాం. ఈ బతుకులు మాకొద్దు.. మాకు మరణమే శరణ్యం. మా యందు దయ ఉంచి కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వండి. అని రాష్ట్రపతికి రాసిన లేఖలో రాజధాని రైతులు పేర్కొన్నారు.

దేవినేని ఉమామహేశ్వరరావుకు సంఘీభావం: అమరావతి కోసం రాజధాని రైతులకు మద్దతుగా 24 గంటల దీక్ష చేపట్టిన దేవినేని ఉమామహేశ్వరరావుకు సంఘీభావం తెలిపేందుకు మహిళలు ప్రజలు సేవ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ సేవ్ ఫార్మర్స్ వచ్చి తమ సంఘీభావం తెలియజేశారు. గొల్లపూడిలోని దీక్షా ప్రాంగణంలో మాజీ మంత్రి పీతల సుజాత, తెలుగుదేశం పార్టీ పొలి ట్బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తెలుగుదే శం పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రామ్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొత్త నాగేంద్రబాబు ఇతర నేతలు కలసి తమ సంఘీభావం తెలియజేశారు.

సరిహద్దుపై దృష్టి



న్యూఢిల్లీ : చైనాతో సరిహద్దు సమస్యలకు త్వరలోనే శాశ్వత సానుకూల పరిష్కారం లభిస్తుందని నూతన ఆర్మీ చీఫ్ జనరల్ ముకుంద్ నరవనే ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు ప్రధాన దేశాలతో భారత్ సరిహద్దులు పంచుకుంటోందని, ఇరు దేశాలూ సమాన ప్రాధాన్యత కలిగినవేనని ఆయన అన్నారు. గతంలో మనం పశ్చిమ ప్రాంతం వైపే దృష్టి సారించామని, ఉత్తర ప్రాంతం కూడా అంతే ప్రాధాన్యం కలిగి ఉందని గుర్తెరగాలన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనంపై రాజకీయ నేతలు తరచు చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ అన్ని సవాళ్లు, వ్యూహాలపై సైన్యం విశ్లేషిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని జనరల్ నరవనే పేర్కొన్నారు. సేనల ఆధునికీకరణ ప్రణాళికలకు కీలక ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. సవాళ్లకు అనుగుణంగా దీర్ఘ కాల వ్యూహాలతో ముందుకు వెళతామని, సేనలకు ఎదురయ్యే సవాళ్లలో మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. కాగా సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ బిపిన్ రావత్ స్థానంలో దేశ 28వ ఆర్మీ చీఫ్‌గా జనరల్ నరవనే మంగళవారం నూతన బాధ్యతలు స్వీకరించారు.

రాజకీయాలకు దూరం




న్యూఢిల్లీ : ఆర్మీ, వాయు, నౌకా దళ సేనలు ఒక జట్టుగా పని చేస్తాయని దేశ తొలి త్రి దళాధిపతి (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. సైన్యాధిపతి మనోజ్ ముకుంద్ నరవణే, వాయు సేన అధిపతి రాకేశ్ కుమార్ సింగ్ భదౌరియా, నౌకా దళ అధిపతి కరంబీర్ సింగ్‌తో పాటు పలువురు సీనియర్ అధికారు లతో కలసి ఆయన ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిపిన్ రావత్ మాట్లాడుతూ, అన్ని విభాగాల మధ్య మరింత సమన్వయం అవసరమని చెప్పారు. ఆర్మీ, వాయు సేన, నౌకా దళంలో రాజకీయాల జోక్యంపై ఆయన స్పందిస్తూ, రాజకీయాల నుంచి తాము చాలా దూరంగా ఉంటామని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న వారు చేసే సూచనల మేరకు పని చేస్తామని ఆయన తెలిపారు.

ఎస్ఎజడ్‌గా అమరావతి ?

(సూర్య ప్రత్యేక ప్రతినిధి) : అమరావతిపై ఒక సంచలన ప్రతిపాదన సిద్ధమైంది. దీనిపై ఏపీ సర్కారు కసరత్తు చేస్తోంది. రాజధాని మార్పునకే మొగ్గు చూపుతున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తోంది. అమరావతిని ప్రత్యేక వ్యవసాయ మండలిగా రూపుదిద్దాలని భావిస్తోంది. దీనిపై నియమించిన వ్యవసాయ నిపుణుల కమిటీ ప్రత్యేక వ్యవసాయ మండలిపై సిఫార్సులను సిద్ధం చేసింది. దీని ప్రకారం రాజధాని ప్రాంతంలో ప్రస్తుద ఉన్న భవనాలు రోడ్లను అలాగే ఉంచి, మిగిలిన భూములను ఎస్ఎజడ్ పరిధిలోకి తేవాలనేది ఆ సిఫార్సు. దీని ప్రకారం ఇక్కడ నాణ్యమైన పంటల సాగుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. రైతులు ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చిన భూములనే కాక, ప్రభుత్వ భూములను కూడా ఎస్ఎజడ్ పరిధిలోకి తెస్తారు. విలువైన పంటల హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దాలనేది నిపుణుల సిఫార్సు. చంద్రబాబు ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌లో వీటిని స్వాధీనం చేసుకోవడానికి ముందు ఈ భూములలో రెండు నుంచి మూడు పంటలను పండించే వారు. ఈ ప్రాంతమంతా హరితశోభితంగా అలరారుతూ ఉండేది. 2014లో ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకున్న తరవాత అక్కడ సాగుకు స్వస్తి చెప్పారు. భవంతుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ, సెక్రటేరియేట్, హైకోర్టు భవనాలతో పాటు మంత్రుల నివాస సముదాయాలను కూడా నిర్మించారు. తాజాగా మూడు రాజధానులను ఏర్పాటు చేయాలన్న జగన్ ప్రభుత్వ నిర్ణయం అనంతరం తాజా ప్రతిపాదన రావడం సంచలనమే. 3 రాజధానుల ప్రతిపాదనపై ప్రతిపక్షాలు ముఖ్యంగా చంద్రబాబు భగ్గుమంటున్న క్రమంలో వచ్చిన ఎస్ఎజడ్ సిఫార్సుతో జగన్‌సర్కారు ఒడ్డున పడుతుందా? వేచి చూడాల్సిందే. ఒకప్పుడు వ్యవసాయానికి పెద్ద పీట వేసిన ఈ ప్రాంతంలో వ్యవసాయ జోన్ ఏర్పాటుచేయబూనడాన్ని ప్రతిపక్షాలు, ముఖ్యంగా రైతులు ఏ విధంగా అర్థం చేసుకుంటారో చూడాలి.

చంద్రయాన్-3కి ఓకే

- 2020లో ఇస్రో లక్ష్యాలు 25
- చంద్రయాన్-3 పనులు ప్రారంభమయ్యాయి
- చంద్రయాన్-3కి రూ. 250 కోట్లు ఖర్చవుతుంది
- గగన్ యాన్ కోసం నలుగురు వ్యోమగాములను ఎంపిక చేశాం
- తూత్తుకుడి కోసం రెండో స్పేస్ పోర్టును నెలకొల్పుతున్నాం : ఇస్రో ఛైర్మన్ శివన్



బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2020లో సాధించవలసిన లక్ష్యాల జాబితాలో 25 కార్యక్రమాలు ఉన్నాయి. వాటిలో అత్యంత ప్రధానమైనవి గగన్‌యాన్, చంద్రయాన్-3. చంద్రుని ఉపరితలంపై సురక్షితంగా దిగే విధంగా చంద్రయాన్ కార్యక్రమాలను నూతన సంవత్సరంలో ఇస్రో ప్రారంభిస్తోంది. ఇస్రో ఛైర్మన్ కె శివన్ బుధవారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. చంద్రయాన్ -3కి ల్యాండర్, రోవర్, ప్రొపల్షన్ మాడ్యూల్ ఉంటాయని శివన్ చెప్పారు. చంద్రయాన్-3 మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని ఈ ప్రాజెక్టుపై తమ శాస్త్రవేత్తలు పనులు ప్రారంభించారని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ కె శివన్ మీడియాకు వెల్లడించారు. ఈ మిషన్‌కు దాదాపు రూ. 250 కోట్లు ఖర్చవుతుందని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. గగన్‌యాన్‌కు డిజైన్ వర్క్ పూర్తయిందని తెలిపారు. ఈ ఏడాది కొన్ని రకాల పరీక్షలు నిర్వహించవలసి ఉందని చెప్పారు. తుది నలుగురు వ్యోమగాముల ఎంపిక కూడా పూర్తయిందని, వీరు జనవరి మూడవ వారం నుంచి రష్యాలో శిక్షణ పొందుతారని తెలిపారు. గగన్‌యాన్‌ను ఈ ఏడాది లక్ష్యాల్లో చేర్చినట్లు తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టుల వల్ల ఇతర మిషన్స్‌కు ఆటంకాలు ఏర్పడతాయనే భయాలు అక్కర్లేదని శివన్ చెప్పారు. తాము ఈ ఏడాది 25కు పైగా మిషన్స్‌లో విజయం సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. చంద్రయాన్ -3 ప్రయోగాన్ని 2021లో నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. చంద్రయాన్-3, గగన్‌యాన్ కార్యక్రమాలు ఏక కాలంలో జరుగుతున్నాయని చెప్పారు. గగన్‌యాన్ విషయంలో 2019లో చాలా ప్రగతి సాధించామని శివన్ తెలిపారు. చంద్రయాన్-2 ద్వారా ఇస్రో మంచి ఫలితాలను సాధించిందని తెలిపారు. చంద్రుడిపై దిగడంలో ల్యాండర్ చివరి క్షణంలో విఫలమైనప్పటికీ ఆర్బిటర్ మాత్రం అద్భుతంగా పని చేస్తోందని ఆయన చెప్పారు. మరి ఏడు సంవత్సరాల పాటు అది పని చేస్తుందని, సైంటిఫిక్ డేటాను పంపిస్తుందని ఆయన తెలిపారు. చంద్రుడిని ఢీకొన్న ల్యాండర్‌ను గుర్తించిన భారతీయ వ్యక్తికి శుభాకాంక్షలు చెబుతున్నానని శివన్ అన్నారు. కొన్ని వ్యూహాత్మక కారణాల నేపథ్యంలో, ఈ అంశంపై ఎక్కువగా మాట్లాడలేనని ఆయన చెప్పారు. చంద్రయాన్-2 సందర్భంగా ల్యాండర్ విఫలం కావడంతో తాను మానసికంగా చాలా కదిలిపోయానని, ప్రధాని మోదీ తనను హత్తుకోవడం ఊరట కలిగించిందని ఆయన తెలిపారు. గగన్ యాన్ మిషన్ విషయంలో కూడా మంచి పురోగతి ఉందని శివన్ చెప్పారు. ఈ మిషన్ కోసం నలుగురు వ్యోమగాముల ఎంపిక పూర్తయిందని, ఈ నెల మూడవ వారం నుంచి వారికి ట్రైనింగ్ మొదలవుతుందని ఆయన తెలిపారు. ఆ నలుగురు వ్యోమగాములు పురుషులని, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందినవారని ఆయన వెల్లడించారు. వారికి రష్యాలో శిక్షణ ఉంటుందని ఆయన చెప్పారు. తమిళనాడులోని తూత్తుకుడిలో రెండో స్పేస్ పోర్టును నెలకొల్పబోతున్నామని, దీనికి సంబంధించి భూ సేకరణ కార్యక్రమం కొనసాగుతోందని శివన్ తెలిపారు. ఇది ఇలా ఉండగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం మాట్లాడుతూ, చంద్రయాన్-3 ప్రయోగం 2020లో జరుగుతుందని చెప్పిన సంగతి తెలిసిందే.


జగన్‌కు టీటీడీ ఆశీర్వచనాలు

సీఎం జగన్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి టీటీడీ అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. తాడేపల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రికి వేదపండితులు ఆశీర్వచనాలు ఇచ్చి శ్రీవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దేవాదాయా శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని పలువురు ప్రజా ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, డీజీపీ గౌతమ్ సవాంగ్ కూడా సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు తాడేపల్లిలోని సీఎం నివాసానికి వచ్చి జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ముక్కోణ ఆకారంలో పార్లమెంటు




అందులో ఉంచుతారు.

మ్యూజియాలుగా నార్త్-సౌత్ బ్లాక్లు

నార్త్ బ్లాక్ (ప్రస్తుతం ఆర్థిక, హోంశాఖలున్నాయి), సౌత్ బ్లాక్ (ప్రస్తుతం పీఎంవో, రక్షణ, విదేశీ వ్యవహారాల శాఖలున్నాయి)లను 2 మ్యూజియాలుగా మార్చుతారు. 1857కు ముందు భారత్ను ఒకదానిలో, ఆ తర్వాతి భారత్ను మరోదానిలో ఆవిష్కరిస్తారు. రైల్ భవన్, శాస్త్రి భవన్, వాయు భవన్ సహా పలు భవనాలను కూల్చివేస్తారు. వాటి స్థానంలో రాజ్పథ్ వెంబడి 2024 కల్లా 8 అంతస్థులతో కూడిన 10 నూతన భవనాలను నిర్మిస్తారు. వాటి ఎత్తు ఇండియా గేట్ కంటే తక్కువగా ఉంటుంది. కొత్తగా నిర్మించే కేంద్ర ఉమ్మడి సచివాలయం దాదాపు లక్ష మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించేందుకు వీలుగా ఉంటుంది.

సీఎం ఆస్తుల్లో వృద్ధి రెండు ఆవులు, దూడ

- 2018లో ఎనిమిది ఆవులు, ఆరు ఆవు దూడలు
- 2019లో ఆవులు సంఖ్య పది, దూడల సంఖ్య ఏడు



పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన వార్షిక ఆస్తుల వెల్లడిలో గత ఏడాది (2018)తో పోలిస్తే కేవలం రెండు ఆవులు పెరిగాయని ప్రకటించారు. నితీశ్‌తో పాటు అతని మంత్రివర్గ సహచరులు తమ ఆస్తుల వివరాలను మంగళవారం వెల్లడించారు. 2010 నుంచి నితీశ్ తన మంత్రివర్గ సహచరులు ఏటా తమ ఆస్తుల వివరాలు ప్రకటించాలని నిబంధన విధించారు. ఈ మేరకు ప్రతి ఏడాది జనవరి మొదటి వారం లేదా ఏడాది చివరి రోజు నితీశ్, ఆయన సహచరులు తమ ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్నారు. గత ఏడాది తన ఆస్తుల్లో ఒక పశువుల పాక, ఎనిమిది ఆవులు, ఆరు ఆవు దూడలు ఉన్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది (2019) వాటి సంఖ్యను పది ఆవులు, ఏడు ఆవు దూడలుగా చూపించారు. 2018లో తన వద్ద రూ. 42 వేల నగదు ఉన్నట్లు చూపిన నితీశ్ ప్రస్తుతం తన వద్ద ఉన్న నగదును రూ. 38039గా చూపెట్టారు. వీటితో పాటు రూ. 16 లక్షలు విలువ చేసే చరాస్తులు, ఢిల్లీలో ఫ్లాట్‌తో కలుపుకుని రూ. 40 లక్షలు విలువ చేసే స్థిరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. నితీశ్ కుమారుడు తండ్రి కంటే ఎక్కువగా రూ. 1.39 కోట్లు విలువ చేసే చరాస్తులు, రూ. 1.48 కోట్ల స్థిరాస్తులు కలిగి ఉండడం గమనార్హం. ఈ ఆస్తులు తన తల్లి నుంచి వారసత్వంగా సంక్రమించినట్లు ప్రకటించారు. కాగా, నితీశ్ మంత్రివర్గ సహచరుల్లో చాలా మంది ఆయన కన్నా ఎక్కువ ఆస్తులు కలిగి ఉండడం విశేషం. ఇక ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోడీ తన ఆస్తుల విలువ రూ. 1.26 కోట్లుగా ప్రకటించారు. తన భార్య ఆస్తులు రూ. 1.65 కోట్లుగా ఆయన ప్రకటించారు. అలాగే తన వద్ద రూ. 81.54 లక్షల నగదు, ప్రొఫెసర్ అయిన తన భార్య వద్ద రూ. 97.18 లక్షల నగదు ఉన్నట్లు ఆయన తెలిపారు. మరో మంత్రి సురేష్ శర్మ తన ఆస్తుల విలువ రూ. 9 కోట్లుగా ప్రకటించారు. నితీశ్ కేబినెట్‌లో అందరి కంటే తక్కువ ఆస్తులు ఉన్న మంత్రిగా నీరజ్ కుమార్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ. 35.87 లక్షలు కాగా, నగదు రూ. 27 లక్షలుగా ప్రకటించారు. గత ఏడాది కొత్తగా కేబినెట్‌లో చేరిన మంత్రి సంజయ్ ఝా తన ఆస్తుల విలువ రూ. 22 కోట్లుగా ప్రకటించారు. ఇవన్నీ తన భార్య పేరు మీద, తన పేరు మీద సమష్టిగా ఉన్నట్లు ఆయన తెలిపారు.



పవన్ స్క్రిప్ట్ చదివి వెళ్లిపోతాడు

వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు

తాడేపల్లి, మేజర్ న్యూస్: పవన్ కళ్యాణ్ ఎప్పుడు ఎలా ఉంటాడో ఎవరికి అర్థం కాదని, ఆయన వైఖరి నచ్చకే ప్రజలు రెండు చోట్లా ఓడించారని వైసీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు గుర్తు చేశారు. జనసేన పార్టీ కార్యాలయానికి భూమి ఇచ్చిన లింగమనేని భూములకు రేట్లు పడిపోతాయనే పవన్ ఉద్యమాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అవినీతి పరుడు, దొంగ అని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శిస్తుంటే ఏపీ బీజేపీ నాయకులు మాత్రం చంద్రబాబుకు అనుకూలంగా ధర్నాలు చేస్తున్నారని చురకలంటించారు. చంద్రబాబు రాజకీయాలకు పెయిడ్ ఆర్టిస్ట్ పవన్ కళ్యాణ్ తోడయ్యాడరని విమర్శించారు. బాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదివి పవన్ హైదరాబాద్ తిరిగి వెళ్ళిపోతాడని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాయలంలో బుధవారం సుధాకర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం రూ.26 వేల కోట్ల రెవిన్యూ లోటులో ఉన్న మాట వాస్తవం కాదా. కొత్తగా రెండున్నర లక్షల కోట్లు అప్పు చంద్రబాబు తేలేదా.. లక్షల కోట్ల అప్పు తెచ్చి రాజధాని నిర్మాణానికి ఐదు వేల కోట్లు ఖర్చు చేయడం వాస్తవం కాదా. చంద్రబాబు మాయ మాటలు నమ్మి రైతులు మోసపోలేదా... పదేళ్ల ఉమ్మడి రాజధాని నుంచి పారిపోయి అమరావతికి రాలేదాని ప్రశ్నించారు. సంక్షేమం అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమపాళ్లలో అందిస్తున్నారు. అమరావతిలో ఎందుకు చంద్రబాబు సొంత ఇల్లు నిర్మించుకోలేదు.

అమరావతికి వైఎస్ జగన్ వ్యతిరేకం కాకపోయినా ఇల్లు, పార్టీ కార్యాలయం నిర్మించుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది. జనవరి 9వ తేదీ నుంచి అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ప్రతి తల్లికి రూ.15 వేలు అందిస్తాం.

పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించాలనుకుంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అడ్డుకున్నారుఅని పేర్కొన్నారు.

ఆస్తులు అమ్మి అయినా ...

అమరావతి కోసం పోరాడతాం

- న్యూ ఇయర్ వేడుకలకు టిడిపి దూరం
- సేవ్ అమరావతి నినాదం
- మూడు రాజధానులు వద్దు అమరావతి ముద్దు
- నిరసన దీక్షకు భారీగా తరలివచ్చిన టిడిపి కార్యకర్తలు
- అమరావతి పరిరక్షణ సమితికి విరాళాలు సేకరణ
- నిరశన దీక్షలో పోస్టుకార్డుల ఉద్యమం
- కిక్కిరిసిపోయిన ప్రాంగణం



పామూరు, మేజర్ న్యూస్ : తెలంగాణలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు కోసం ఎలా పోరాటాలు కొనసాగించి తెలంగాణ ప్రభుత్వం సాధించుకున్నారో అదే విధంగా మూడు రాజధానులు వద్దు అమరావతి ముద్దు అనే నినాదంతో తన ఆస్తులు అమ్మి అయినా అమరావతి సాధించేందుకు పోరాటాలను సాగిస్తానని మాజీ ఎమ్మెల్యే కనిగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నూతన వేడుకలకు దూరంగా ఉండి అమరావతి ముద్దు అనే నినాదంతో నిరసన కార్యక్రమాలు కొనసాగించాలని ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం పామూరు రోడ్డులో నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన నిరసన దీక్ష సాయత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఈ దీక్షకు నియోజకవర్గంలోని కనిగిరి మండలం తో పాటు పామూరు, సిఎస్ పురం, పీసీపల్లి, వెలిగండ్ల, హనుమంతునిపాడు, మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవ్ అమరావతి అంటూ ఉగ్రనరసింహారెడ్డి కి చెయ్యి అందజేసి అమరావతి పరిరక్షణ సమితి విరాళాలు తోచిన సహాయం బాక్స్ లో వేశారు . సుదూర గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేశారు. మా రాజధాని అమరావతి, మాది ప్రకాశం జిల్లా కనిగిరి, మాకు 3 రాజధానులు గురించి చెప్పవద్దు, అమరావతి ముద్దు, నిమ్జ్ నిర్మాణం ఏమైంది, ట్రిబుల్ ఐటీ కనిగిరి లో ఉందా లేదా, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేదెప్పుడు, ఇంటింటికీ కొళాయి పథకం ఏమైంది, అనే ఫ్లెక్సీలతో నిరసన దీక్ష ప్రాంగణం చుట్టూ నిండిపోయింది. ఫ్లెక్సీలపై ఉన్న పదాలను చదివేందుకు కార్య కర్తలు ఆసక్తి కనబరిచారు. అమరావతిహా కొరకు తలపెట్టిన నిరసన దీక్షకు సంఘీభావం చెప్పేందుకు గ్రామాల నుంచి వాహనాలు భారీగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొని దీక్ష కార్యక్రమంలో ఉగ్రనరసింహారెడ్డి కి సంఘీభావం తెలిపారు. అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వచ్చిన విరాళాలను అమరావతిహా దీక్ష చేస్తున్న రైతులకు ఉపయోగపడడం జరుగుతుందన్నారు.దీక్ష శిబిరం ప్రాంగణంలోనే కేంద్ర ప్రభుత్వానికి మూడు రాజధానులు వద్దు అమరావతి ముద్దు అనే నినాదంతో పోస్ట్ కార్డులను మొదలుపెట్టారు. నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండడం జరుగుతుందని నిరసన దీక్ష కార్యక్రమానికి వచ్చే కార్యకర్తలు దండలు, పుష్పాలు, పండ్లు తీసుకురావద్దని వాటికి దూరం అని వాడికి ఖర్చుపెట్టే ధనాన్ని అమరావతి పరిరక్షణ కొరకు విరాళాలు ఇవ్వాలని పిలుపునివ్వడంతో అక్కడకు చేరుకున్న కార్యకర్తలు విరాళాల కోసం ఏర్పాటు చేసిన బాక్సో వారికి తోచినంత సహాయం బాక్సులో వేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్‌హా ముక్కు ఉగ్ర నర్సింహారెడ్డి మాట్లాడుతూ మూడు పంటలు పండే పొలాలను రాజధాని అమరావతి కోసం రైతుల త్యాగం చేసి భూములు స్వచ్ఛందంగా ఇస్తే అట్టివారు పెయిడ్గ ఆర్టిస్టులు, నారా చంద్రబాబునాయుడు మనుషూలు అని ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. వ్యాపార లాభం కోసం అమరావతిని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 150 సీట్లు వచ్చాయని భ్రమ లోనే ఉండి రాజధాని మార్చే ప్రయత్నంలో ఉన్నారన్నారు. అమరావతిని చీల్చితే ప్రభుత్వ పతనం ఖాయం అన్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఇటువంటి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారుప్రభుత్వాన్ని నడపలేక నే ఇటువంటి పన్నాగాలకు పాల్పడుతున్నారన్నారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతి గా ఉండే వరకు తాను నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాబోయే రోజుల్లో అమరావతిహా కోసం పోరాటాలు ను ఉద్యమంహా చేయడం జరుగుతుందన్నారు. టిడిపి నిరసన దీక్ష కార్యక్రమంలోహా లీడ క్యాప్ మాజీ చైర్మన్ గూడూరి ఎరిక్షన్ బాబు, టిడిపి నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి , ఎస్ కె చిన్న మస్తాన్,మెడబలిమి వెంకట్రావు, ఆవుల నాగేశ్వరరావు, నంబుల వెంకటేశ్వర్లు, పువ్వాడి రాంబాబు, మోరుబోయిన గంగరాజు యాదవ్, బైరెడ్డి జయరామిరెడ్డి, గుంటుపల్లి శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, మార్నేని రామక ష్ణ,మన్నే నరసింహులు,బద్దిపూడి మార్క్, గద్దె గంగయ్య చౌదరి, షేక్ ఖాజా రహంతుల్లా, తుమ్మ ఆంజనేయులు, పాలపర్తి వెంకటేశ్వర్లు, గుత్తి రాజా, పులి నాయబా, చెన్నకేశవులు, సుభాషిని, లూనాజబిన్, నియోజకవర్గంలోని పలు గ్రామాల టిడిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజధానిని మార్చేస్తామంటే కుదరదు

- అమరావతే ఉండాలి
- అదే బీజేపీ సుస్పష్ట వైఖరి
- కలెక్టర్లందరికీ అధికారిక లేఖలు
- నాడు అసెంబ్లీలో జగన్ సరేనన్నారు
- ఆనాడు అమరావతికి ఆమోదం తెలిపాం
- అధికారంలోకి వచ్చాక మాట తప్పారు
- కేంద్రం నిధులిచ్చింది... రాష్ట్రమూ పెట్టింది
- ఇప్పుడు వేరే ప్రభుత్వం వచ్చి మార్చేస్తామంటే కుదరదు
- మా పార్టీలో రాష్ట్ర స్థాయిలో నేను మాట్లాడేదే ఫైనల్
- రాజధానిపై కన్నా లక్ష్మీనారాయణ



అమరావతి, సూర్య ప్రతినిధి : రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగించాలని బీజేపీ స్పష్టం చేసింది. తమ పార్టీ విధానం అమరావతేనంటూ జనవరి 2న అన్ని జిల్లాల కలెక్టర్లకు అధికారికంగా లేఖలు ఇవ్వబోతున్నా మని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకున్నా ప్రతిపక్షాల తో చర్చించే నిర్ణయిస్తాయని, గత ప్రభుత్వం 2015లో అసెంబ్లీలో తీర్మానం చేసినప్పుడు సభలో ఉన్న మూడు పార్టీలు సమర్థించాయని, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ సైతం అమరావతి రాజధానికి సమ్మతి తెలిపిందని గుర్తుచే శారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడంలో ప్రతిపక్షాలను అడగక పోయినా పర్లేదని, రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించిన నిర్ణయాల్లో అలా కుదరదన్నారు. బీజేపీలో ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతున్నారన్న వార్తలపై ఆయన స్పందిస్తూ అన్ని పార్టీల్లోనూ ఇలాంటి పరిస్థితి ఉంది. కానీ మా పార్టీలో అధ్యక్షుడిగా నేను మాట్లేడేదే ఫైనల్ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మూడు రాజధాను లంటూ ఇటీవల అసెంబ్లీలో జగన్ చేసిన వ్యాఖ్యలు, అనం తరం అమరావతి రైతుల ఆందోళన, రాష్ట్ర ప్రజల్లో అను మానాలు మొత్తమ్మీద నెలకొన్న గందరగోళంపై ఆయన మాట్లాడారు.

నాడు వైసీపీ జైకొట్టింది : రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు రాజధానిగా అమరావతిని వ్యతిరేకించలేదు. అసెంబ్లీలో తీర్మానం చేసినప్పుడు సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ అమరావతికే జై కొట్టింది. అదే సభలో ఉన్న బీజేపీ కూడా మద్దతిచ్చింది. తర్వాత ప్రధాని మోదీ స్వయంగా వచ్చి భూమి పూజ చేశారు. ఇవన్నీ మర్చిపోయి ప్రభుత్వాలు మారగానే రాజధాని మార్చేస్తామంటే ఎలా సాధ్యమవుతుంది? నియంతృత్వ ధోరణితో ఏక పక్ష నిర్ణయాలు తీసుకునే అధికారం ముఖ్యమంత్రికి లేదు.

స్టేక్ హోల్డర్లను కాదని ఎలా చేస్తారు.? : విభజిత రాష్ట్రానికి రాజధాని నిర్మించేందుకు నాటి ప్రభుత్వం అమరావతి ప్రాంతాన్ని ఎంపిక చేస్తే రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూములిచ్చారు. సీఆర్‌డీఏ అధికారికంగా ఒప్పందం చేసుకుని వారికి హామీ పత్రాలిచ్చింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రూ.2,500 కోట్లు ఇచ్చింది. ప్రజల నుంచి బాండ్ల పేరుతో రాష్ట్ర ప్రభు త్వం రూ.2వేల కోట్లు వసూలు చేసింది. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.9వేల కోట్లు ఖర్చుపెట్టారు. ఆ మొత్తం ప్రజలు చెల్లించిన పన్నుల నుంచి వచ్చిందే కదా. వీళ్లందరూ ఈ రోజు స్టేక్ హోల్డర్లుగా ఉన్నారు.

ఏ ఒక్కరి అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా ఎలా మార్చేస్తారు?

మీ మేనిఫెస్టోలో పెట్టారా..? : అధికారంలోకొస్తే రాజధాని మారుస్తామని కనీసం వైసీపీ మేనిఫెస్టోలో పెట్టారా? ఒకవేళ పెట్టి ఉంటే ప్రజలు తీర్పు ఇచ్చారని సీఎం చెప్పవచ్చు. రాజధాని విషయంలో విలేకరులు ఎన్నికల ముందు ఎక్కడ అడిగినా అమరావతిలో నేను ఇల్లు కట్టుకున్నాను. చంద్రబాబుకు సొంతిల్లు లేదు. ఆయన నిర్మించుకోలేదని అన్నావ్. ఇలాంటి మాటలతో ప్రజల్ని నమ్మించి, రాజధానివాసుల ఓట్లతో ఎమ్మెల్యేలను గెలిపించుకుని ఇప్పుడు వంచిస్తామంటే ఒప్పుకోం.

జీవీఎల్ మాటల్లో తప్పులేదు : రాష్ట్ర రాజధాని విషయంలో కేంద్రం జోక్యం చేసుకోదని మా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు విలేకరులతో అన్నారు. రాష్ట్ర నిర్ణయాల్లో కేంద్రం ఎందుకు కలగజేసుకుంటుందని ఆయన అన్నారు. ఇందులో తప్పేముంది? రాష్ట్రాలకు కొన్ని హక్కులుంటాయి. వాటిని కేంద్రం ఎందుకు హరిస్తుంది? అయితే రాష్ట్రానికి హక్కులున్నట్లే స్టేక్ హోల్డర్లకు కూడా ఉంటాయి.. వాళ్లను కాదని రాజధాని మార్చేందుకు రాష్ట్రప్రభుత్వానికి హక్కు లేదు. రాజకీయ పార్టీల్లో ప్రాంతీయ సమస్యలుంటాయి. మాది జాతీయ పార్టీ. కేంద్ర నాయకత్వానికి తెలియజేశాం. రాష్ట్ర పార్టీ తీర్మానం చేసి అమరావతే మా నిర్ణయమంటూ జనవరి 2న అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర అధ్యక్షుడి లేఖతో తీర్మానాన్ని కూడా ఇస్తాం. రాష్ట్రంలో విశాఖపట్నం టీడీపీ ఎమ్మెల్యే, గుంటూరు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే పార్టీ నిర్ణయానికి భిన్నంగా గళం వినిపించారు. మేం అలాంటి వాటికి ఆస్కారం ఇవ్వకుండా కలెక్టర్లకు లేఖలు ఇవ్వబోతున్నాం.

జగన్ మాట తప్పారు.. బీజేపీ తప్పదు : రాష్ట్ర రాజధాని విషయంలో అసెంబ్లీలో గత ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని సమర్థించిన జగన్ ఇప్పుడు మాట తప్పారు. అప్పుడు బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ఆమోదం తెలిపారు. ప్రధాని మోదీ స్వయంగా అమరావతికి వచ్చి భూమి పూజ చేసి నిర్మాణానికి నిధులిచ్చారు. ఇప్పుడు జగన్ మాట తప్పారని మేం తప్పం.. అమరావతే రాష్ట్ర రాజధాని అనే విషయంలో ఎటువంటి అనుమానమూ వద్దు. రాజధాని అనేది రాష్ట్రానికి తప్ప ఒక వర్గానికో, 29 గ్రామాలకో సంబంధించినది కాదు.

రాష్ట్రంలో 13 జిల్లాలూ ప్రగతి పథంలో పయనించాలన్నది బీజేపీ ఆలోచన, నినాదం కూడా. అయితే అమరావతి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ముందు రైతుల త్యాగం, బాండ్ల ద్వారా నిధుల సేకరణ, కేంద్రం ఇచ్చిన రెండున్నర వేల కోట్లు. ప్రజల పన్నుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు, ఇవన్నీ గమనించిన తర్వాతే బీజేపీ అమరావతి గురించి మాట్లాడుతోంది.


ఇదే పరిస్థితి కొనసాగితే ప్రతిపక్ష హోదా కూడా దక్కదు : మంత్రి కృష్ణదాస్



శ్రీకాకుళం, సూర్య ప్రతినిధి : 151 స్థానాల్లో వైసీపీ గెలిచిందంటే చంద్రబాబు అర్థం చేసుకోవాలని మంత్రి కృష్ణదాస్ అన్నారు. చంద్రబాబు తప్పిదాల వల్లే ప్రతిపక్షంలో కూర్చున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. 23 మంది టీడీపీ ఎమ్మెల్యేల్లో ఇద్దరు బయటకు వెళ్లారని, మరో ఇద్దరు వెళ్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా పోతుందని కృష్ణదాస్ వ్యాఖ్యానించారు.

నటన చూసి బాగా ఎంజాయ్ చేశాను

పవన్ కళ్యాణ్‌పై విజయసాయి రెడ్డి విమర్శ



విజయవాడ, మేజర్ న్యూస్:జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అమరావతి రైతులను పరామర్శించడానికి రాజధానిలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్పందించిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయనను టీడీపీ పెయిడ్ ఆర్టిస్ట్ అని పేర్కొంటూ రెమ్యునరేషన్ పెంచుకోవాలని చురకలంటించారు. 'పవన్ కళ్యాణ్ నటనా నైపుణ్యాలను చూసి నేను బాగా ఎంజాయ్ చేశాను. అమరావతి రైతుల ముందు ఈ పెయిడ్ ఆర్టిస్ట్ ప్రదర్శన తీరు చూశాక, టీడీపీ నాయకత్వం నుంచి ఆయన రెమ్యునరేషన్ ను మరింత పెంచుకునేందుకు అర్హుడని నేను భావించాను' అని విజయసాయి రెడ్డి ఎద్దేవా చేస్తూ ట్వీట్ చేశారు.

చంద్రబాబుకు ఎందుకు అంత తొందర ?



శ్రీకాకుళం, సూర్య ప్రతినిధి : అమరాతి లో జరిగిన ఇన్‌సైడ్ ట్రేడింగ్‌పై త్వరలోనే చర్యలు తీసుకుంటామని స్పీకర్ తమ్మినేని సీతారం అన్నారు. చంద్రబాబుకు ఎందు కంత దొందర అని వ్యాఖ్యానించారు. బుధ వారం ఇక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. అదొక ప్రతిపక్షం.. అతడొక నాయకుడు అంటూ టీడీపీని, చంద్రబాబును ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వాన్‌పిక్ భూములపై ఆరోపణలు చేస్తున్న చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా చంద్రబాబు సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా? చెప్పాలని సీతారం డిమాండ్ చేశారు. మూడు రాజధానులు ఏర్పడి అభివృద్ధి చెందుతుంటే అప్పుడు మీకు విలువ తెలుస్తుందని టీడీపీ నాయకులనుద్దేశించి స్పీకర్ వ్యాఖ్యానించారు.


జగన్మోహన్ రెడ్డికి మంత్రి వెలంపల్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు



విజయవాడ, సూర్య ప్రతినిధి : తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులు చైర్మన్ వై వి సుబ్బా రెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు. ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి. దేవాదాయ శాఖ 2020 క్యాలెండర్ ను, శ్రీ దుర్గా వారి ప్రసాదమును ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ కు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు,దుర్గ గుడి ఈవో తదితరులు.

ఫోటో జర్నలిస్టు అహోబలరావు మృతి

ఐజేయూ, కృష్ణా అర్బన్ సంతాపం



విజయవాడ, సూర్య ప్రతినిధి : ప్రముఖ ఫోటో జర్నలిస్టు అహోబలరావు (92) బుధ వారం సాయంత్రం మృతి చెందారు. ఆయ న తీసిన ఫోటోలు చరిత్రలోనే చెప్పుకోద గినవి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు అందుకున్నారు. 75 ఏళ్ల పాటు ఫోటో జర్నలిస్టుగా కొనసాగడం ఎంతో గర్వకారణం. ఈ రోజు సాయంత్రం వరకు కూడా స్నేహితులకు నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారని అనంతరం అక స్మాత్తుగా మృతి చెందడం ఎంతో బాధాకరం. ఆయన మృతిపట్ల ఐజే యూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణా అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మ రాజు చలపతిరావు, ఆర్ వసంత్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, సీ హెచ్ రమణారెడ్డి, విజయవాడ అధ్యక్షుడు సుబ్బారావు, సీనియర్ నాయకులు షేక్ బాబు, దారం వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, డేవిడ్, కోటిరెడ్డి తదితరులు సంతా పాన్ని తెలియజేసిన వారిలో ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియపరిచారు.

సీఎం జగన్‌కి ఆజన్మాంతం రుణపడి ఉంటాం

- ఆర్టీసీ కార్మికులు
- డిపోల వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకాలు



విజయవాడ, సూర్య ప్రతినిధి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏపీఆర్టీసీ సిబ్బం దిని ప్రభుత్వంలో విలీనం చేసింది. నూతన సంవత్సరం మొదటి రోజు (జనవరి 1) నుంచి ఇది అమల్లోకి వచ్చేలా మంగళవారం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే దీనిపై బుధవారం విజయవాడలో ఆర్టీసీ కార్మికులు డిపోల వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. కార్మికులంగా హర్షం వ్యక్తం చేశారు. కేట్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తమ చిరకాల స్వప్నం నెరవేర్చిన సీఎం జగన్‌కి కార్మికులు జేజేలు పలికారు. దశాబ్దాల కల సాకారం చేసి కార్మికుల బతుకులకు భరోసా కల్పించిన సీఎం జగన్ కలకాలం వర్ధిల్లాలని కార్మికులు నినాదాలు చేశారు. వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌కి ఆజన్మాంతం రుణపడి ఉంటామని ఆర్టీసీ కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. జనవరి ఒకటో తేదీని కార్మికులు ఆర్టీసీ పండుగగా అభివర్ణించించారు. ఈ సంబరాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు దేవినేని అవినాష్, బొప్పనభవకుమార్ పాల్గొని ఆర్టీసీ కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాటమీద నిలబడ్డ మడమతిప్పని నేత సీఎం వైఎస్ జగన్ అని ప్రశంసించారు. వైఎస్ జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నుంచే ఆంధ్రప్రదేశ్‌లో స్వర్ణయుగం మొదలైందని అవినాష్ తెలిపారు. బొప్పన భవకుమార్ మాట్లాడుతూ ఏడాది గడవక ముందే ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ సొంతమని కొనియాడారు.

సీఎం, మంత్రులకు జ్ఞానోదయం కలగాలని కోరుకొన్నా

- రాజధానిగా అమరావతేనని ప్రజలు సంకల్పం చేయాలి
- నారా చంద్రబాబు నాయుడు
- సతీసమేతంగా దుర్గమ్మను దర్శించుకొన్న టీడీపీ అధినేత




(ఏపీ-పొలిటికల్ బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రులకు జ్ఞానోదయం చేయాలని దుర్గమ్మను కోరుకొన్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దంపతులు దర్శించుకున్నారు. చంద్రబాబు వెంట ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే రామానాయుడు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఉన్నారు. చంద్రబాబుకు దుర్గగుడి అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి సతీ సమేతంగా చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ అమరావతిని పరిరక్షించాలి, భావితరాల భవిష్యత్తు బాగుండాలి, రాష్ట్రాన్ని కాపాడాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. అమరావతి పరిరక్షణ ఐకాసకు విరాళాలు వస్తున్నాయి. కనిగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రావు రూ.50వేలు, ఎన్ ఆర్ఐ బుచ్చిబాబు రూ.50వేలు ఉద్యమం కోసం ఐకాసకు విరాళంగా ఇచ్చారు. 25 ఏళ్ల క్రితం హైదరాబాద్ లో విజన్ 2020 ఇచ్చాను, మంచి ఫలితాలు వచ్చాయి. ఈరోజు హైదరాబాద్ అనుభవించే పరిస్థితి వచ్చింది. అమరావతిని ఇక్కడే కొనసాగించేలా అందరూ దేవుళ్లు ఈ ముఖ్యమంత్రి, మంత్రులకు మంచి బుద్ధి ప్రసాదించాలి. ఐదుకోట్ల మంది ఆంధ్రులతో పాటు, భావితరాల భవిష్యత్తుకు సంబంధించిన అంశమిది. అమరావతిని ఇక్కడే కొనసాగించాలని రాష్ట్ర ప్రజలంతా సంకల్పం చేయాలి అని చంద్రబాబు కోరారు. రాష్ట్రానికి ఒకటే ఇల్లు ఉండాలన్నారు. ఐదుకోట్ల ప్రజలు ఆవేశంగా ఉన్నారని, వారి భవిష్యత్‌ను ఆలోచించాలని చంద్రబాబు సూచించారు. అప్పట్లో విజన్ 2020 అంటే చాలా మంది ఎగతాళి చేశారని, ఎగతాళి చేసినోళ్లు ఇవాళ తెలంగాణ డెవలెప్‌ని చూడాలని తెలిపారు. సీఎంకు, మంత్రి మండలికి జ్ఞానోదయం చేయాలని కోరుకున్నానని తెలిపారు. రాజధానిగా అమరావతి ఉండాలని. అన్ని జిల్లాలు డెవలెప్ అవ్వాలని ప్రతి ఒక్కరు సంకల్పం చేసుకోవాలని చంద్రబాబు తెలిపారు.

అందరూ సంతోషంగా ఉన్నప్పుడే వేడుక

అందరూ సంతోషంగా ఉన్నప్పుడే ఏ వేడుకైనా శోభాయమానంగా ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ట్విటర్ లో పేర్కొన్నారు. అమరావతి రైతులు సంతోషంగా లేరన్న ఆయన వారికి సంఘీభావంగా 2020 నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండాలని టీడీపీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చామని తెలిపారు. వేడుకలయ్యే ఖర్చులను రైతుల కోసం పోరాడే అమరావతి పరిరక్షణ సమితి జేఏసీలకు విరాళంగా ఇవ్వాలని సూచించారు. రాజధాని అమరావతి పరిరక్షణలో అందరి సంకల్పం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజల ధన, మాన, ప్రాణాలకు భద్రత ఉండాలని, వారి సమస్యలు పరిష్కారం కావాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

త్యాగమూర్తులు పెయిడ్ ఆర్టిస్ట్‌లా?




విజయవాడ, మేజర్ న్యూస్: రాజధానికి భూములు ఇచ్చిన రైతులను మంత్రులు హేళన చేస్తున్నారని ఎంపీ కేశినేని నాని మండిపడ్డారు. రైతుల దీక్ష వద్ద ఏర్పటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ త్యాగమూర్తులు ఇప్పుడు పెయిడ్ ఆర్టిస్ట్‌లు అయ్యారా? అని మండిపడ్డారు. నూతన సంవత్సరం రోజు రైతులను ఏడిపించడానికి జగన్ ముఠాకు సిగ్గుండాలని దుయ్యబట్టారు. అమరావతి నుంచి రాజధానిని తరలించడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. రాజధాని తరలింపుపై న్యాయ పోరాటం చేస్తామని కేశినేని నాని తెలిపారు. పరిపాలన్ చేత కాకపోతే ఒక్క ఛాన్స్ అని ఎందుకు అడిగావని ప్రశ్నించారు. విశాఖ ప్రజలు అమాయకులని..వారిని దోచుకుందామని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పులివెందుల ముఠాలను దింపి ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారని ఎంపీ కేశినేని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.

జగన్‌కు మానసిక వ్యాధి : ఉమ

ముగిసిన దేవినేని ఉమ ఒక రోజు దీక్ష


విజయవాడ, మేజర్ న్యూస్: టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ ఒకరోజు దీక్ష ముగిసింది. అమరావతి పరిరక్షణ సమితి సభ్యులు దేవినేని ఉమ దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు హాజరయ్యారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మూడు రాజధానుల ప్రకటన చేశారని అమరావతి పరిరక్షణ సమితి నేతలు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందన్నారు. మళ్లీ రాష్ట్రాన్ని అథోగతి పాలు చేయొద్దన్నారు. రాజధానిని విశాఖ వాసులు కోరుకోవడం లేదని అమరావతి పరిరక్షణ సమితి నేతలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ సీఎం జగన్ మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని టీడీపీ నేత దేవినేని ఉమ ఎద్దేవాచేశారు. ఉద్యమాల ద్వారానే జగన్ పిచ్చి తగ్గుతుందన్నారు. జగన్ అధికారం చేపట్టాక ప్రజలు పండగల్ని మర్చిపోయారని, ఇసుక కొరత ద్వారా లక్షల మంది కడుపుకొట్టారని దుయ్యబట్టారు. ప్రజాభిప్రాయం స్వీకరించకుండా కమిటీలు రిపోర్ట్‌లు ఎలా ఇస్తాయని ఆయన ప్రశ్నించారు. జీఎన్‌రావు ఆఫీసర్‌గా ఉన్నప్పుడే రెండుసార్లు సస్పెండ్ అయ్యారని, అలాంటి వారు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తే ప్రజలు ఏమైపోతారని నిలదీశారు. విశాఖలో ఎంపీ విజయసాయిరెడ్డి ఎక్కువ భూములు కొన్నారని ఆరోపించారు. రైతులు న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొంటారు.. మంచి లాయర్లను జగన్ కొనేస్తున్నదని విమర్శించారు. రైతుల ఉసురు పోసుకుంటే అడ్రస్ లేకుండా పోతారని ఉమ హెచ్చరించారు. రాజధానిలో రైతుల భూములు చదును చేసిస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు మండిపడ్డారు.

ఏపీ సీఆర్డీఏ చట్టంలోని అంశాలను మంత్రులు ఒకసారి చదువుకోవాలని, రైతుల చేతుల్లో నుంచి సీఆర్డీఏ చేతుల్లోకి భూములు వెళ్లిపోయాయని అన్నారు. సీఆర్డీఏ చట్ట ప్రకారం అభివృద్ధి చేసి మూడేళ్లలో రైతులకు ప్లాట్లు సర్కార్ అప్పగించాలని, కమిటీ రిపోర్టులు కేవలం నాన్చుడు కోసమే అని వ్యాఖ్యానించారు. రాజధానిని అమరావతిలోనే కొనసాగించే వరకు పోరాటం కొనసాగుతుందని దేవినేని ఉమ స్పష్టం చేశారు.



అందరూ కలసి పోరాడాలి

- కొత్త ఏడాది రోజు దీక్షలు
- ఆరోజు ముద్దులు పెట్టారు... నేడు గుద్దులు గుద్దుతున్నారు
- నాతోనే మైండ్‌గేమ్
- హైదరాబాద్‌కు దీటుగా మరో నగరం ఉండాలనే అమరావతి నిర్మాణానికి శ్రీకారం
- అమరావతి రైతులకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు సంఘీభావం
- ఎర్రబాలెంలో రైతుల దీక్షలో పాల్గొని మద్దతు
- చేతి గాజులు విరాళంగా ఇచ్చిన భువనేశ్వరి
- భువనేశ్వరి సూచన మేరకే నూతన సంవత్సర వేడుకలకు దూరం
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు
- అమరావతి ఐకాసకు టీడీపీ తరఫున రూ.లక్ష చెక్
- పెయిడ్ ఆర్టిస్టులు ఎక్కడ ఉన్నారో నిరూపించాలి: రాజధాని రైతులు



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజధాని అమరావతిపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అమరావతి పరిధిలోని గ్రామాల్లో 15వ రోజు నిరసన దీక్షలు ప్రారంభమయ్యాయి. మూడు రాజధానుల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ జీఎన్‌రావు కమిటీ ఇచ్చిన బోగస్ నివేదికను రద్దు చేయాలని రైతులు నినదించారు. కొత్త సంవత్సరం సంతోషాలను పక్కన పెట్టి అమరావతి సాధనే లక్ష్యంగా దీక్షలు చేస్తున్నట్లు రైతులు చెప్పారు. అమరావతిని రాజధానిగా కొనసాగించేవరకు దీక్షలు విరమించేది లేదని స్పష్టం చేశారు.

చంద్రబాబు ఎదుట రాజధాని రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్రం కోసమే నాడు తమ భూములు ఇచ్చామన్నారు. నూతన సంవత్సరం రోజు కన్నీళ్లు పెడుతూ రోడ్లపై కూర్చున్నామని రాజధాని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెయిడ్ ఆర్టిస్టులు ఎక్కడ ఉన్నారో నిరూపించాలని సవాల్ విసిరారు. అమరావతిలో అన్ని కులాలు, మతాల వారున్నారన్నారు. బొత్స శ్మశానం అంటారని.. స్పీకర్ ఎడారి అంటారని.. మూడు ప్రాంతాల ప్రజల మధ్య గొడవలు పెడుతున్నారని రాజధాని రైతులు తెలిపారు. జగన్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని విజయలక్ష్మి అడిగారన్నారు. మీ అబ్బాయికి ఎందుకు చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. జగన్‌కు ఓటు వేసినందుకు తమ చెప్పులతో కొట్టుకునే స్థితికి తెచ్చాడన్నారు. జగన్ వచ్చాక కూల్చడమే కానీ.. కట్టడం ఇంకా ప్రారంభించలేదన్నారు. రూ. 16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో కట్టుబట్టలతో రాష్ట్రానికి వచ్చామన్నారు. అన్ని విధాలా అనుకూలం. రాష్ట్రం మధ్యలో ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేసి నిర్ణయం తీసుకున్నామన్నారు. శివరామకృష్ణ కమిటీ కూడా అమరావతిని సిఫార్సు చేసిందని చెప్పారు. ఆనాడు అసెంబ్లీలో జగన్ కూడా రాజధానిగా అమరావతిని అంగీకరించి 30వేల ఎకరాలు అవసరం అన్నమాటను ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేశారు. మాట తప్పను.. మడమ తిప్పను అన్న సీఎం ఇప్పుడు యూటర్న్ ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, కేంద్రం రూ. 1500 కోట్లు ఇస్తే అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. అన్నిచోట్ల నుంచి పవిత్ర జలాలు, రైతుల కోరిక మేరకు ఆనాడు రిజిస్ట్రేషన్ చేయలేదని చంద్రబాబు చెప్పారు. జగన్ ఆరోజు ముద్దులు పెట్టారని, ఇప్పుడు గుద్దులు గుద్దుతున్నారని చంద్రబాబు అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వస్తే అడ్డుకుంటారా అంటూ చంద్రబాబు మండిపడ్డారు. జగన్ కాన్వాయ్‌కు మరో దారిలేదా? అని ప్రశ్నించారు. ముందు డమ్మీ కన్వాయ్ పంపి తర్వాత వస్తున్నారని, ఇంత పి రికివాడుగా భయంతో తిరుగుతున్నారని విమర్శించారు. జగన్ ఆకాశం నుంచి ఏమైనా ఊడి పడ్డారా? పోలీసులకు ఎవరేంటో తెలియదా? అని చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు చట్టాన్ని అతిక్రమించొద్దని హితవు పలికారు. ఆడబిడ్డలను పెయిడ్ ఆర్టిస్టులని మాట్లాడుతూ అవమానించిన వారిపై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అమరావతి కోసం ఉద్యమం చేయడానికి ఐదు కోట్ల మంది ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు అన్నారు.

రైతులను చూస్తే బాధేస్తోంది : అమరావతి రైతుల ఆందోళనల నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు రాజధాని గ్రామాల్లో పర్యటించారు. చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి ఎర్రబాలెంలో రైతుల దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ భువనేశ్వరి సూచన మేరకే నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నాం. ఆనందంగా గడపాల్సిన సమయంలో రైతులు రోడ్డుపైకి వచ్చారు. రైతులు మాట్లాడుతుంటే చాలా బాధేస్తోంది. ప్రాణసమానంగా భూములు చూసుకున్నామని చెప్పారు. రాజధాని కోసం త్యాగం చేస్తే ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సేవకుడిగా పనిచేశా.. అభివృద్ధి చేశా. హైదరాబాద్‌లో ఆ కంపెనీల్లో ఇవాళ పనిచేస్తున్నది నా మనుషులా? నాకులం వాళ్లా? మా పార్టీ కార్యకర్తలా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

అంతా చట్టప్రకారమే జరిగింది : అమరావతిపై సామాజిక వర్గం అని నెపం వేశారు. ఈ ప్రాంతం మునిగిపోతుందంటారు. ఒకే సారి నీళ్లు వదిలి నా ఇల్లు ముంచడానికి ప్రయత్నించారు. వారి వల్ల కాలేదు. లూజ్ సాయిల్ అని ప్రచారం చేశారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని ఆరోపణలు చేశారు. అన్నీ అవాస్తవాలే. అంతా చట్ట ప్రకారమే చేశాం. ఇక్కడ ఏంలేదు గ్రాఫిక్స్ అంటున్నారు.. వాళ్లకు భవనాలు కనిపించవా? రూ.10వేల కోట్లు ఖర్చుపెడితే.. ఏం లేదంటున్నారు. ఇక్కడి రైతుల భూమి విలువ పెరిగితే మీకెందుకు అంత కడుపు మంట. ప్రపంచంలో మూడు రాజధానులు ఎక్కడైనా ఉన్నాయా? రాజధాని విజయవాడ–గుంటూరు మధ్య ఉండాలని ప్రజలందరూ చెప్పారు. అసమర్థ అధికారి జీఎన్‌రావుతో కమిటీ వేశారు. బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ పోర్చుగల్‌లో ఫోర్జరీ చేస్తే వాళ్లపై ఎఫ్‌బీఐ విచారణ జరుగుతోంది. ఇప్పుడేమో సూపర్ హైపవర్ కమిటీ అంటున్నారు. రాష్ట్రంలోని ఐదుకోట్ల మందికి పిలుపునిస్తున్నా రాజధానిని కాపాడే బాధ్యత యువత, రైతులు, మహిళలపై ఉంది. అందరూ కలిసి పోరాడాలి అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

తప్పు చేశారు కాబట్టే జగన్‌కు భయం : హైదరాబాద్‌కు దీటుగా మరో నగరం ఉండాలనే అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. తన సతీమణి భువనేశ్వరితో కలిసి కృష్ణాయపాలెంలో రైతుల రిలే నిరాహారదీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. త్వరలో సీఎం జగన్ నివాసానికి శాశ్వతంగా కంచె వేసుకునే పరిస్థితి వస్తుందని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. డమ్మీ కాన్వాయ్ పంపిస్తే తప్ప సీఎం రావట్లేదన్నారు. తప్పు చేశారు కాబట్టే జగన్‌కు అంతభయమని, తనకు, పవన్ కల్యాణ్‌కు ప్రజలే పోలీసులని చెప్పారు. భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలు రోడ్డుపైకి రావడం తొలిసారని, అంతా కలిసి అమరావతిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబు ఎప్పుడూ రైతుల గురించే ఆలోచించే వారని, ఆయన ఊపిరి నిండా అమరావతే ఉందని చెప్పారు.

నాతోనే మైండ్‌గేమ్ ఆడుతున్నారు: అమరావతిలో రాజధాని నిర్మాణానికి ఆనాడు ఒప్పుకుని ఇప్పుడెందుకు యూటర్న్ తీసుకున్నారని సీఎం జగన్‌ను తెదేపా అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పిన వ్యక్తి ఇప్పుడెందుకు మాట మార్చారని దుయ్యబట్టారు. రాజధాని ప్రాంతంలోని మందడంలో రైతులు చేస్తున్న మహాధర్నాకు తన సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. హైదరాబాద్ అభివృద్ధికి ఎంతో కష్టపడ్డానని.. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటే ఏంటో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై దర్యాప్తు చేయాలని చంద్రబాబు సవాల్ విసిరారు.


అలాగైతే జగన్ పులివెందుల పారిపోవడం ఖాయం : ఒక్కసారి సీఎం కావాలనే జగన్ కోరిక తీరింది. ఆయన మళ్లీ రారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న నాతోనే మైండ్‌గేమ్ ఆడుతున్నారు. మేమేం తప్పు చేయలేదు.. మాకు భయం లేదు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా 55వేల ఎకరాలు సేకరించాం. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలన్నీ పూర్తయ్యాక ఇంకా 10వేల ఎకరాలు మిగులుతుంది. వాన్‌పిక్‌లో 18వేల ఎకరాలను తక్కువ ధరకే కొట్టేశారు. మీరు చేసినట్లు అమరావతి రైతులను నేను మోసం చేయలేదు. అమరావతిలో అన్నీ ఉన్నాయి.. ఇక డబ్బు ఎందుకు? పైసా కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. 7 నెలలుగా అన్ని పనులూ అమరావతిలోనే చేస్తున్నారు. కారుణ్య మరణాలు కావాలని రైతులు అడిగారంటే ఈ సీఎంకు సిగ్గుందా? ధైర్యంగా ముందుకెళ్తే జగన్ పులివెందులకు పారిపోవడం ఖాయం. అమరావతి జోలికొస్తే కాలిపోతారు..జాగ్రత్త. మూడు రాజధానులు ప్రపంచంలో ఎక్కడా లేవు. దేశంలో ఏ సీఎం అయినా రాజధానిని మార్చారా? విశాఖ ప్రజల ఆస్తులు కొట్టేయాలని చూస్తున్నారు. వైకాపా అధికారంలోకి వచ్చాక విశాఖలో అభివృద్ధి ఆగిపోయింది. రాజధాని కోసం పోరాడుతున్న రైతులను పెయిడ్ ఆర్టిస్టులు.. బిర్యానీల కోసం వస్తున్నారని అవమానిస్తారా? జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ ఊళ్లకు రావడం తప్పా? కుటుంబం వ్యక్తిగత జీవితం వదిలి అమరావతి కోసం ఆలోచించా. గాడి తప్పిన పరిపాలనను మళ్లీ గాడిలో పెడతా. రైతులతో పాటు జైలుకు వచ్చేందుకు నేను కూడా సిద్ధమే. అమరావతి ఐకాసకు తెదేపా తరఫున రూ.లక్ష చెక్ అందజేస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు.

నన్ను చూస్తే ఆయన భయపడేవారు: అనాడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రతి ఊరు తిరిగి ముద్దులు పెట్టారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పిడిగుద్దులు గుద్దుతున్నారని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనను చూస్తే భయపడేవారని, గౌరవించేవారని అన్నారు. లేచి నిలబడకుంటే.. రాజశేఖర్ రెడ్డీ.. తప్పు చేస్తున్నావ్ జాగ్రత్త అంటే గమ్మున కూర్చునేవారని అన్నారు. ఇప్పుడు జగన్ ఏం చేస్తున్నారో తెలుసా? అని ప్రజలనుద్దేశించి అన్నారు. వెకిలినవ్వులు నవ్వుతున్నారని, పక్కన ఇంకొక వ్యక్తి ఎగిరెగిరిపడుతున్నాడని మండిపడ్డారు. ఇవన్నీ చూస్తుంటే అసహ్యమేస్తోందని, కానీ ఇవన్నీ తాను ఎందుకు భరిస్తున్నానంటే తనకోసం కాదని, ప్రజలు, రాష్ట్రం కోసమేనని చంద్రబాబు స్పష్టం చేశారు.



చేతి గాజులు విరాళంగా ఇచ్చిన భువనేశ్వరి : రాజధానిగా అమరావతినే కొనసాగించాలని కోరుతూ రైతుల నిరసన దీక్షలు 15వ రోజు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో తెదేపా అధినేత చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరి రాజధాని గ్రామాల్లో పర్యటించారు. ఎర్రబాలెం గ్రామంలో రైతుల దీక్షలో కూర్చుని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వరి తన చేతికి ఉన్న గాజులు తీసి అమరావతి ఉద్యమానికి విరాళంగా ఇచ్చారు. భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలు పడుతున్న బాధను తోటి మహిళగా అర్థం చేసుకున్నా. ఏపీని ప్రథమ స్థానంలోకి తీసుకురావడానికి చంద్రబాబు నిరంతర కృషి చేశారు. ప్రజల తర్వాతే.. నన్ను, కుటుంబాన్ని పట్టించుకునేవారు. ఎప్పుడూ అమరావతి, పోలవరం అని చంద్రబాబు తపించారు. ఆరోగ్యం కూడా లెక్క చేయకుండా ప్రజల కోసమే కష్టపడ్డారు. రైతులకు పూర్తి మద్దతుగా మా కుటుంబం అండగా ఉంటుంది. అమరావతి రైతుల నమ్మకాన్ని చంద్రబాబు వమ్ము చేయరు అని తెలిపారు. భువనేశ్వరి ఇచ్చిన గాజులను బహిరంగవేలం వేసి తద్వారా వచ్చిన డబ్బును ఉద్యమానికి వినియోగించుకోవాలని చంద్రబాబు సూచించారు. వివిధ సంఘాలు ఇచ్చిన రూ.50వేల విరాళాన్ని కూడా ఎర్రబాలెం రైతు పోరాట కమిటీకి అందించారు. ఇతర ప్రజా సంఘాలు, ప్రజలు ఎవరికి తోచిన విధంగా వారు ఆర్థిక సాయం చేశారు.

జగన్‌కు రాయలసీమ హక్కుల కమిటీ లేఖ



అమరావతి, సూర్య ప్రతినిధి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రాయలసీమ హక్కుల కమిటీ లేఖ రాసింది. సీఎం ప్రతిపాదించిన మూడు రాజధానుల నిర్ణయం సరికాదని కమిటీ సభ్యులు లేఖలో స్పష్టం చేశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు వల్ల రాయలసీమకు వచ్చే అదనపు ప్రయోజనాలు ఏమీ ఉండవన్నారు. విశాఖపట్నంను రాజధానిగా అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అమరావతినే రాజధానిగా కొనసాగించండని డిమాండ్ చేశారు. లేదంటే శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం సీమలో రాజధానిని ఏర్పాటు చేయాలన్నారు.

అమరావతి రాజధానా? లేక ఓ గ్రామమా?



తిరుపతి, సూర్య ప్రతినిధి : రాజధాని అమరావతిపై మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతి రాజధానా? లేక ఓ గ్రామమా? అని వ్యాఖ్యానించారు. బుధవారం ఇక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధానిపై ఏర్పాటు చేసిన కమిటీల నివేదికపై అసెంబ్లీలో చర్చించి రాజధానులపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాజధానితో పది శాతం మంది ప్రజలకే పని ఉంటుందని వ్యాఖ్యానించారు. కోర్టులతో కూడా పదిశాతం మంది ప్రజలకే పని ఉంటుందని చెప్పుకొచ్చారు. జగన్ నిర్ణయాన్ని రియల్టర్లే వ్యతిరేకిస్తున్నారని అన్నారు. రాయలసీమ వాసులంతా థ్యాంక్యూ సీఎం అంటూ జగన్‌ను కీర్తించాలని మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యానించారు.

తిరుమలలో సామాన్య భక్తులకే పెద్దపీట



విజయవాడ, సూర్య ప్రతినిధి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా కలకలం కొనసాగాలని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన బుధవారం గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి త్వరితగతిన స్వామివారి దర్శన భాగ్యం కలిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడి దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే వైకుంఠ ఏకాదశి నుంచి తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ స్వామివారి లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌కు వస్తున్న జనాదరణను చూసి టీడీపీ ఓర్వలేకపోతోందని అందుకే రైతుల పేరుతో రాజధాని డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. అమరావతిలో బినామీ పేర్లతో కొన్న భూములకు విలువ పడిపోతుందన్న భయంతో కుట్ర రాజకీయాలు చేస్తోందని వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని రెండు లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డ ఆయన టీడీపీ భూముల కోసం లక్ష కోట్లు పెట్టి అభివృద్ధి చేయాలా అని వ్యాఖ్యానించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి భావిస్తుంటే, ఒక్క ప్రాంతానికే పరిమితం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్దపీట వేశారన్నారు. రాజధాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. కమిటీ నివేదిక వచ్చాక అందరికీ న్యాయం జరిగేలా నిర్ణయం ఉంటుందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. కాగ అంతకు ముందు టీటీడీ ఛైర్మన్ రాజ్ భవన్‌లో గవర్నర్ బీబీ హరిచందన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి కేలండర్, ప్రసాదాలను అందచేశారు. టీటీడీ అర్చకులు గవర్నర్‌కి వేదాశీర్వాదం అందించారు.

దేశ చరిత్రలో ఆర్టీసీ విలీనం మైలురాయి




విశాఖ, సూర్య ప్రతినిధి : దేశ చరిత్రలో ఏపీఎస్ ఆర్టీసీ విలీనం మైలురాయిగా మిగిలిపోతుందని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనం సందర్భంగా బుధవారం మద్దిలపాలెం డిపో ఆవరణలో అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి అవంతి మాట్లాడుతూ సీఎం జగన్ విలీనం నిర్ణయం తో 55 వేల కుటుంబాలు సంతోషంగా ఉన్నా యన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారమే జగన్ నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు.

పాదయాత్రలో ఇచ్చిన మాటప్రకారం 80 శాతం హామీలు జగన్ నెరవేర్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల కు చెప్పాలని మంత్రి అవంతి ఆర్టీసీ కార్మికులకు సూచించారు. మద్దెలపాలెం డిపో ఆవరణలో కాసేపు బస్సులో ప్రయాణించిన మంత్రి అనంతరం డిపో నుంచి సీతమ్మధారలో తన నివాసానికి బస్సులోనే ప్రయాణించారు.

నాగలికి ఉరివేసుకున్న రైతు ముగ్గు

రాజధానిలో వినూత్న నిరసన



అమరావతి, సూర్య ప్రతినిధి : మూడు రాజధానుల ప్రకటనకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఆందోళనలు 15వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం రాజధాని మహిళలు వినూత్నరీతిలో నిరసనకు దిగారు. ఇంటి ముందు నాగలికి ఉరివేసుకున్న రైతు ముగ్గు వేసి నిరసన తెలిపారు. కీడు అని తెలిసినా కూడా తమ ఆవేదన ప్రతిబింబించేలా ముగ్గు వేసామంటి మహిళలు చెబుతున్నారు. ప్రభుత్వం తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే తమ పరిస్థితి ఇదే అని మహిళా రైతులు తెలిపారు. సేవ్ ఆంధ్రప్రదేశ్, సేవ్ అమరావతి అంటూ ముగ్గులు వేశారు.

తన్నే జగన్‌ను తెచ్చుకున్నారు

టీడీపీ నేత వర్ల రామయ్య

విజయవాడ, మేజర్ న్యూస్: నేర చరిత్ర కలిగిన వారిని ఎలా ఎన్నుకున్నారని, బయటి వాళ్లు ప్రశ్నిస్తున్నారని టీడీపీ నేత వర్లరామయ్య తెలిపారు. చంద్రబాబులాంటి నాయకుడిని వదులుకుని, తన్నే జగన్‌ను తెచ్చుకున్నారని వ్యాఖ్యానించారు. అమరావతి పేరు మీకు నచ్చలేదా, ఇక్కడ రాజధాని నచ్చలేదా అని ప్రశ్నించారు. సీఎం కాగానే రాజధాని ఎందుకు మార్చాలనుకుంటున్నారని ఆయన నిలదీశారు. జీఎన్‌రావు కమిటీ నివేదికకు ముందే ప్రకటన ఎలా చేస్తారని మరోసారి ప్రశ్నించారు. సూట్‌కేసు కంపెనీలు పెట్టుకోవడం మీకు బాగా అలవాటేనని ఆరోపించారు. బోస్టన్ కంపెనీ విజయసాయిరెడ్డి కుమారుడి స్నేహితుడిది కాదా అంటూ మరోసారి ప్రశ్నించారు. ఆ రిపోర్ట్ పేరు చెప్పి రాజధాని మారుస్తామంటే ఊరుకోమని వర్లరామయ్య హెచ్చరించారు.

చంద్రబాబు, భువనేశ్వరి వ్యతిరేకమని తేలిపోయింది



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణతో ప్రతిపక్షనేత చంద్ర బాబు నాయుడికి భయం పట్టుకుందని డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి అన్నారు. అందుకే ఇంట్లోని ఆడవాళ్లను తెచ్చి రాజకీయం చేస్తున్నా రని విమర్శించారు. అమరావతిలో చంద్రబాబుతో కలిసి పర్యటించిన ఆయన సతీమణి భువనేశ్వరి ఆమె చేతికి ఉన్న బంగారు గాజులను రాజధాని రైతులకు అందించారు. ఈ విషయంపై స్పందించిన డిప్యూటీ సీఎం సచివాలయంలో మాట్లాడుతూ.. భువనేశ్వరి ఇవ్వాల్సింది గాజులు కాదు.. వాళ్ల భర్త అన్యాయంగా తీసుకున్న రైతుల భూములని స్పష్టం చేశారు. రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ పేరుతో భూములు కొట్టేసింది మీ భర్త చంద్రబాబు కాదా అని భువనేశ్వరిని ప్రశ్నించారు. హెరిటేజ్ పేరుతో ఉన్న 14 ఎకరాల భూములను రైతులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు 4 వేల ఎకరాలు దోచేసింది నిజం కాదా అని నిలదీశారు.

థాంక్యూ సీఎం! ఈ విలీనం చరిత్రాత్మకం



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : విలీన ప్రక్రియ పూర్తి కావడంతో ఆర్టీసీ కార్మికులు నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి కృతజ్ఞత సభలు నిర్వహిస్తున్నారు. విజయవాడలో జరిగిన థాంక్యూ సీఎం కార్యక్రమంలో రవాణా మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, రక్షణ నిధి, జగన్మోహన్‌రావు, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ కృష్ణ బాబు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు గౌతమ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఎండీ కృష్ణ బాబు మాట్లాడుతూ ఇది ఒక కొత్త అధ్యాయం. విలీన ఆద్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. తన పాదయాత్ర సమయంలో ఆర్టీసీ కార్మికుల జీవన స్థితిగతులు తెలుసుకున్న నాయకులు వైఎస్ జగన్ 2019, జూన్ 10న తొలి కేబినెట్ మీటింగ్‌లోనే విలీన ప్రక్రియ గురించి ప్రస్తావించారు. విలీన ప్రక్రియపై ఎక్స్‌పర్ట్ కమిటీ వేసి కమిటీ నివేదిక ద్వారా నిర్ణయం తీసుకున్నారు. ఆర్టీసీ విలీనాన్ని నూతన సంవత్సర కానుకగా ఇవ్వడం చరిత్రాత్మకమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల గుండెల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఆర్టీసీ చనిపోయేలా చేశారు. సీఎం జగన్ ఆర్టీసీకి జీవం పోశారు. కార్మికుల, కర్షకులకు నచ్చిన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ ప్రైవేటు బస్సులను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలి. అప్పుడే ఆర్టీసీ మనుగడ సాగిస్తుందిఅన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం లో విలీనం చేయడం సాహసోపేత నిర్ణయమని ఎమ్మెల్యే రక్షణ నిధి అన్నారు.


స్నేహపూర్వక వాతావరణంలో

రాజ్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు

- గవర్నర్ ఆశీస్సులు తీసుకున్న చిన్నారులు
- బిశ్వ భూషణ్ హరిచందన్‌కు శుభాకాంక్షలు తెలిపిన అమాత్యులు, అధికారులు, సాధారణ ప్రజలు



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : నూతన సంవత్సర ఆగమన శుభవేళ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరి చందన్ ఆకాంక్షించారు. అభివృద్ధిలో అగ్రగామి రాష్ట్రంగా వెలుగొందాలని, ప్రతి ఇంటా శుఖశాంతులు వెల్లి విరియాలని అభిలషించారు. విజయవాడ రాజ్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్నేహపూర్వక వాతావరణంలో ఉన్నతాధికారులు, ప్రముఖులు, పెద్దలు, చిన్నారులు రాష్ట్ర ప్రథమ పౌరునికి తమ శుభాకాంక్షలను అందించారు. గవర్నర్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈ కార్యక్రమాన్ని సమన్వయపరస్తూ రాగా, రోజంతా విభిన్న కార్యక్రమాల సమాహారంగా నడిచింది. తొలుత శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం పండితులు వేద మంత్రోచ్చారణ నడుమ గవర్నర్ దంపతులను ఆశీర్వదించారు. ఆలయ పురోహితులతో పాటు దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యక్రమంలో పాల్గొని గవర్నర్ వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేసారు. అనంతరం గవర్నర్ దంపతులను రాజ్ భవన్ అధికారులు, సిబ్బంది కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర ఆగమన శుభవేళ గవర్నర్ దంపతులు ప్రత్యేకంగా రాజ్ భవన్ అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. తరువాత జరిగిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో గవర్నర్ హరిచందన్ ను అమాత్యులు, సామాన్య ప్రజలు, పౌర సమాజ ప్రతినిధులు, సీనియర్ అధికారులు కలుసుకుని వారితో ఆహ్లాదకరమైన సమయాన్ని పంచుకున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రం నుండి చిన్నారులు, అనాథ గృహాల పిల్లలు గవర్నర్‌ను కలుసుకుని ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చిన వేద పండితులు గవర్నర్ దంపతులను ఆశీర్వదించగా, టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి స్వామి వారి ప్రసాదంను అందించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నాని గవర్నర్ ను కలిసి శుభాకాంక్షలు అందించి, ఆశీర్వచనం తీసుకున్నారు. గవర్నర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందించే వారితో రాజ్ భవన్ రోజంతా సందడిని సంతరించుకోగా, సాయంత్రం రెడ్ క్రాస్ సొసైటీ నేతృత్వంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టు కున్నాయి. విభిన్న సమయాలలో జరిగిన కార్యక్రమాలలో స్థానిక శాసన సభ్యుడు మల్లాది విష్ణు, డిజిపి గౌతమ్ సావాంగ్, పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమల రావు, నీరబ్ కుమార్ ప్రసాద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కారికల్ వలవన్, స్టాంపులు, రిజిస్ట్రేషన్స్ శాఖ కమీషనర్ సిద్దార్థ్ జైన్, గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, జిఎడి కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ కిషోర్ కుమార్, చేనేత జౌళి శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, సమాచార కమీషనర్లు బివి రమణ కుమార్, ఐలాపురం రాజా, రవి కుమార్ గవర్నర్‌ను కలిశారు. జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, సంయిక్త కలెక్టర్ మాధవి లత, విజయవాడ నగర పాలక సంస్థ కమీషనర్ ప్రసన్న వెంకటేష్, రాష్ట్ర రెడ్ క్రాస్ ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, కృష్ణా జిల్లా ఛైర్మన్ డాక్టర్ సమరం, గవర్నర్ వారి సంయిక్త కార్యదర్శులు అర్జున రావు, నాగమణి తదితరులు గవర్నర్ కలిసి శుభాకాంక్షలు అందించారు.



కమిటీలే కమిటీలు

రాష్ట్రం ఏర్పడి ఆరేళ్లవుతున్నా నేటికీ తెగని రాజధాని రగడ

మూడు రాజధానుల ప్రకటనతో అమరావతిలో ఆందోళనలు

రాజధాని ప్రాంతం ఎక్కడ ఉండాలి అనేది రాష్ట్ర ప్రజలందరికి సంబంధించిన విషయం, నేటి తరానికే కాక ఇది భవిష్యత్తు తరాలకు సంబంధించిన విషయం. నిజానికి విభజన చట్టం మేరకు ఏపి రాజధాని విషయంలో అనేక కమిటీలు ఏర్పాటు జరిగింది. పాలకులు తమకు నచ్చిన తీరుగా ఈ కమిటీ లను ఏర్పాటు చేసుకుని తామనుకున్నదే నివేదికలు అందేలా చూసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ కూడా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ విభజిత ఏపి రాజధాని విషయంపై కొన్ని సూచనలు చేయగా, ఆ పై వచ్చిన శివరామకమిషన్ రాజధానిపై నిర్ధిష్ట సూచనలు చేసింది. దీనిని పక్కన పెట్టి నారాయణ కమిటీ సిఫారసులతో అమరావతి రాజధాని అయ్యింది. తాజాగా అధికార మార్పిడితో మూడు రాజధానుల వ్యవహారం తెరపైకి తెచ్చిన కొత్త ప్రభుత్వం జిఎస్ రావు కమిటీ, బోస్టన్ కమిటీలను ఏర్పాటు చేయగా వాటి నివేదికలు పరిశీలించేందుకు బుగ్గన నేతృత్వంలో మరో హైపర్ కమిటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయా కమిటీలు ఏం చెప్పాయని ఒసారి పరిశీలిస్తే....

గత ప్రభుత్వం అలవంబించిన తీరు, ఏకపక్షనిర్ణయాలు, పలుకుబడి కలిగిన వ్యక్తుల ఇష్టాయిష్టాలు వెరసి రాజధాని తన సొంతఆస్తి అన్నట్టు ఎవ్వరి సూచనలు,సలహాలు తీసుకోలేదు, వ్యవసాయం దెబ్బ తింటుందని చెప్పినా, పర్యావరణం నాశనం అవుతున్నదని తెలిసినా, ప్రభుత్వం మీద ఆర్ధిక భారం పడు తుందని మొత్తుకున్న వినకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిపై 2014 నుంచి ఇప్పటి వరకు మూడు కమిటీలు ఏర్పడి రాజధాని ఎంపిక, అభివృద్ధి వికేంద్రీకరణపై ఈ కమిటీలు తమ నివేదికలు ఇచ్చాయి. ఏది ఏమైనా 33 వేల పైచిలుకు ఎకరాలను సేకరి ంచి ఈ ప్రాంతంలో రహదారులు నిర్మాణం, కొన్ని భవనాలు పూర్తయిన తదుపరి భూములిచ్చిన రైతులలో ఎన్నో ఆశలు రేకెత్తించి ఇప్పుడు ఉన్న పాళంగా రాజధానిని కుదిస్తూ, వికేంద్రీకరణ మాటున రాజధానిని మూడు ప్రాంతాలకు విస్తరిస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలే ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి.

శ్రీకృష్ణ కమిటీ

ఆంధ్రప్రదేశ్ విభజనకోసం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను 2010, డిసెంబర్ 30న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ కమిటీ కోసం భారత ప్రభుత్వం దాదావు 20 కోట్లు ఖర్చు చేసింది. అనేక అంశాలని క్రోడీకరించింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌లోరాజధాని ఏర్పాటు విషయంపై నిర్ధిష్ట సూచనలు చేయకున్నా ఎదురయ్యే పరిణామాలను వివరిరచింది. .

శివరామకృష్ణ కమిటీ



రాష్ట్ర విభజన తదుపరి ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏర్పాటుకు సంబంధించి కేంద్రం ఐదుగురు నిపు ణులతో కూడిన తమిళనాడు 1958 ఐఏఎస్ బ్యాచ్ అధికారి శివరామకృష్ణన్ నేతృత్వంలో కమిటీని నియమించింది.ఈ కమిటీలో న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో అర్బన్ డిజైనింగ్ విభాగానికి హెచ్.వో.డీగా ఉన్న ప్రొఫెసర్ కె.టి.రవీంద్రన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న .ప్రొఫెసర్ జగన్ షా.., ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్ డైరెక్టర్ అరోమర్ రేవి.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ రిసెర్చ్ డైరెక్టర్ రతిన్ రాయ్. ఇలా ప్రతీ ఒక్కరు ఎంతో అనుభవం ఉన్నవారే ఉన్నారు. ఏపీలో మూడు నెలలపాటు దాదాపు అన్ని ప్రాంతాలలో పర్యటించించి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఏర్పాటుకు సంబంధించిన హైదరాబాద్ విషయంలో చేసిన పొరపాటు చేయకూడదని శివరామకృష్ణన్ కమిటీ అభిప్రాయపడింది. అంతా హైదరాబాదులో కేంద్రీకృతం కావడం వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెంది, మిగతా ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, దానివల్లనే విభజన సమయంలో హైదరాబాద్ వివాదంగా మారిందని చెప్పింది. 50 కోట్లు ఖర్చు పెట్టి విజయవాడ- గుంటూరు మధ్య రాజధాని వద్దు అని చెప్పింది ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన పరిస్థితులున్నాయని, అందువల్ల ఒక సూపర్ సిటీ కోసం అన్వేషణ సరి కాదని వివరించింది. రాష్ట్రంలోని వివిధ నగరాల మధ్య ఇప్పటికే ఉన్న రోడ్డు, రైలు రవాణా వ్యవస్థను మెరుగుపరిచి, విస్తరించి పాలనా కేంద్రాలను వికేంద్రీకరించాలని కమిటీ వివరించింది.కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో రాజధాని ఏర్పాటు చేయడం వల్ల దీర్ఘకాలిక ఆర్థిక, పర్యావరణ పర్యవసానాలుంటాయని, వ్యవసాయ భూములను ఇతర అవసరాలకు మార్చేస్తారని, దీనివల్ల వ్యవసాయంపై ఆధారపడిన వారి ఉపాధి దెబ్బతింటుందని కమిటీ తెలిపింది.

మంత్రి నారాయణ కమిటీ




రాష్ట్రానికి మధ్యలో పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్న విజయవాడ- గుంటూరు ప్రాంతాలను కాదని శివరామకృష్ణ కమిటీ చెప్పడాన్ని అంగీకరించలేని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని కాదని సొంతంగా టీడీపీ మంత్రి నారాయణ కమిటీ అని ఒకటి వేసారు. ఈ నారాయణ రాజధాని కమిటీలో టీడీపీ ఎంపీ సుజనా చౌదరి ,గుంటూరు టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ బీదా మస్తాన్ రావు, జీ.వి.కే గ్రూప్ సంజయ్ రెడ్డి, జి.యం. ఆర్ గ్రూప్, బొమ్మిడాల శ్రీనివాస్, నూజివీడు సీడ్స్ చైర్మెన్ ప్రభాకర రావు, పీపుల్ కాపిటల్ చైర్మెన్ చలపతి శ్రీనివాస రాజు ఉన్నారు. రాజధాని నిర్మాణంలో భాగంగా అసెంబ్లీ, సచివాలయం, ఇతర నిర్మాణాలను ఎక్కడెక్కడ, ఏ రీతిన నిర్మించాలన్న అంశాలకు సంబంధించి కమిటీ దేశంలోని చండీగడ్, నయా రాయపూర్, నవీ ముంబయితో సహా పుత్రజయ, ఆస్టిన్, దుబాయి, సింగపూర్ తదితర ప్రాంతాలలో పర్యటించి అక్కడి రాజధాని ప్రాంతాలను అధ్యయం చేసింది. ఈ కమిటీ తిరిగి ప్రభుత్వానికి అమరావతి ప్రాంతంలో రాజధాని ఏర్పాటు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పింది మినహా ఎటువంటి నివేదికా సమర్పించిన దాఖలాలు లేవన్నది కొందరి మాట. దీని తరువాత వనరుల సేకరణ పేరు మీద సుజనా చౌదరి పేరు మీద ఒక కమిటి వేశారు.ఆ తరువాత నారాయణ, యనమల రామకృష్ణుడు నేతృత్వంలో భూసేకరణపై మరో కమిటి వేశారు.

అమరావతికి శంకుస్థాపన

22 అక్టోబర్ 2015న రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రధాన మంత్రి మోదీ శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి కృష్ణా జిల్లాలోని ఉద్దండరాయునిపాలెంలో ఆయన భూమి పూజ చేశారు.ఒకవైపు రాజధాని నిర్మాణ పనులు జరుగుతుండగా, తాజాగా అధికారంలోకి వచ్చిన వైసీపీ... రాజధాని మార్పుపై చర్చలేవనెత్తింది.

జిఎస్ రావు కమిటీ

రిటైర్డ్ ఐఏఎస్ జి.నాగేశ్వరరావు (జీఎన్ రావు) కన్వీనర్‌గా ఉన్న ఈ కమిటీలో విజయమోహన్, ఆర్.అంజలీ మోహన్, డాక్టర్ మహావీర్, డాక్టర్ సుబ్బారావు, కేటీ రవీంద్రన్, అరుణాచలం సభ్యులుగా ఉన్నారు.ఈ కమిటీ రాష్ట్రంలో 10,600 కిలోమీటర్లు పర్యటించి రాజధాని, అభివృద్ధి అంశాలపై అధ్యయనం చేసింది. డిసెంబర్ 20న కమిటీ నివేదికను ప్రభుత్వానికి అందించింది. 125 పేజీలతో కూడిన ఈ నివేదికలో అమరావతిలో శాసన రాజధాని (లెజిస్లేటివ్ క్యాపిటల్), విశాఖలో పరిపాలన రాజధాని (ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్), కర్నూలులో న్యాయ రాజధాని (జ్యుడీషియల్ క్యాపిటల్) ఏర్పాటు చేయాలని సూచించింది. నాలుగు ప్రాంతీయ అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది





అధ్యయనానికి హైపర్ కమిటీ

ఏపికి మూడు రాజధానుల అంశంపై జగన్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మొత్తం 16 మంది మంత్రులతో రాజధానిపై హై పవర్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీకీ బుగ్గన రాంజేదర్నాథ్ నేతృత్వంలో పేర్నినాని, మోపిదేవి వెంకట రమణ, మేకపాటి సుచరిత, బొత్స, ఆదిమూలపు సురేశ్, కన్నబాబు, కొడాలినాని, అజయ్ కల్లం, గౌతమ్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్ ఉన్నారు. కాగా ఈ కమిటీ కన్వీనర్‌గా ఏపి ఛీఫ్ సెక్రటరీ నీలం సాహ్నిని నియమించారు.పూర్తి స్థాయిలో సమీక్షిం చి మూడు వారాల్లోగా నివేదికను ప్రభుత్వానికి అందజేయా లని కమిటీని ఆదేశించింది. జనవరి చివరి వారంలోగా ఏపికీ రాజధా ని ఏదన్న అంశం పై స్పష్టత రానుంది. జిఎస్‌రావు కమిటీతో పాటు బోస్టన్ కమిటీ అధ్యయనాలపై కూడా హై పవర్ కమిటీ విచారించనుంది.



ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోనూ కొత్త రాజధాని ఏర్పాటుపై సూచనలు చేసింది.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో ఏముంది?ఈ చట్టంలోని సెక్షన్ 5 అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని గురించి ప్రస్తావించింది.

సెక్షన్ 5: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది.

5(1)- నియమిత తేదీ నుంచి "10 ఏళ్లకు మించని కాలానికి" అవశేష ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్.

5(2): గడువు ముగిసిన తరువాత హైదరాబాద్ నగరం తెలంగాణ రాష్ట్ర రాజధానిగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధాని ఏర్పాటు అవుతుంది.

ఉమ్మడి రాజధాని ప్రాంతం అంటే "హైదరాబాద్ పురపాలక చట్టం - 1955" ప్రకారం నోటిఫై చేసిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)

సెక్షన్ 6: నూతన రాజధాని కోసం నిపుణుల కమిటీ ఏర్పాటు

(ఈ సెక్షన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం శివరామకృషన్ కమిటీని ఏర్పాటు చేసింది.)

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014ను ఆమోదించిన తేదీ నుంచి 6 నెలలు మించకుండా ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని ప్రాంతంపై ఈ కమిటీ సిఫార్సు చేస్తుంది.

నారాయణ కమిటీ కన్నా గొప్పదా?

నారాయణ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజధాని కమిటీపై అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌తో పాటు ఆ పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు.శివరామకృష్ణ కమిటీ కంటే కూడా నారాయణ కమిటీ ఏమైనా గొప్పదా అంటూ ఆరోపణలు చేశారు. మరిప్పుడు బుగ్గనతో కమిటీలో ఉన్న మంత్రులంతా కూడా నిపుణులు, గొప్పవారా అని జనాలు గుసగుసలాడుకుంటున్నారు. కమిటీలో ఉన్న సభ్యులంతా జగన్‌కు అనుకూలంగా ప్రకటనలు చేసే వారే తప్ప.. రాజధాని ప్రాంతంగా ఉన్న అమరా వతికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు లేరన్నది జనం అనుమానం. మంగళగిరి, తాడికొండ శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి, శ్రీదేవిలను కూడా సభ్యులుగా చేర్చి ఉండాల్సిందని అంటున్నారు. మంత్రు లంతా జగన్ ఆలోచనకు భిన్నమైన అంశాలను ముందుకు తీసుకొచ్చే అవకాశం లేదంటున్నారు.

అధినేతల ఆలోచనలే నివేదికలుగా



కమిటీల పేర్లు ఏవైనా.. అవి సీఎం నిర్ణయాలకు, అభిమతానికి అనుకూలంగానే వ్యవహారిస్తాయని చెబుతున్నారు.అప్పట్లో నారాయణ కమిటీ అయినా.. బుగ్గన కమిటీ అయినా.. ఆ పార్టీల అధినేతల నిర్ణయాలకు మద్దతుగానే వ్యవహరిస్తాయని అంటున్నారు. జగన్ నిర్ణయాలనే జీఎన్ రావు కమిటీ నివేదికలా అందించిందని, ఇప్పుడు జగన్‌తో పాటు జీఎన్ రావు కమిటీలోని విషయాలకు మద్దతుగానే బుగ్గన కమిటీ కూడా నివేదిక అందిస్తుంటే తప్ప అంతకు మించి ఏం జరగదని జనాలు అనుకుంటున్నారు.ప్రస్తుత కమిటీలో రాజధాని ప్రాంత ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం లేకపోవడంపై జనాలు పెదవి విరుస్తున్నారు. ఒక ప్రాంతంలో అనుకున్న రాజధానిని తరలించేటప్పుడు ఆప్రాంత ప్రజాప్రతినిధులను కమిటీలో సభ్యులుగా చేర్చకపోవడంతో ఇదంతా తూతూ మంత్రంగా నడిపించే వ్యవహారమని జనాలు అనుకుంటున్నారు. ఇదే విషయం మీద ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. గుంటూరు జిల్లాకు చెందిన మంత్రి మేక తోటి సుచరితను వేశామంటారు. కానీ మంత్రిగా ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే పరిస్థితులు ఉండనే ఉండవని జనాలు అంటున్నారు. అప్పుడు నారాయణ కమిటీ వల్ల ఉపయోగం ఏంటని ప్రశ్నించిన వైసీపీ ఇప్పుడు బుగ్గన కమిటీ వల్ల ప్రయోజనం ఏంటో చెబితే బాగుంటుంది కదా అని జనాలు డిస్కస్ చేసుకుం టున్నారు. అంతేనా.. కమిటీల పేర్లే వేరు గానీ.. అధినేతల ఆలోచనకు అనుగుణం గానే పని చేస్తాయని సెటైర్లు వేస్తున్నారు

– సత్యగోపాల్, హైదరాబాద్

నూతన సంవత్సర శుభాకాంక్షలతో




సరిలేరు నీకెవ్వరులో మహేష్‌బాబు, విజయశాంతి, సంగీత, సుబ్బరాజు, రావు రమేష్, వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ తదితరులు


అల వైకుంఠపురములో అల్లు అర్జున్-పూజా హెగ్డే



నిశ్శబ్దంలో అనుష్క శెట్టి


ఎంత మంచివాడవురాలో కల్యాణ్‌రామ్-మెహరీన్


రెడ్‌లో రామ్



అశ్వత్థామలో నాగశౌర్య


భీష్మలో రష్మిక-నితిన్


క్రాక్‌లో రవితేజ

ముచ్చటగా మూడు సినిమాలు

పవన్ కల్యాణ్ ఇప్పటివరకు తను చేయనున్న సినిమాలపై పెదవి విప్పడం లేదు కానీ.. ఇప్పటికే ఆయన రెండు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని తెలుస్తోంది. అందులో ఒకటి బోణీ కపూర్‌తో దిల్ రాజు నిర్మించే పింక్ రీమేక్. అలాగే హరీష్ శంకర్, త్రివిక్రమ్ శ్రీనివాస్‌లతోనూ సినిమాలు చేసేందుకు పవన్ సన్నాహాలు చేస్తున్నారని, ఈమేరకు స్టోరీ డిస్కషన్స్ నడుస్తున్నాయని సమాచారం. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల హడావడి మొదలయ్యేందుకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది. అందువల్ల పూర్తి స్థాయిలో రాజకీయాల కోసం అన్నేళ్లు కేటాయించనవసరం లేదని, గత రెండు మూడేళ్లలో కరిగిపోయిన ఇమేజ్‌ను పెంచుకోవడం కోసం పవన్ సినిమాలు చేయడం ఆవశ్యమని రాజకీయ పండితులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో సంవత్సరానికి మినిమమ్ మూడు సినిమాలు చేసేందుకు పవన్ పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నది అనధికార వర్గాల భోగట్టా!!



పోస్ట్ ప్రొడక్షన్‌లో 22



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్, సూపర్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ మారుతి వద్ద దర్శకత్వ శాఖలో అనుభవం సంపాదించుకున్న శివకుమార్. బి స్టోరీ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ కుమార్ చౌదరి, సలోని మిశ్రా హీరోహీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం '22'. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరువుకుంటోంది. కాగా నూతన సంవత్సరం సందర్భంగా 22 టైటిల్ యానిమేషన్ లోగోను విడుదల చేసింది చిత్ర యూనిట్. త్వరలోనే ఈ చిత్రం టీజర్ విడుదల కాబోతుంది. రూపేష్ కుమార్ చౌదరి, సలోని మిశ్రా, విక్రమ్‌జీత్ సింగ్, దేవి ప్రసాద్, జయప్రకాశ్, రవివర్మ, ఫిదా శరణ్య, పూజ రామచంద్రన్, రాజశ్రీ నాయర్, కృష్ణ చైతన్య, ఆఫ్ఘనిస్తాన్ రాజు, మాస్టర్ తరుణ్, బేబి ఓజల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ:బి.వి. రవికిరణ్, సంగీతం: సాయికార్తీక్, కొరియోగ్రఫీ: అనీలామా, ఆర్ట్: పెద్దిరాజు అడ్డాల, స్టంట్స్: జాషువ, లిరిక్స్: భాస్కరభట్ల, కాసర్ల శ్యామ్, చీఫ్ కో-డైరెక్టర్: వుల్లారావు కొప్పినీడి, నిర్మాత: శ్రీమతి సుశీలాదేవి, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, దర్శకత్వం: శివకుమార్ బి!!

సవాళ్లతో సవారి



నందు, ప్రియాంక శర్మ జంటగా నటించిన సవారీ సినిమా విడుదలకు సిద్ధమైంది. అన్ని వర్గాలను ఆకట్టుకునే యానిమల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా సవారి చిత్రం తెరకెక్కింది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ మరియు ప్రొడక్షన్ సంస్థ ఏషియన్ సినిమాస్ ఈ సినిమా థియేట్రికల్ హక్కులను దక్కించుకున్నారు. నైజాంలో సవారి సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ పాటలకు మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాకు క్రేజ్ వచ్చింది. సవారీ చిత్రంలోని పాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. రాహుల్ సిప్లిగంజ్ పాడిన నీ కన్నులు లిరికల్ సాంగ్ 5 మిలియన్ వ్యూస్ దక్కించుకుని.. ఇంకా వ్యూస్ తెస్తూనే ఉంది. దాంతో పాటే ఉండిపోయా పాటకు కూడా అద్భుతమైన స్పందన వస్తుంది. సాహిత్ మోత్కూరి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని కాల్వ నరసింహా స్వామి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సంతోష్ మోత్కూరి, నిశాంక్ రెడ్డి కుడితి సంయుక్తంగా నిర్మించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారు. మీడియా ముందుకు వచ్చి విడుదల తేదీని ఖరారు చేసారు మేకర్స్. ఈ సినిమా 2020, ఫిబ్రవరి 7న విడుదల కానుంది!!

గోల్డెన్ డక్ ప్రొడక్షన్స్ విశ్వక్




అజయ్ కథుర్వర్, డింపుల్ హీరో హీరోయిన్లుగా గోల్డెన్ డక్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వేణు ముల్కల దర్శకత్వంలో తాటికొండ ఆనందం బాలక్రిషన్ నిర్మిస్తోన్న చిత్రం విశ్వక్. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఫస్ట్ లుక్‌లోని పేపర్ కటింగ్స్, వాటిని ఓ బోర్డ్‌కు పిన్ చేసినట్లు ఉండటం.. ఇవన్నీచూస్తుంటే విశ్వక్ ఒక డిఫరెంట్ మూవీ అనే ఆసక్తిని రేవుతుంది.
ప్రపంచ వాణిజ్యాన్ని శాసించే స్టార్టప్ కంపెనీల కథాంశంతో విశ్వక్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇండియాలో ప్రారంభమైన కొన్ని స్టార్టప్ కంపెనీలు, వాటిని స్థాపించిన యువత ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా ఈ సినిమా చూపించ బోతున్నారు. సినిమా షూటింగ్ పూర్తి చేసుకన్న ఈ సినిమా టీజర్‌ను త్వరలోనే విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. స్టైలిష్‌గా, నేటి తరానికి తగ్గట్లు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి సత్యసాగర్ సంగీతం, ప్రదీప్ దేవ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు!!

అన్నపూర్ణమ్మ అండ్ కో



అమరావతి రాజధానిలో వైకుంటపురం అనే అందమైన గ్రామంలో నిర్మించిన చిత్రమే "అన్నపూర్ణమ్మ గారి మనవడు" ఈ నెల 30వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతున్న సందర్భంగా దర్శక,నిర్మాతలు మాట్లాడుతూ.. మంచి కథనంతో సాగే ఈ కథలో ఎన్నో పాత్రలు ప్రవహిస్తుంటాయి, గ్రామంలో ఉండే ప్రతి గడపలో అందరూ పిన్ని, బాబాయ్, అన్నా, తమ్ముడు, అక్కా, చెల్లెల్లు అంటూ ఆప్యాయంగా పిలుచుకున్న సాంప్రదాయాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించారు. కడుపుబ్బా నవ్వించే హాస్యం, యూత్‌ని అలరించే అమృత, ప్రణయ్‌ల ప్రేమకథలో వాస్తవాలతో అన్నపూర్ణమ్మగారి మనవడు అందరినీ అలరిస్తాడు. మా చిత్రానికి యు క్లీన్ సర్టిఫికెట్. ఇచ్చిన సెన్సార్ సభ్యులకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు!!



కీర్తి సురేష్

ఢిల్లీలో హింసను రెచ్చగొట్టింది కాంగ్రెస్, ఆప్‌లే : జవదేకర్

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశ రాజధానిలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలే హింసను ప్రేరేపించాయని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్ ఆరోపించారు. జామియా, సీలంపూర్, జామా మసీదు ప్రాంతాల్లో జరిగిన ఆందోళనలు క్షమార్హం కావని అన్నారు. బుధవారం న్యూఢిల్లీలో మీడియాతో జవదేకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నేత అసిఫ్ ఖాన్, ఆప్ నేత అమనతుల్లాఖాన్ జామియాలో చేసిన ప్రసంగాల్లో బురఖాపై కూడా నిషేధం విధిస్తారంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశారని అన్నారు. సీఏఏ పౌరసత్వం ఇచ్చే చట్టమే కానీ, ఊడలాక్కునే చట్టం కాదని జవదేకర్ స్పష్టం చేశారు. దేశ ప్రజలు చాలా తెలివైన వారనీ, కాంగ్రెస్, ఆప్ కుటిల వ్యూహాలను అర్థం చేసుకుంటున్నారని కేంద్ర మంత్రి అన్నారు.

సీఏఏకు వ్యతిరేకంగా హింసను రెచ్చగొట్టిన ఆ రెండు పార్టీలు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీ సమగ్రాభివృద్ధే బీజేపీ అజెండా అని ఆయన చెబుతూ, మునిసిపల్ కార్పొరేషన్ల అభివృద్ధి పనులకు 'ఆప్' అడ్డు తగులుతోందని ఆరోపించారు. కాలుష్య నియంత్రణకు తాము ఏమి చేసామో అందరికీ తెలుసునని మంత్రి చెబుతూ, వారు చెప్పే అబద్ధాలకు అంతూ పొంతూ లేకుండా పోయిందని ఆప్ సర్కార్‌ను తప్పు పట్టారు. అనధికార కాలనీలను కేంద్రం రెగ్యులరైజ్ చేయడం లేదని ఆప్ అబద్ధాలు చెప్పిందని, ఆ చట్టంపై రాష్ట్రపతితో తాము సంతకం చేయించినప్పటికీ అబద్ధాలు మాత్రం ఆపలేదని కేజ్రీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరితో ఐదు సంవత్సరాల ఆప్ సర్కార్ పదవీ కాలం ముగియనున్నది.

ఆస్ట్రేలియాలో విస్తరిస్తున్న కార్చిచ్చు



ఒకవైపు మంటలు... మరోవైపు సముద్ర తీరాన చిక్కుకున్న పర్యాటకులు

- మంటలతో ప్రభావితమైన న్యూ సౌత్ వేల్స్, విక్టోరియా రాష్ట్రాలు
- పొగ అలముకోవడంతో చీకటిగా మారిన ప్రాంతాలు ముగ్గురు మృతి

కాన్‌బెర్రా : ఆస్ట్రేలియా అడవుల్లో రేగిన కార్చిచ్చు క్రమంగా విస్తరించి అడవులను, గడ్డి మైదానాలను బూడిద చేస్తోంది. ఆ మంటలు క్రమంగా న్యూసౌత్ వేల్స్, విక్టోరియాలోని ఈస్ట్ గిప్స్లాండ్ తదితర ప్రాంతాలకు కూడా వ్యాపించాయి. సోమవారం, మంగళవారం ఈ మంటలు అధికం కావడంతో మంటల్లో చిక్కుకొని ముగ్గురు మృతి చెందినట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే బాటిమన్స్ బేలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మృతులను తండ్రీ కొడుకులుగా గుర్తించారు.


మూడవ వ్యక్తిని న్యూ సౌత్ వేల్స్ దక్షిణ తీరంలో బుధవారం ఉదయం కాలిపోయిన కారులో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇటీవలి కాలంలో న్యూ సౌత్ వేల్స్‌లో మంటలకు చనిపోయిన వారి సంఖ్య 12కు పెరిగింది. కాగా, ఆస్ట్రేలియాలో కొన్ని నెలలుగా అడవులు అగ్నికి ఆహుతి అవుతున్న విషయం తెలిసిందే.

ఈ మంటలు 4 మిలియన్ హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణానికి వ్యాపించాయి. ఈ మంటలు తీవ్రం కావడంతో.. తమ దేశంలో పర్యటిస్తున్న పర్యాటకులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం హెచ్చరించింది. అయితే, మంటలు వేగంగా న్యూ సౌత్ వేల్స్, విక్టోరియా రాష్ట్రాలకు వ్యాపించడంతో ఆ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సుమారు 4 వేల మంది పర్యాటకులు సమీపంలోని బీచ్‌లకు ఉరుకులు, పరుగులతో చేరుకున్నారు. కొత్త సంవత్సరాన్ని వేడుకగా



జరుపుకోవాలనుకున్న ఆ పర్యాటకులు బిక్కుబిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక వైపు సముద్ర కెరటాలు, మరో వైపు విస్తరిస్తున్న మంటల మధ్య పర్యాటకులు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంటల ప్రభావంతో దట్టంగా పొగలు వ్యాపించడంతో..ఆ ప్రాంతాలు చీకటిగా మారాయి. దీంతో సహాయక చర్యలు తీసుకోవడానికి ఇబ్బందిగా మారింది. అయినా అగ్నిమాపక సిబ్బంది మంటల నార్పడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారని స్థానిక అధికారులు చెబుతున్నారు.

దేశానికి చరిత్రాత్మక ఘట్టం : అమిత్ షా



న్యూఢిల్లీ : చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)ను నియమించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని, దీనిని ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చారని, ఇది అత్యంత మహత్తరమైన, చరిత్రాత్మకమైన రోజు అని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. బుధవారం ఆయన ఇచ్చిన ట్వీట్లలో త్రివిధ దళాలు సమష్టిగా పని చేస్తాయని, భారతదేశాన్ని దృఢంగా కాపాడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సీడీఎస్ నియామకం నవ భారత ఆకాంక్షలను నెరవేర్చడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. 'పీఎం నరేంద్ర మోడీసీ మరొక దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చారు. భారతదేశానికి మొట్టమొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ వచ్చారు. ఇది భారతదేశానికి అత్యంత మహత్తరమైన, చరిత్రాత్మక రోజు. ప్రపంచంలో అత్యుత్తమ రక్షణ దళాల్లో ఒకటిగా ఉండాలన్న భారతదేశపు దృఢ నిశ్చయాన్ని ఈ నిర్ణయం మరింత బలోపేతం చేస్తుందన్న నమ్మకం నాకు ఉంది' అని అమిత్ షా పేర్కొన్నారు. 'భారతదేశపు మొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ బిపిన్ రావత్‌ను అభినందిస్తున్నాను. ఆయన నాయకత్వంలో త్రివిధ దళాలు సమష్టిగా ఓ జట్టుగా పని చేస్తాయని, అన్ని వైపరీత్యాల నుంచి మన దేశాన్ని కాపాడటానికి ఏ అవకాశాన్నీ వదిలిపెట్టవని విశ్వసిస్తున్నాను' అని మరొక ట్వీట్‌లో పేర్కొన్నారు. 'భారత సాయుధ దళాలలోని మూడు విభాగాల సిబ్బంది సంక్షేమం, మన సైన్యం ఆధునికీకరణ, నవ భారతం పట్ల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం మోడీ ప్రభుత్వం చేస్తున్న కృషిని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ మరింత ముందుకు తీసుకువెళతారు' అని మూడో ట్వీట్‌లో అమిత్ షా పేర్కొన్నారు. సీడీఎస్‌గా జనరల్ బిపిన్ రావత్ నియుక్తుడైన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

కేంద్రం కొత్త సంవత్సరం కానుక ఇదే : సిద్ధరామయ్య



బెంగళూరు : రైల్వే చార్జీలు పెంచుతూ భారతీయ రైల్వే నిర్ణయం తీసుకోవడంపై కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రైల్వే చార్జీలు పెంచడమే సామాన్య ప్రజలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన నూతన సంవత్సర కానుక అంటూ ట్విటర్ వేదికగా ఎద్దేవా చేశారు. రవాణాకు భారతీయ రైల్వే వెన్నెముక వంటిదనీ, చార్జీలు పెంచుతూ తీసుకున్న తాజా నిర్ణయం దేశ అభివృద్ధికి ప్రతిబంధకం కాగలదని ఆయన పేర్కొన్నారు. దీని బదులు మన రాజ్యాంగ విలువలను కాపాడి ఈ ప్రభుత్వం మనకు కానుకగా ఇస్తే బాగుండేది అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. జనవరి 1 నుంచి రైల్వే చార్జీలు పెంచుతున్నట్టు వచ్చిన ఓ కథనాన్ని ఆయన ఈ పోస్టుకు జత చేశారు.

ప్రియాంక ఓ నకిలీ గాంధీ

- కాషాయాన్ని ప్రియాంక అర్థం చేసుకోలేరు
- ఆమె తన పేరు మార్చుకోవాలి
- చౌకబారు విమర్శలు మానుకోవాలి
- కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి

న్యూఢిల్లీ : కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీపై కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి నిప్పులు చెరిగారు. ప్రియాంక ఓ నకిలీ గాంధీ అని, ఈ గాంధీలు కాషాయాన్ని అర్థం చేసుకోలేరని అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన పేరు నుంచి గాంధీని తొలగించుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, కాషాయం ధరించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రజలపై ప్రతీకారం తీర్చుకుంటామని చెప్పడం భావ్యం కాదని అన్నారు. కాషాయమంటే మత సామరస్యానికి, ఆధ్యాత్మికతకు, హిందూ ధర్మానికి ప్రతీక అని, అది ఆయన వ్యక్తిగతం కాదని ప్రియాంక పేర్కొన్నారు. కాషాయం ధరించిన యోగి నియమాలు పాటించాల్సిందేనన్నారు. అవన్నీ పక్కన పెట్టేసి ప్రతీకారం తీర్చుకుంటానని అనడం సరి కాదని ప్రియాంక అన్నారు. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన సాధ్వి నిరంజన్ జ్యోతి మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. కాషాయాన్ని ప్రియాంక అర్థం చేసుకోలేరని, ఎందుకంటే ఆమె నకిలీ గాంధీ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నేరస్థులపై చర్యలు తీసుకుంటుంటే ప్రియాంకకు సమస్యలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. అందుకనే ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు.



ప్రియాంక గాంధీ జరిమానాను నేనే చెల్లిస్తా : స్కూటర్ యజమాని

- హెల్మెట్ లేకుండా స్కూటర్‌పై వెళ్లిన ప్రియాంక
- రూ. 6,300 జరిమానా విధించిన పోలీసులు
- ప్రియాంక కోసం తన వాహనాన్ని ఇచ్చానన్న స్కూటర్ యజమాని

లక్నో : ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘిస్తూ, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనంపై వెళ్లిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీకి ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నో పోలీసులు రూ. 6300 జరిమానా విధించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు చలానాలను సదరు స్కూటర్ యజమానికి పోలీసులు పంపించారు. ఈ నేపథ్యంలో, ఆ జరిమానాను తానే చెల్లిస్తానని స్కూటర్ యజమాని రాజ్ దీప్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ దీప్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ, డిసెంబర్ 28న తాను స్కూటర్‌పై వెళుతున్నప్పుడు ప్రియాంకా గాంధీతో పాటు మరో కాంగ్రెస్ నేత ధీరజ్ గుర్జార్‌ను చూశానని చెప్పారు. తన స్కూటర్ కావాలని ధీరజ్ అడిగారని, ప్రియాంక కోసం తన వాహనాన్ని ఇవ్వకుండా ఉండలేక పోయానని తెలిపారు. చలానా విధించినట్టు డిసెంబర్ 29న మీడియా ద్వారా తాను తెలుసుకున్నానని చెప్పారు. ఈ మొత్తాన్ని తానే చెల్లిస్తానని, ప్రియాంక నుంచి కానీ, కాంగ్రెస్ పార్టీ నుంచి కానీ ఈ మొత్తాన్ని తీసుకోనని చెప్పారు.

గర్ల్ ఫ్రెండ్‌కు గన్‌ను చూపిస్తూ, తనకు తాను పేల్చేసుకున్న ఢిల్లీ యువకుడు

న్యూఢిల్లీ ! తన వద్ద ఉన్న గన్‌ను స్నేహితురాలికి చూపిస్తున్న క్రమంలో పొరపాటున తనను తాను పేల్చేసుకున్న 25 ఏళ్ల యువకుడు ఆసుపత్రి పాలయ్యాడు. ఈ ఘటన న్యూఢిల్లీ పరిధిలోని తిలక్ నగర్‌లో జరిగింది. పోలీసులు వెల్లడించిన మరిన్ని వివరాల ప్రకారం, కాక్రోలా నివాసి అయిన సోనూ శర్మ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆసుపత్రికి తుపాకి గాయంతో తన స్నేహితురాలు మేఘతో కలసి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తి తనను కాల్చాడని వైద్యులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆపై పోలీసుల విచారణలో మద్యం మత్తులో ఉన్న సోనూ శర్మ తనకు గన్‌ను చూపిస్తూ పొరపాటున ట్రిగ్గర్ నొక్కాడని మేఘ పోలీసులకు వెల్లడించింది. ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగిందని, అది దేశవాళీ తుపాకి అని, మేఘా స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి, కేసు విచారిస్తున్నామని తెలిపారు.

థాక్రేపై పోస్ట్ : ఇంక్ చల్లిన మహిళ



ముంబయి : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రేను విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వ్యక్తిపై శివసేన మహిళా కార్యకర్త ఇంక్ చల్లిన ఘటన బీడ్ జిల్లాలో వెలుగు చూసింది. ఉద్ధవ్ థాక్రేను ఉద్దేశించి ఆ వ్యక్తి పనికిరాని, విధ్వంసకారుడు అనే పదాలను ఫేస్‌బుక్‌లో వాడారు. కాగా, ఫేస్‌బుక్‌లో థాక్రేపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గత వారం ఓ ముంబయి వ్యక్తిపై కొందరు శివసేన కార్యకర్తలు భౌతిక దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. శివసేన- ఎన్సీపీ- కాంగ్రెస్ కూటమి ప్రభుత్వ సారథిగా ఉద్ధవ్ థాక్రే నవంబర్ 28న మహారాష్ట్ర సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

భీమా కోరెగావ్ వార్షికోత్సవానికి ఐదు లక్షల మంది దళితులు



పుణే: భీమా కోరెగావ్ యుద్ధానికి బుధవారంతో 202 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా యుద్ధం జరిగిన స్థలంలో ఏర్పాటు చేసిన విజయ స్తూపం వద్ద అమర వీరులకు నివాళులు అర్పించేందుకు భారీ సంఖ్యలో దళితులు తరలివచ్చారు. పుణెలోని పెర్నే గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ అమర వీరుల స్తూపం వద్దకు ఇవాళ దాదాపు ఐదు లక్షల మందికి పైగా దళితులు తరలి వచ్చినట్టుగా తెలుస్తోంది. రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ ఘర్షణలు చోటు చేసుకోవడంతో ఈసారి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. భీమా కోరేగావ్ సహా పుణె జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ఈ ప్రాంతంలో స్కూళ్లు, కాలేజీలు బుధవారం సెలవు ప్రకటించడంతో పాటు దుకాణాలను సైతం మూసివేయించారు. గత ఏడాది భీమా కోరేగావ్ వార్షికోత్సవానికి పది లక్షల మంది వరకు వచ్చినట్టు అంచనా. కాగా, బుధవారం ఉదయం ఎన్సీపీ నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భీమా కోరేగావ్‌ను సందర్శించి విజయ స్తూపం వద్ద నివాళులు అర్పించారు. భీమా కోరేగావ్ యుద్ధం 1818 జనవరి 1న జరిగింది. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యానికి చెందిన మహర్ రెజిమెంట్‌కు, అగ్ర కులస్థులైన పీష్వాలకు మధ్య జరిగిన యుద్ధం అది. పుణె దగ్గరలోని కోరేగావ్‌లో భీమా నది ఒడ్డున జరగడంతో ఆ పేరు వచ్చింది. ఈస్ట్ ఇండియా కంపెనీలోని సైన్యంలో ఎక్కువ మంది దళితులే ఉండేవారు. బ్రిటిషర్లపై బాజీరావ్ పీష్వా పోరాటంలో తమను కలుపుకోవాలన్న మహర్ల విజ్ఞప్తిని ఆయన తిరస్కరించాడని, దీంతో వారు బ్రిటిష్ సైన్యంలో చేరారని చెబుతారు. దీంతో వాస్తవానికి ఇది బాజీరావు పీష్వా-2 సైన్యంపై బ్రిటీష్ వారు సాధించిన విజయమైనప్పటికీ కుల వివక్షపై దళితులు సాధించిన విజయంగా కూడా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ యుద్ధంలో మరణించిన వారి స్మారకార్థం బ్రిటిష్ వారు 'విజయ స్తూపం' ఏర్పాటు చేశారు. 2018లో భీమా కోరేగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా లక్ష మందికి పైగా దళితులు తరలివచ్చారు. విజయ స్తూపం వద్దకు చేరుకున్న వారిపై రాళ్ల వర్షం కురవడంతో కులాంతర చిచ్చు చెలరేగింది. కాషాయ జెండాలతో వచ్చిన రైట్ వింగ్ సంస్థలే ఈ రాళ్ల దాడికి పాల్పడ్డాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా ఈ దాడిలో ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారు.

సీఏఏను వ్యతిరేకిస్తున్న రాష్ట్రాలకు షాక్ ఇవ్వనున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టాన్ని కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తమ రాష్ట్రంలో ఆ చట్టాన్ని అమలు చేయబోమని ఇప్పటికే కొందరు ముఖ్యమంత్రులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, చట్టం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు చెక్ పెట్టే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా పౌరసత్వం కల్పించాలని భావిస్తోంది. జిల్లా కలెక్టర్ ద్వారా పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోవాలనే నిర్ణయాన్ని వెనుకకు తీసుకుంటున్నట్టు కేంద్ర హోమ్ శాఖకు చెందిన విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ విధానానికి బదులుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని తీసుకురానున్నట్టు చెప్పాయి. కొత్త విధానం ద్వారా సీఏఏను ఎలాంటి ఆటంకాలూ లేకుండా అమలు చేయవచ్చని తెలిపాయి. సీఏఏ ద్వారా 2014 డిసెంబర్ 31కు ముందు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ ల నుంచి వచ్చిన హిందూ, సిక్కు, జైన్, పార్సీ, బుద్దిస్ట్, క్రిస్టియన్ శరణార్థులకు మన దేశ పౌరసత్వం లభిస్తుంది.

కర్నాటక సీఎం కాన్వాయ్‌లో కారు బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

డివైడర్‌ను, అటు వైపు రోడ్డుపై వెళుతున్న వ్యాన్‌ను ఢీకొట్టిన వాహనం



బెంగళూరు : కర్నాటక ముఖ్యమంత్రి యడియూరప్ప కాన్వాయ్‌లోని ఇన్నోవా కారు బోల్తా కొట్టిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరి ఇద్దరు గాయపడ్డారు. కాన్వాయ్ యశవంతపుర ఫ్లై ఓవర్‌పై వెళుతెండగా అతివేగంతో బోల్తా కొట్టింది. అనంతరం డివైడర్‌ను ఢీకొట్టి అటు వైపు రోడ్డుకు వెళ్లి ఆ రోడ్డులో ప్రయాణిస్తున్న ఆటోను, అనంతరం వ్యాన్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. అదృష్టవశాత్తు భారీ ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... మంగళవారం ఉదయం యడియూరప్ప తుమకూరు బయలుదేరారు. ఆయన వెంట సీఎం కార్యదర్శి సెల్వకుమార్ కూడా బయలుదేరారు. కార్యదర్శితో మాట్లాడాల్సి ఉండడంతో సీఎం ఆయనను తన కారులో కూర్చోబెట్టుకున్నారు. దీంతో సెల్వకుమార్ కారు ఖాళీగా కాన్వాయ్‌లో ప్రయాణిస్తోంది. ఫ్లై ఓవర్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగింది. ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో డ్రైవర్ వినయ్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన కారణంగా ఫ్లై ఓవర్‌పై అర గంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాదం అనంతరం సీఎం యథావిధిగా తుమకూరు వెళ్లిపోయారు.


ఆ అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంది...

రాష్ట్ర అసెంబ్లీలకు లేదు

కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలంటూ కేరళ అసెంబ్లీ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, పౌరసత్వానికి సంబంధించి చట్టాలు చేసే ఎలాంటి అధికారమూ రాష్ట్ర శాసన వ్యవస్థకు లేదని స్పష్టం చేశారు. కేవలం పార్లమెంట్‌కు దీనిపై చట్టాలు చేసే అధికారం ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంపై న్యాయ సలహాను తీసుకోవాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సూచించారు. సీఏఏకు సంబంధించి కేరళ అసెంబ్లీ ఒకరోజు ప్రత్యే కంగా సమావేశమైంది.

చట్టానికి వ్యతిరేకంగా అసెం బ్లీ తీర్మానాన్ని ఆమోదించడానికి ముందు సభలో విజయన్ మాట్లాడుతూ ఆరెస్సెస్ పై విమర్శలు గుప్పించారు. పౌరసత్వ చట్టం ఆరెస్సెస్ అజెండాలో భాగమని అన్నారు. ముస్లింలను అంతర్గత శత్రువులు గా ఆరెస్సెస్ భావిస్తోందని చెప్పారు.




మధ్య ప్రదేశ్‌లో విషాదం

లిఫ్ట్ కూలి ఆరుగురి దుర్మరణం

ఇండోర్ : మధ్య ప్రదేశ్‌లో విషాదం జరిగింది. ఓ భవనానికి ఏర్పాటు చేసిన తాత్కాలిక లిఫ్ట్ కూలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇండోర్‌లోని పాటల్‌పానీలో జరిగిందీ దుర్ఘటన. సమాచారం అందుకున్న వెంటనే ఘటప స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. ఇండోర్‌కు 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న మహూలోని ఓ ఫామ్ హౌస్‌లో ఈ ఘటన జరిగినట్టు తెలిపారు. మృతుల్లో వ్యాపారి పునీత్ అగర్వాల్ (53), ఆయన కుమార్తె పలక్ (27)తో ఆయన కుటుంబ సభ్యులు మరి నలుగురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

నేవీ బాటలోనే అమెరికా ఆర్మీ



వాషింగ్టన్ : ప్రపంచవ్యాప్తంగా ఎంతో పాపులర్ అయిన వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్ విషయంలో అమెరికా అతిజాగ్రత్తలు తీసుకుంటోంది. టిక్‌టాక్ మాతృ సంస్థ చైనాకు చెందినది కావడంతో ఈ విషయంలో అమెరికా చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. టిక్‌టాక్ అడ్డుపెట్టుకొని తమ సైనికులకు చైనా వల వేసే అవకాశాలు ఉన్నాయనేది అమెరికా వాదన. కావున తమ సైనికులు ఎవరూ తమ అధికారిక మొబైల్ ఫోన్లలో టిక్‌టాక్ ఉపయోగించరాదని అమెరికా నేవీ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో అమెరికా ఆర్మీ కూడా ఇవే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆర్మీ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ఆర్మీ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రాబిన్ ఒచోవా వెల్లడించారు. టిక్‌టాక్‌ను ఓ సైబర్ థ్రెట్‌గా ఆమె అభివర్ణించారు. డిసెంబర్ నుంచే తాము సైనికులకు హెచ్చరికలు చేస్తూ వస్తున్నామని ఆమె తెలిపారు. టిక్‌టాక్ ద్వారా చైనా తమ సైనికుల వ్యక్తిగత విషయాలను తెలుసుకొని, దేశద్రోహం చేసే విధంగా వారిని బెదిరింపులకు గురి చేసే అవకాశం ఉందని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. అయితే, ఆది నుంచీ తమపై వస్తున్న ఆరోపణలను టిక్‌టాక్ మాతృ సంస్థ బైట్‌డ్యాన్స్ ఖండిస్తూనే వస్తోంది. కావాలంటే టిక్‌టాక్ యాజమాన్యాన్ని విదేశీ కంపెనీలకు అమ్మడానికి కూడా సిద్ధమని ప్రకటించింది. కానీ అమెరికా మాత్రం ఈ విషయంలో వెనుకకు తగ్గడం లేదు.

యువతి చేష్టతో

పోప్‌కు ఆగ్రహం



వాటికన్ సిటీ : నూతన సంవత్సరం సందర్భంగా వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ఓ ఘటన ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ ప్రజలకు శుశాకాంక్షలు తెలుపారు. ఆ తరువాత ఆయన తిరిగి వెళుతుండగా అక్కడే ఉన్న ఓ భక్తురాలు పోప్ చేయిపట్టి ఆయనను వెనుకకు లాగింది. దీంతో పోప్ ఓ పక్కకు తూలారు. యువతి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన పోప్ తన చేయి విడిపించుకునే క్రమంలో ఆమె చేయిపై గట్టిగా తట్టారు. తన చేయి విడిపించుకుని ముందుకు కదలిపోయారు. అయితే, ఇందుకు సంబంధించిన వీడియో బాగా వైరల్ అయిపోయింది. దీనిపై పోప్ వివరణ ఇచ్చారు. సహనం నశించడంతోనే అలా చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. 'మనం అందరం ఏదో ఒక సందర్భంగా సహనం కోల్పోతాం. అప్పుడు నాకూ అలాగే జరిగింది. అయితే ఇలా చేసినందుకు నేను క్షమాపణలు కోరుతున్నాను' అని పోప్ వ్యాఖ్యానించారు. అయితే, నెటిజన్లు మాత్రం పోప్ పరిస్థితిపై సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన కూడా మనిషే అంటూ పోప్‌కు బాసటగా నిలిచారు.

ఆడే సత్తా నాలో ఉంది : షరపోవా



బ్రిస్బేన్ : మాజీ ప్రపంచ నంబర్‌వన్ మరియా షరపోవా తనలో ఇంకా టెన్నిస్ ఆడే సత్తా ఉందని చెప్పింది. ఈనెల 6 నుంచి బ్రిస్బేన్‌లో జరిగే ఈ టోర్నీలో మాజీ విజేత అయిన షరపోవాకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చారు. ఈ రష్యా స్టార్ 2015లో ఇక్కడ టైటిల్ గెలిచింది. ఏటా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీకి ముందు సన్నాహక టోర్నీగా ఈ ఈవెంట్ జరుగుతుంది. ఇందులో పాల్గొంటానని చెప్పిన 32 ఏళ్ల షరపోవా కెరీర్ తొలి నాళ్లలో 30 దాటాక కూడా ఆడతానని ఎప్పుడు అనుకోలేదని తెలిపింది. 'కానీ నాలో ఆట మిగిలుంది. నా రాకెట్‌తో దూసుకెళ్లే సత్తా కూడా ఉంది. నేనిక్కడ ఎవరికైనా మేటి ప్రత్యర్థినే' అని రష్యా స్టార్ వివరించింది. గత సీజన్ క్లిష్టంగా గడిచిన తనకు ఇది తాజా ఆరంభమని చెప్పుకొచ్చింది. ఆగస్టులో జరిగిన యూఎస్ ఓపెన్‌లో సెరెనాతో తొలి రౌండ్లో ఓడిపోయాక షరపోవా మళ్లీ బరిలోకి దిగలేదు. దీంతో డబ్ల్యూటీఏ ర్యాంకుల్లో ఆమె 133వ ర్యాంకుకు పడిపోయింది. బ్రిస్బేన్ ఈవెంట్‌లో ఆమెతో పాటు నయోమి ఒసాకా, యాష్లే బార్టీ, ప్లిస్కోవా, ఎలీనా స్వితోలినా, క్విటోవా, కికి బెర్టెన్స్ తదితర స్టార్ క్రీడాకారిణులు పాల్గొంటున్నారు.

నటాషాతో పాండ్యా ఎంగేజ్‌మెంట్



ముంబై : టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన ప్రియురాలు, సెర్బియా మోడల్ నటాషాతో పెళ్లికి సిద్ధమయ్యాడు. నూతన సంవత్సరం తొలిరోజే తన ప్రేయసి వేలికి ఉంగరం తొడిగి నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. ఎంగేజ్‌మెంట్ రింగ్‌తో ఫొటోలకు ఫోజులిస్తున్న నటాషాను హత్తుకున్న ఫొటోను షేర్ చేసిన హార్దిక్... 'నేను నీ వాడిని. నువ్వు నా దానివి ప్రియా' అంటూ పాట రూపంలో తమ ఎంగేజ్‌మెంట్ ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశాడు. ఇక నటాషా సైతం హార్దిక్ తనకు రింగ్‌తో ప్రపోజ్ చేస్తున్న వీడియోను పోస్ట్ చేసి.. 'ఎల్లప్పుడూ అవుననే చెబుతాను' అంటూ క్యాప్షన్ జతచేశారు. దీని ప్రకారం ఈ ప్రేమ జంట సముద్రంలో నిశ్చితార్థం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హార్దిక్- నటాషా జంటకు లక్షల్లో లైకులు వచ్చిపడుతున్నాయి. క్షణాల్లోనే హార్దిక్ పాండ్యా పోస్టు వైరల్‌గా మారింది. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి సహా పలువురు టీమిండియా క్రికెటర్లు హార్దిక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా గతంలో చాలామంది అమ్మాయిలతో హార్దిక్ డేటింగ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే నటాషాతో మాత్రం పీకల్లోతు ప్రేమలో మునిగిపోయాడని.. తనతో వివాహ బంధానికి సిద్ధమయ్యాడంటూ అతడి సన్నిహితులు చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతం హార్దిక్.. ఎంగేజ్‌మెంట్‌తో నూతన సంవత్సరాన్ని ప్రారంభించి మధురానుభూతులను సొంతం చేసుకున్నాడు. ఇక నటాషా విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె ముంబైలో నివాసముంటున్నారు. ఐటం గర్ల్‌గా తొలుత బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన నటాషా.. షారుక్ ఖాన్, అనుష్క నటించిన 'జీరో' సినిమాలో ఓ పాత్ర కూడా పోషించారు. అదే విధంగా... హిందీలో ప్రసారమవుతున్న డ్యాన్స్ రియాలిటీ టీవీ షో 'నచ్ బలియే'లోనూ పోటీపడ్డారు. ఆ సమయంలో నటాషాకు ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా హార్దిక్ గతంలో విజ్ఞప్తి చేసిన విషయం అతడి అభిమానులకు గుర్తుండే ఉంటుంది. ఇక నటాషాను హార్దిక్ గతంలోనే తన కుటుంబ సభ్యులకు పరిచయం చేశాడని.. వీరి ప్రేమకు వారు అంగీకారం తెలిపారంటూ వార్తలు చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే. కాగా గాయంతో జట్టుకు దూరమైన పాండ్యా ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నాడు.

కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండండి



న్యూఢిల్లీ : టీమిండియా ప్రధాన కోచ్ రవిశా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడమే ఆలస్యం ఆడేసుకోవడానికి నెటిజన్లు.. సెటైర్లు వేద్దామని అతడి హేటర్స్.. ఫన్నీగా స్పందించాలని మాజీ క్రికెటర్లు ఎదురు చూస్తుంటారు. అయితే ఏది ఏమైనా రవిశాకి సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఏర్పడిన మాట వాస్తవం. ప్రస్తుతం న్యూఇయర్ సెలబ్రేషన్స్‌లో రవిశా మునిగితేలుతున్నాడు. ఈ సందర్భంగా అతడు బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్, నటి రవీనా టాండన్, వ్యాపారవేత్త గౌతమ్ సింగానియాలతో కలిసి దిగిన ఫొటోను షేర్ చేశాడు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అయితే ఈ ఫొటోకు కొందరు ఫన్నీగా కామెంట్ చేస్తుండగా.. మరికొంత మంది రవిశాకి న్యూఇయర్ విషెస్ తెలుపుతున్నారు. ఇక ఇంగ్లండ్ మాజీ సారథి మైకేల్ వాన్ సైతం రవిశా షేర్ చేసిన ఫొటోకు లైక్ కొట్టి న్యూఇయర్ విషెస్ తెలిపాడు. ఇక అంతకుముందు టీమిండియా క్రికెటర్లకు రవిశా ఇంగ్లీష్ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపాడు. 2019లో అద్భుతంగా రాణించారని, అదేవిధంగా 2020లో వచ్చే సరికొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండాలని సూచించాడు. విరామ సమయాన్ని ఎంజాయ్ చేయండి, 2020లో కలుద్దామంటూ ట్వీట్ చేశాడు. ఇక ఐసీసీ వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమి మినహా మిగతా అన్ని సిరీస్‌ల్లోనూ కోహ్లి సేన అదరగొట్టింది. ఇక రానున్న ఏడాదిలో టీమిండియాకు అతిపెద్ద సవాల్ టీ20 ప్రపంచకప్ రూపంలో ఎదురుకానుంది. అంతేకాకుండా ఐసీసీ టెస్టు చాంపియన్ షిప్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్ సిరీస్ ముగిశాక టీమిండియా క్రికెటర్లకు స్వల్ప విరామం లభించింది. దీంతో ఈ గ్యాప్‌లో క్రికెటర్లు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. ఇక మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జనవరి 5న శ్రీలంకతో టీమిండియా తొలి టీ20 ఆడనుంది.

ఇప్పటికీ....

టీ20 కెప్టెన్ ధోనీనే

- టెస్టులు, వన్డే ఫార్మాట్ సారథి విషయంలో కోహ్లీకి ఛాన్స్
- తమ జట్టును ప్రకటించిన క్రిక్ ఇన్ఫో



న్యూఢిల్లీ : యావత్ క్రికెట్ ప్రపంచం టీమిండియా పరుగుల యంత్రం విరాట్ కోహ్లి నామస్మరణతో మునిగితేలుతుండటంతో ఎంఎస్ ధోని ప్రాశస్త్యం రోజు రోజుకి తగ్గిపోతుందని అతడి ఫ్యాన్స్ నిరాశకు గురవుతున్నారు. అయితే అతడు సాధించిన విజయాలు, ఘనతలను వెలికి తీస్తూ ఈ దశాబ్దపు అత్యుత్తమ ఆటగాళ్ల జాబితాలను మాజీ క్రికెటర్లు, పలు సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ఈ దశాబ్దపు ఆస్ట్రేలియా వన్డే కెప్టెన్‌గా ధోనిని ఎంపిక చేస్తూ క్రికెట్ ఆస్ట్రేలియా ఆసక్తికర నిర్ణయాన్ని ప్రకటించింది. దీనిపై జార్ఖండ్ డైనమైట్ ఫ్యాన్స్ అమితానందం వ్యక్తం చేశా రు. తాజాగా వారికి మరింత జోరు కలిగించే వార్త ప్రముఖ క్రీడా ప్రసార సంస్థ ఈఎస్‌పీఎన్ తెలిపింది.

ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో ప్రకటించిన ఈ దశాబ్దపు వన్డే, టీ20 జట్లకు సారథిగా ఎంఎస్ ధోనిని ఎంపిక చేసింది. అయితే టెస్టు జట్టుకు సారథిగా విరాట్ కోహ్లి వైపే మొగ్గు చూపింది. 23 మంది సభ్యులతో కూడిన ప్యానెల్ పలు అంశాలను పరిగణలోకి తీసుకుని టెస్టు, వన్డే, టీ20 జట్లను ప్రకటించినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ దశాబ్దంలో ఆరేళ్లకు పైగా ఆడి ఉండి లేక కనీసం 50 టెస్టులైనా ఆడిన ఆటగాళ్ల ప్రదర్శనను పరిగణలోకి తీసుకుని టెస్టు జట్టును ప్రకటించినట్టు ఈఎస్‌పీఎన్ తెలిపింది. అదేవిధంగా కనీసం 75 వన్డేలు, 100 టీ20 మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల రికార్డులను దృష్టిలో ఉంచుకుని ఆటగాళ్లను ఎంపిక చేసినట్లు వివరించింది. ఇక టెస్టు జట్టులో కోహ్లితో పాటు టీమిండియాకు చెందిన మరో ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ మాత్రమే చోటు దక్కించుకున్నాడు. ఇక వీరితో పాటు ఇంగ్లండ్ మాజీ ఓపెనర్ అలిస్టర్ కుక్, న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్‌లు టెస్టు జట్టులో ఉన్నారు. వన్డేల్లో ధోని, కోహ్లిలతో పాటు రోహిత్ శర్మకు అవకాశం దక్కింది. టీ20 ఫార్మట్ విషయానికొస్తే వెస్టిండీస్ ఆటగాళ్ల ఆధిపత్యమే కొనసాగుతోంది. ఏకంగా ఐదుగురు కరీబియన్ ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్, డ్వేన్ బ్రేవో, సునీల్ నరైన్, పొలార్డ్‌లతో పాటు ఆండ్రీ రసెల్‌లు టీ20 జట్టులో ఉన్నారు. ఇక టీమిండియా నుంచి ధోనితో పాటు కోహ్లి, జస్ప్రిత్ బుమ్రాలు అవకాశం దక్కించుకున్నారు. మహిళల క్రికెట్ విషయానికి వస్తే మిథాలీ రాజ్, జులాన్ గోస్వామిలు ఇద్దరు వన్డే, టీ20 జట్టులో చోటు దక్కించుకోగా.. ఈ రెండు ఫార్మట్లకు ఆసీస్ క్రికెటర్ మెగ్ లాన్నింగ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

రికీ పాంటింగ్ దశాబ్దపు టెస్టు జట్టు

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఈ దశాబ్దపు టెస్టు జట్టును ప్రకటించాడు. దీంట్లో భారత్ నుంచి విరాట్ కోహ్లి మాత్రమే చోటిచ్చాడు. విరాట్‌నే తన జట్టు కెప్టెన్‌గా కూడా ఎన్నుకున్నాడు. ఇక ఈ జట్టులో అత్యధికంగా నలుగురు ఇంగ్లండ్ ఆటగాళ్లుండగా ఆసీస్ నుంచి ముగ్గురున్నారు. అయితే వికెట్ కీపర్‌గా ఎన్నో ఘనతలు తన పేరిట లిఖించుకున్న ఎంఎస్ ధోనీని కాకుండా కుమార సంగక్కరను తీసుకోవడం గమనార్హం. ఓపెనర్లుగా డేవిడ్ వార్నర్, అలిస్టర్ కుక్ ఉన్నారు. పేస్ విభాగంలో ఇంగ్లండ్ బౌలర్లు అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్‌లు ఉండగా, దక్షిణాఫ్రికా నుంచి డేల్ స్టెయిన్‌కు కూడా అవకాశం కల్పించాడు. ఇదే

పాంటింగ్ టెస్టు జట్టు : డేవిడ్ వార్నర్, అలెస్టర్ కుక్, కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్, విరాట్ కోహ్లి (కెప్టెన్), సంగర్కర (కీపర్), బెన్ స్టోక్స్, డేల్ స్టెయిన్, నాథన్ లియాన్, స్టువర్ట్ బ్రాడ్, అండర్సన్.

నా తండ్రి కంటే నాకు ఏది ఎక్కువ కాదు : స్టోక్స్



లండన్ : '2019 ఏడాది నాకు ఎన్నో మధురానుభూతులు మిగిల్చాయి. కానీ నా తండ్రి ఏడాది చివర్లో అనారోగ్యానికి గురవ్వడంతో ఈ ఏడాదిని అదే సంతోషంతో ముగించలేకపోతున్నానంటూ' ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ భావోద్వేగంతో పేర్కొన్నాడు. వివరాల్లోకి వెళితే.. నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడడానికి ఇంగ్లండ్ జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో డిసెంబర్ 23న స్టోక్స్ తండ్రి గేడ్ అనారోగ్యంతో జోహన్నెస్ బర్గ్‌లోని ఆసుపత్రిలో చేరారు. అదే సమయంలో డిసెంబర్ 26న బాక్సింగ్‌డే సందర్భంగా దక్షిణాఫ్రికాతో మొదటి టెస్టు మ్యాచ్ ఉండడంతో స్టోక్స్ తన తండ్రిని చూడడానికి వెళ్లలేదు. అయితే డిసెంబర్ 29న అతని తండ్రి జేడ్‌ను ఐసీయు నుంచి బయటికి తీసుకువచ్చారని తెలుసుకున్న స్టోక్స్ ఆ సమయంలో తన తండ్రి దగ్గర ఉండుంటే బాగుండేదని బాధను వ్యక్తం చేశాడు.

'నా తండ్రి అనారోగ్యానికి గురవడంతో.. ప్రపంచకప్ సాధించిపెట్టిన కీర్తి ప్రతిష్టలు, బీబీసీ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకోవడం కంటే తన తండ్రి ఆరోగ్యం 100శాతం మెరుగవడమే గొప్పగా భావిస్తానని' స్టోక్స్ ఒక పత్రికలో పేర్కొన్నాడు.అందుకే 2019 ఎన్నో మంచి అనుభూతులను ఇచ్చినా చివర్లో తన తండ్రి అనారోగ్యం పాలవడం జీర్ణించుకోలేకపోతున్నాని చెప్పుకొచ్చాడు.

ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు 2019 ఏడాది అద్భుతంగా గడిచిందనే చెప్పాలి. ఎందుకంటే 2019లో జరిగిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌ను విశ్వవిజేతగా నిలపడంలో స్టోక్స్ కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ప్రపంచకప్ ఫైనల్లో స్టోక్స్ ఆడిన ఇన్నింగ్స్‌ను ఎవరు అంత తేలికగా మరిచిపోలేరు. తమ జట్టులో బెన్ స్టోక్స్ లాంటి నిఖార్సైన ఆల్‌రౌండర్ ఉంటే బాగుంటుందని క్రికెట్ ప్రపంచంలోని ప్రతీ జట్టు కోరుకోవడం విశేషం. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఈ దశాబ్దంలోనే బెన్ స్టోక్స్ ఒక గొప్ప ఆల్‌రౌండర్ అంటూ కితాబివ్వడం విశేషం. పాంటింగ్ తాజాగా ప్రకటించిన దశాబ్దపు అత్యుత్తమ టెస్టు జట్టులో బెన్ స్టోక్స్ ఆల్‌రౌండర్ జాబితాలో చోటు సంపాదించాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా సెంచూరియన్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికా 107 పరుగులతో విజయం సాధించి నాలుగు టెస్టుమ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కాగా రెండో టెస్టు జనవరి 3 నుంచి కేప్‌టౌన్‌లో ప్రారంభం కానుంది.

'ఐసీసీ ప్రతిపాదన నచ్చలేదు.. అందుకే వ్యతిరేకిస్తున్నా'

మెల్బోర్న్ : ఐసీసీ ప్రతిపాదించిన నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లను తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ఆస్ట్రేలియన్ స్పిన్నర్ నాథన్ లియోన్ పేర్కొన్నాడు. 4 రోజుల టెస్టు మ్యాచ్‌లకు సంబంధించి 2017 అక్టోబర్‌లోనే ఐసీసీ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం 2023 నుంచి 2031 మధ్య జరగనున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ సిరీస్‌లలో నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లను అమలు చేయాలని ఐసీసీ పేర్కొంది. సాధారణంగా ఐదు రోజుల టెస్టు మ్యచ్‌లో రోజుకు 90 ఓవర్ల ఆట ఉండగా దానిని నాలుగు రోజులకు కుదించనుండడంతో రోజుకు 98 ఓవర్లు ఆడాల్సి వస్తుంది. 2018 నుంచి టెస్టు మ్యాచ్‌ల పరిస్థితి చూసుకుంటే దాదాపు 60 శాతం మ్యాచ్‌లు నాలుగు రోజుల్లోనే ముగుస్తుండడంతో ఐసీసీ 4రోజుల ప్రతిపాదనను తెరమీదకు తీసుకొచ్చింది. అయితే ఐసీసీ ప్రతిపాదనను పలువురు మాజీ క్రికెటర్లు స్వాగతించారు. అందులో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మార్క్ టేలర్, తదితరులు ఉన్నారు. 'ఐసీసీ తెచ్చిన 4రోజుల టెస్టు మ్యాచ్ ప్రతిపాదనను నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నా. నాలుగు రోజుల మ్యాచ్‌లు అమలు చేస్తే విజయాల శాతం కంటే డ్రాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఉదాహరణకు 2014లో అడిలైడ్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో చూసుకుంటే ఐదవ రోజున చివరి గంటలో ఫలితం తేలడం చూశారు. అలాగే 2014లోనే కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యచ్‌లో రెండు ఓవర్లలో మ్యాచ్ ముగుస్తుందనగా మా బౌలర్ రేయాన్ హారిస్ మోర్కెల్‌ను అవుట్ చేసి మా జట్టుకు విజయాన్ని అందించాడు.

ఎన్నో ఏళ్ల నా కల నెరవేరింది : హంపి



అమరావతి : ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్‌ను సాధించడంతో తన ఎన్నోఏళ్ల కల నేరవేరిందని కోనేరు హంపి ఆనందం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 28,29.30 తేదిల్లో రష్యాలోని మాస్కోలో జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో బంగారు పథకం సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచింది. ఈ సందర్భంగా స్వదేశానికి చేరుకున్న హంపిని బుధవారం గన్నవరం ఎయిర్‌పోర్టులో ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులతో పాటు, ఆమె కుటుంబ సభ్యులు శాలువా, బొకేలతో ఘన స్వాగతం పలికారు. హంపి మాట్లాడుతూ.. తన ఎన్నో ఏళ్ల కళ ఈసారి నెరవేరిందని, ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్‌ను సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. చిన్నప్పటి నుంచి మా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అందివ్వడంతోనే తాను ఈరోజు ఈ స్థాయికి చేరుకున్నానని వెల్లడించారు.

ఐపీఎల్ 2020 హంగామా మొదలు... అశ్విన్‌ని కవ్వించిన రాజస్థాన్ రాయల్స్



జైపూర్ : ఐపీఎల్ 2020 సీజన్ ఆరంభానికి ముందే టీమ్స్ మధ్య కవ్వింపులు మొదలైపోయాయి. ఈ ఏడాది మార్చి 29 నుంచి ఐపీఎల్ మొదలయ్యే సూచనలు కనిపిస్తుండగా.. 2019 ఐపీఎల్ సీజన్‌లో మాన్కడింగ్‌తో విమర్శలు ఎదుర్కొన్న కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మాజీ కెప్టెన్ అశ్విన్‌పై రాజస్థాన్ రాయల్స్ ఇప్పటి నుంచే కవ్వింపులకి దిగుతోంది. దీంతో.. ఐపీఎల్ 2020 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ మారిన అశ్విన్, రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కి మధ్య ఆధిపత్య పోరు జరగనుంది.

మాన్కడింగ్ మళ్లీ తెరపైకి ఎలా..?

ఐపీఎల్ 2020 సీజన్‌లోనూ మాన్కడింగ్ చేస్తారా..? అని ఇటీవల ఓ అభిమాని అడిగిన సరదా ప్రశ్నకి అశ్విన్ సమాధానమిస్తూ 'ఏ బ్యాట్స్‌మెన్ అయినా.. బంతి విసరక ముందే క్రీజు వెలుపలికి వెళ్తే..? ఐపీఎల్ 2020లోనూ మాన్కడింగ్ చేస్తా' అని బదులిచ్చాడు. ఐపీఎల్ 2019 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ జోస్ బట్లర్‌ని అశ్విన్ మాన్కడింగ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో.. అశ్విన్ తాజా మాన్కడింగ్ వ్యాఖ్యలపై రాజస్థాన్ రాయల్స్ కవ్వింపు ధోరణిలో రిప్లై ఇచ్చింది. దానికి అశ్విన్ కూడా బదులిచ్చాడు.

ఐపీఎల్ 2019 సీజన్‌లో అశ్విన్ తప్పిదమేంటి..?

సీజన్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ టీమ్ కెప్టెన్‌గా ఉన్న అశ్విన్.. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్ జోస్ బట్లర్‌ని మాన్కడింగ్ చేశాడు. టీమ్‌ని గెలుపు దిశగా నడిపిస్తున్న బట్లర్.. అశ్విన్ బౌలింగ్ సమయంలో బంతి విసరకముందే నాన్‌స్ట్రైక్ ఎండ్‌లోని క్రీజు వెలుపలికి వెళ్లిపోయాడు. దీంతో.. బౌలింగ్‌ని నిలిపివేసిన అశ్విన్.. బెయిల్స్‌ని పడగొట్టాడు. మ్యాచ్‌లో గెలిచేందుకు అశ్విన్ వైాసఫూరితంగా వ్యవహరించాడంటూ అభిమానులు విమర్శలు గుప్పించగా.. క్రీడాస్ఫూర్తి తప్పాడంటూ చాలా మంది మాజీ క్రికెటర్లు పెదవి విరిచారు. అయితే.. అశ్విన్ మాత్రం తాను క్రికెట్ నిబంధనలకి లోబడే మాన్కడింగ్ చేసినట్లు వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశాడు.

ఐపీఎల్ 2020 సీజన్ వేలానికి ముందు అశ్విన్‌ని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించిన పంజాబ్ టీమ్.. ఢిల్లీ క్యాపిటల్స్‌కి బదిలీ చేసింది. ఒకరకంగా చెప్పాలంటే అశ్విన్ కారణంగా 2019లో పంజాబ్ టీమ్ ఇమేజ్ కూడా డ్యామేజ్ అయ్యింది. ఎంతలా అంటే..? భారత ఓపెనర్ శిఖర్ ధావన్ సైతం అశ్విన్‌ని మాన్కడింగ్ చేస్తావా..? అంటూ మైదానంలోనే ఆటపట్టించాడు. దీంతో.. నష్ట నివారణ చర్యల్లో భాగంగా అశ్విన్‌ని కెప్టెన్సీ నుంచి తప్పించడమే కాకుండా.. జట్టు నుంచి కూడా వెలుపలికి పంపింది. ఈ చర్యలతో అశ్విన్ ఇప్పుడు కసి మీద ఉన్నాడు. పంజాబ్ టీమ్‌కి ఆడక ముందు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున అశ్విన్ ఆడిన విషయం తెలిసిందే. విమర్శలు ఎదురైనప్పుడు బలంగా పుంజుకోవడం అశ్విన్‌కి అలవాటు. కాబట్టి.. 2020 సీజన్‌లో అతని బౌలింగ్ వాడి మరింత పెరగనుంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.